

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

భోగి శుభాకాంక్షలు



ఆదివారం | 14-1-2024 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 270

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: తదియ ఉ. 8.01, చవితి తె. 4.59 వరకు; నక్షత్రం: ధనిష్ఠ ఉ. 10.23 తదుపరి శతభిషం; వర్జ్యం: సా. 4.54-6.21; దుర్ముహూర్తం: సా. 4.28-5.12; అమృతఘడియలు: రా. 1.36-3.03; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.56 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



షూటర్ విజయ్‌వీర్‌కు ఒలింపిక్ బెర్త్



జకర్తా: ఆసియా షూటింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో శనివారం జరిగిన 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ ఈవెంట్‌లో విజయ్ వీర్ సిద్ధూ.. క్వాలిఫికేషన్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచి భారత్‌కు 17వ ఒలింపిక్ బెర్త్ అందించాడు. ఇక, ఫైనల్స్‌లో సిద్ధూ రజతం దక్కించుకున్నాడు. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్ రజతం, ఆషి చౌక్సీ కాంస్యం సాధించారు.

ఇంకొక్క స్మాష్..



సెమీస్‌లో ప్రపంచ చాంపియన్లకు షాక్

టాప్ ర్యాంక్ జంటతో టైటిల్‌ఫైట్ నేడు

కౌలాలంపూర్: భారత బ్యాడ్మింటన్ స్టార్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి అరుదైన ఘనతకు చేరువయ్యారు. కెరీర్‌లో రెండో సూపర్ 1000 సిరీస్ టైటిల్ నెగ్గేందుకు అడుగు దూరంలో నిలిచారు. మలేసియా ఓపెన్‌లో డబుల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ సాత్విక్-చిరాగ్ 21-18, 22-20తో కొరియాకు చెందిన ప్రపంచ చాంపియన్, మూడో ర్యాంక్ జంట సియో సెంగ్ జె-కాంగ్ మిన్ హ్యుక్ షిద్‌ను చిత్తుచేసింది. తొలిగేమ్ సులువుగానే నెగ్గిన సాత్విక్ జోడీ.. రెండో గేమ్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనా 47 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించింది. గతేడాది జూన్‌లో ఇండోనేసియా ఓపెన్‌తో కెరీర్‌లో తొలి సూపర్ 1000 టైటిల్ సాధించిన సాత్విక్ జోడీ.. ఆ టోర్నీలోనూ సెమీస్‌లో ఇదే ప్రత్యర్థిని ఓడించి ఫైనల్ చేరడం విశేషం. ఆదివారం జరిగే టైటిల్ పోరులో చైనాకు చెందిన ప్రపంచ నెంబర్ వన్ జోడీ లియాంగ్ వీ కెంగ్-వాంగ్ చాంగ్‌తో సాత్విక్ ద్వయం అమీతుమీ తేల్చుకోనుంది.

సిరీస్‌పై భారత్ నజర్

అఫ్ఘానిస్థాన్‌తో రెండో టీ20 నేడు

ఏడాది తర్వాత కోహ్లీ తొలి మ్యాచ్



రాత్రి 7 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

ఇండోర్: భారత్-అఫ్ఘానిస్థాన్ మధ్య రెండో టీ20 ఆదివారం ఇక్కడ జరగనుంది. మొదటి మ్యాచ్‌లో సునాయాసంగా గెలుపొందిన టీమిండియా..రెండో టీ20నీ నెగ్గి సిరీస్‌ను చేజిక్కించుకోవాలని భావిస్తోంది. తొలి మ్యాచ్‌కు దూరమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, యశస్వీ జైస్వాల్ రెండో టీ20కి సిద్ధమయ్యారు. అయితే సంవత్సరం విరామం తర్వాత టీ20 జట్టులోకి పునరాగమనం చేస్తున్న విరాట్ ఎలా ఆడతాడనేది ఆసక్తికరం. ఇక అఫ్ఘాన్‌పై సిరీస్ విజయం దక్కితే జట్టులోని యువ క్రికెటర్లకు అది ఇచ్చే కిక్కే వేరు. కారణం..భవిష్యత్‌లో కూడా టీమిండియాలో చోటు కోసం యువ ఆటగాళ్లు ప్రధానంగా పోటీలో ఉండేందుకు సిరీస్ గెలుపు తోడ్పడటమే. ఈ ఏడాది పొట్టి వరల్డ్ కప్ జరగనుండడంతో.. సెలెక్టర్ల దృష్టిలో పడాలంటే జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ రెండో మ్యాచ్‌లో మరింతగా రాణించాల్సి ఉంటుంది. జట్టులో చోటుకోసం ఇషాన్ కిషన్‌తో పోటీపడుతున్న వికెట్ కీపర్, బ్యాటర్ జితేశ్ శర్మకు అఫ్ఘాన్‌తో చివరి రెండు మ్యాచ్‌లు కీలకం కానున్నాయి. లోయరార్డర్‌లో 30కిపైగా స్కోర్లు సాధిస్తున్నా జట్టులో తన స్థానం సుస్థిరం చేసుకోవాలంటే జితేశ్ ఇంకా భారీ స్కోర్లు చేయాలి. నిరుడు వెస్టిండీస్‌పై టీ20ల అరంగేట్రంలో అదరగొట్టిన హైదరాబాదీ తిలక్ వర్మ ఆపై అదే స్థాయి ప్రదర్శన చేయలేకపోతున్నాడు. భారత జట్టు సుదీర్ఘ ప్రణాళికల్లో తానూ ఉండాలంటే 21 ఏళ్ల తిలక్ బ్యాట్ ఝళిపించాల్సిందే. అయితే విరాట్ అందుబాటులో ఉండడంతో..తుది 11 మందిలో తిలక్‌కు చోటు దక్కుతుందా అన్నది చూడాలి. మొదటి మ్యాచ్‌లో రెండు వికెట్లతో భళా అనిపించిన లెఫ్టామ్ స్పిన్నర్ అక్షర్ అదే జోరు కొనసాగించి తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని చూస్తున్నాడు. పునరాగమనం చేసిన వాషింగ్టన్ సుందర్‌కు ఈ మ్యాచ్ ఎంతో కీలకం. మరోవైపు మొదటి మ్యాచ్ పరాజయాన్ని పక్కనబెట్టి..జూలు విదల్చడం ద్వారా సిరీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలని అఫ్ఘానిస్థాన్ పట్టుదలగా ఉంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్/గిల్, విరాట్, శివమ్ దూబే, రింకూ సింగ్, జితేశ్ శర్మ (కీపర్), అక్షర్, సుందర్, కుల్దీప్/బిష్ణోయ్, అర్ష్‌దీప్, ముకేశ్/అవేశ్.

అఫ్ఘానిస్థాన్: ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మనుల్లా (కీపర్), హజ్రతుల్లా/రహమత్ షా, ఒమర్‌జాయ్, మహ్మద్ నబీ, నజీబుల్లా జద్రాన్, కరీమ్ జానత్, గుల్బదీన్ నైబ్, ముజీబుర్ రహ్మాన్, నీవన్ ఉల్ హక్, ఫరూఖీ.

పిచ్/వాతావరణం

వికెట్ ఫ్లాట్‌గా ఉంటుంది. చిన్న బౌండరీలు కావడంతో భారీ స్కోర్లు నమోదవుతాయి. మొహాలీలో మాదిరి అతి చలిగా కాకుండా వాతావరణం అహ్లాదకరంగా ఉండే అవకాశముంది.

జొకోకు ఎదురుందా?

ఉ. 5.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



సబలెంక జొకోవిచ్

● ప్రపంచ రికార్డు వేటలో నొవాక్
● నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: టెన్నిస్ చరిత్రలోనే అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన ఆటగాడి రికార్డుకు అడుగు దూరంలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. తాజా సీజన్‌ను గ్రాండ్‌గా ఆరంభించాలనుకొంటున్నాడు. ఆదివారం నుంచి జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంప్ జొకో మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. మరోసారి ఇక్కడ విజేతగా నిలిస్తే అత్యధికంగా 25 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన ఒకే ఒక్కడిగా నొవాక్ ప్రపంచ రికార్డు నెలకొల్పుతాడు. ప్రస్తుతం 24 టైటిళ్లతో మార్గరెట్ కోర్ట్‌తో జొకో సమంగా ఉన్నాడు. ఇక, ఈ వేదికపై 2019, 2020, 2021లో హ్యాట్రిక్ టైటిళ్లు నెగ్గిన నొవాక్‌ను వ్యాక్సిన్ తీసుకోని కారణంగా 2022లో ఆడనివ్వలేదు. అయితే, 2023లో బరిలోకి దిగి విజేతగా నిలిచాడు. మరోవైపు నొవాక్ చిరకాల ప్రత్యర్థి రఫెల్ నడాల్ గాయంతో ఈ టోర్నీకి దూరమైనా.. రెండో సీడ్ కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్), మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) నుంచి జొకోకు గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. గతేడాది రన్నరప్ స్టెఫనోస్ సిట్సిపాస్ (గ్రీస్)తోపాటు రుబ్లేవ్, రూడ్ కూడా జొకోకు సవాల్ విసిరేందుకు సిద్ధమయ్యారు. కాగా, గతవారం జరిగిన యునైటెడ్ కప్‌లో నొవాక్ మణికట్టుకు గాయమైంది. కానీ, తాను ఫిట్‌గా ఉన్నట్టు చెప్పిన జొకో.. తొలి రౌండ్‌లో క్వాలిఫయర్ డినో ప్రిజ్‌మిక్ (క్రొయేషియా)తో తలపడనున్నాడు.

కొత్త చాంపియన్ వచ్చేనా?

ఈసారి మహిళల విభాగంలో పోటీ రసవత్తరంగా ఉంది. గతేడాది జరిగిన నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల్లో వేర్వేరు క్రీడాకారిణులు విజేతలుగా నిలిచారు. అయితే, ఇక్కడ డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక (బెలారస్), టాప్‌సీడ్ ఇగా స్వియటెక్ (పోలెండ్) మధ్య టైటిల్ పోరు జరగొచ్చన్నది టెన్నిస్ పండితుల అంచనా. మూడో సీడ్ ఎలెనా రిబకినా (కజకిస్థాన్), అమెరికా టీనేజర్, యూఎస్ ఓపెన్ విజేత కోకో గాఫ్ కూడా టైటిల్ ఫేవరెట్లలో ఉన్నారు. తొలి రౌండ్‌లో క్వాలిఫయర్ ఎల్లా సిడెల్ (జర్మనీ)తో సబలెంక, సోఫియా కెనిన్‌తో స్వియటెక్ తలపడనున్నారు. వింబుల్డన్ చాంప్ వండ్రసోవా, జెస్సికా పెగుల కూడా టైటిల్ నెగ్గాలనే పట్టుదలతో ఉన్నారు. కాగా, తల్లి అయ్యాక బరిలోకి దిగుతున్న మాజీ చాంప్ ఒసాక, వెటరన్లు అజరెంకా, వోజ్నియాకి కూడా టైటిల్‌పై కన్నేశారు.

అవకాశాలు చేజార్చుకొని..

అమెరికా చేతిలో భారత్ ఓటమి

ఒలింపిక్ మహిళల హాకీ క్వాలిఫయర్స్



రాంచి: పారిస్ విశ్వ క్రీడల బెర్త్ పట్టేయాలని పట్టుదలగా బరిలో దిగిన భారత మహిళల జట్టుకు ఆరంభంలోనే చుక్కెదురైంది. శనివారం ఇక్కడ ప్రారంభమైన ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీ..గ్రూప్ 'బి' తమ తొలి పోరులో సవితా పూనియా సారథ్యంలోని భారత జట్టు 0-1తో 24వ ర్యాంకర్ అమెరికా చేతిలో పరాజయం చవిచూసింది. అబిగెయిల్ తోమెర్ (16వ ని.) చేసిన ఏకైక గోల్‌తో అమెరికా విజయ దక్కించుకుంది. ప్రపంచ ర్యాంకుల్లో ఆరో స్థానంలో ఉన్న భారత్..మ్యాచ్‌లో సింహభాగం బంతిని తన అధీనంలోనే ఉంచుకుంది. కానీ ప్రత్యర్థి రక్షణ శ్రేణిని ఛేదించలేకపోయింది. ఏడు పెనాల్టీ కార్నర్లు లభించినా ఒక్క దానినీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆదివారం జరిగే రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో మన మహిళలు తలపడతారు. మొదటి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ 3-0తో ఇటలీని చిత్తు చేయగా..జపాన్ 2-0తో చెక్ రిపబ్లిక్‌పై, జర్మనీ 3–0తో చిలీపై విజయం సాధించాయి.

నితీశ్ పాంచ్ పటాకా

ముంబై 395 ఆలౌట్ ● ఆంధ్రతో రంజీ

ముంబై: ఆల్‌రౌండర్ తనూష్ (54), మీడియం పేసర్ మోహిత్ (53) అర్ధ శతకాలతో రాణించడంతో ఆంధ్రతో రంజీ మ్యాచ్‌లో ముంబై తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 281/6తో శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ముంబై 395 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర మీడియం పేసర్ నితీశ్‌కుమార్ రెడ్డి ఐదు (5/64) వికెట్లు తీసి సత్తా చాటాడు. షోయబ్, లలిత్ చెరో 2, రషీద్ ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఆంధ్ర 25 పరుగుల వ్యవధిలో ఓపెనర్ జ్ఞానేశ్వర్ (23), వన్‌డౌన్ బ్యాటర్ షేక్ రషీద్ (3), మాజీ కెప్టెన్ విహారి (6) వికెట్లు కోల్పోయింది. వరుసగా వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో ఓపెనర్ ప్రశాంత్ (59 నాటౌట్) క్రీజులో పాతుకుపోయాడు. దీంతో రెండోరోజు ఆట ముగిసేసరికి ఆంధ్ర 37 ఓవర్లలో 98/3 స్కోరు చేసింది. క్రీజులో ప్రశాంత్‌తో పాటు రికీ భుయ్ (4) ఉన్నాడు.

అల్టిమేట్ ఖో-ఖో చాంపియన్ జెయింట్స్

● ఫైనల్లో చెన్నైపై గుజరాత్ గెలుపు
● తెలుగు యోధాస్‌కు 4వ స్థానం



కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2 టైటిల్‌ను గుజరాత్ జెయింట్స్ కైవసం చేసుకొంది. శనివారం ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో గుజరాత్ 31-26తో చెన్నై క్విక్‌గన్స్‌ను ఓడించింది. కాగా, తెలుగు యోధాస్ జట్టు మరోసారి నిరాశపరిచింది. మూడోస్థానం కోసం జరిగిన ప్లేఆఫ్ పోరులో యోధాస్ 24-32తో డిఫెండింగ్ చాంప్ ఒడిశా జుగర్‌నాట్స్ చేతిలో ఓడి నాలుగో స్థానానికి పరిమితమైంది. అటాకర్లు టచ్‌పాయింట్లు తీసుకురావడంలో విఫలమవడంతో తెలుగు యోధాస్‌కు పరాజయం తప్పలేదు.

బోపన్న జోడీ రన్నరప్‌తో సరి



అడిలైడ్: భారత టెన్నిస్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్న ఈ సీజన్‌ను రన్నరప్‌తో టైటిల్‌తో మొదలుపెట్టాడు. ఆస్ట్రేలియా ఆటగాడు మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి బోపన్న అడిలైడ్ ఇంటర్నేషనల్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో మూడోసీడ్ రాజీవ్ రామ్- సాలిస్‌బరీ జంట 7-5, 7-5, 11-9తో బోపన్న ద్వయాన్ని ఓడించి విజేతగా నిలిచింది.

పుణె జోరుకు జైపూర్ బ్రేక్

జైపూర్: పుణెరి పల్టన్ వరుస 8 విజయాలకు డిఫెండింగ్ చాంప్ జైపూర్ పింక్ పాంథర్స్ బ్రేకులు వేసింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో శనివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 36-34తో పుణెరి పల్టన్‌పై గెలిచింది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 42-37తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది.

ఓటమితో ఆరంభం

ఏఎఫ్‌సీ కప్‌లో భారత్‌కు నిరాశ

అల్ రయాన్ (కతార్): ఏఎఫ్‌సీ ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత్‌కు ఆరంభంలోనే నిరాశ ఎదురైంది. గ్రూప్-బిలో భాగంగా శనివారం జరిగిన తమ తొలి పోరులో భారత్ 0-2తో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. ఆసీస్ తరపున రెండు గోల్స్‌ను జాక్సన్ ఇర్విన్ (50వ), జోర్డాన్ బ్రాస్ (73వ) కొట్టారు. గ్రూప్‌లో తన రెండో మ్యాచ్‌ను భారత్ ఈనెల 18న ఉజ్బెకిస్థాన్‌తో ఆడనుంది.

టాటా కన్స్యూమర్ గూటికి 2 కంపెనీలు

డీల్ విలువ రూ.7,000 కోట్లు

న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టీసీపీఎల్) ఒకేసారి రెండు కంపెనీలను కొనుగోలు చేసింది. చింగ్స్ సీక్రెట్, స్మిత్ అండ్ జోన్స్ బ్రాండ్ల ఉత్పత్తుల తయారీదారు క్యాపిటల్ ఫుడ్స్‌తో పాటు హెల్త్ అండ్ వెల్‌నెస్ ఉత్పత్తుల విక్రయ కంపెనీ ఆర్గానిక్ ఇండియాను టేకోవర్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ రెండు డీల్స్ మొత్తం విలువ రూ.7,000 కోట్లు. అందులో, క్యాపిటల్ ఫుడ్స్‌ను రూ.5,100 కోట్లకు, ఆర్గానిక్ ఇండియాను రూ.1,900 కోట్లకు దక్కించుకుంది. వేగంగా వృద్ధి చెందుతున్న, పోటీ అధికంగా ఉన్న ఈ రెండు సెగ్మెంట్లలో టీసీపీఎల్ నిలదొక్కుకునేందుకు ఈ కొనుగోళ్లు దోహదపడనున్నాయి. అంతేకాదు, ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియో విస్తరణ ద్వారా టాటా కన్స్యూమర్ పూర్తిస్థాయి ఎఫ్ఎంసీజీ కంపెనీగా రూపాంతరం చెందేందుకు సైతం తోడ్పడనున్నాయి.

క్యాపిటల్ ఫుడ్స్‌లో తొలుత 75 శాతం వాటా కొనుగోలుకు కంపెనీ ప్రమోటర్లు, ఇతర వాటాదారులతో టీసీపీఎల్ షేర్ల కొనుగోలు అగ్రిమెంట్ కుదుర్చుకుంది. ఈ లావాదేవీ పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. మిగతా 25 శాతం వాటాను సైతం మూడేళ్లలో టేకోవర్ చేయనున్నట్లు టాటా కన్స్యూమర్ వెల్లడించింది. ఆర్గానిక్ ఇండియా కొనుగోలు లావాదేవీ సైతం పూర్తిగా నగదు రూపంలో జరగనుందని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో క్యాపిటల్ ఫుడ్స్ ఆదాయం రూ.705.5 కోట్లు, ఆర్గానిక్ ఇండియా రెవెన్యూ రూ.324.4 కోట్లుగా నమోదైంది.

2027 నాటికి దేశంలో 10 కోట్ల ధనికులు

గోల్డ్‌మన్ శాక్స్ అంచనా



న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్ల (2027 నాటికి)లో ధనిక భారతీయులు 10 కోట్లకు చేరుకోవచ్చని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ప్రస్తుతం వీరి సంఖ్య 6 కోట్ల స్థాయిలో ఉందని, 2027 నాటికి 67 శాతం వృద్ధితో పది కోట్లకు చేరుకోవచ్చని తాజా నివేదికలో పేర్కొంది. కనీసం 10,000 డాలర్ల (రూ.8.3 లక్షలు) వార్షికాదాయం కలిగిన వారిని ఈ జాబితాలో చేర్చింది. ప్రస్తుతం వేతన జీవుల్లో 4 శాతం మాత్రమే ఏటా 10,000 డాలర్లకు పైగా ఆదాయం ఆర్జిస్తున్నారని, దేశ తలసరి ఆదాయం 2,100 డాలర్ల (రూ.1.75 లక్షలు)కు దాదాపు ఐదు రెట్లు అధికమిదని రిపోర్టులో ప్రస్తావించింది. 2019-23 మధ్య కాలంలో ధనిక భారతీయులు ఏటేటా 12 శాతం చొప్పున పెరుగుతూ వచ్చారని, ఇదే కాలానికి దేశ జనాభా ఒక శాతం చొప్పున పెరిగిందని గోల్డ్‌మన్ శాక్స్ అంటోంది. గత మూడేళ్లలో సంపన్న వర్గం వేగంగా వృద్ధి చెందడం ద్వారా దేశంలో ఈక్విటీలు, బంగారం, స్థిరాస్తి ఆర్థిక, భౌతిక ఆస్తులు కూడా గణనీయంగా పెరిగాయని నివేదిక పేర్కొంది. ప్రధానంగా ఈక్విటీ, బంగారం ఆస్తులు అధికంగా పెరిగాయని, గత 3-4 ఏళ్లలో స్థిరాస్తి ధరలు గరిష్ఠ వృద్ధిని నమోదు చేసుకున్నాయంటోంది. 2023లో డీమ్యాట్ ఖాతాలు 2.8 రెట్లు పెరిగి 11.4 కోట్లకు చేరుకున్నాయని, బీఎస్ఈ 200 లిస్టెడ్ కంపెనీల స్టాక్స్, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు సైతం గణనీయంగా పెరిగాయంది.

2019-23 మధ్యకాలంలో భారతీయుల వద్దనున్న బంగారం విలువ 63 శాతం పెరిగి 1.8 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుందని రిపోర్టు తెలిపింది. ధనిక వర్గం పెరుగుదల పలు రంగాలపై సానుకూల ప్రభావం చూపిందని గోల్డ్‌మన్ శాక్స్ అంటోంది. ఎఫ్ఎంసీజీ, పాదరక్షలు, ఫ్యాషన్ వస్త్రాలు, ప్యాసింజర్ వాహనాలు, ద్విచక్ర వాహన విభాగాల్లో ప్రీమియం ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. అధిక ఆదాయ వర్గాల వినియోగ అవసరాలపై దృష్టి సారించిన కంపెనీలు మెరుగైన పనితీరు కనబర్చాయి.

జువెలరీ, పర్యాటకం, ప్రీమియం రిటైల్, ప్రీమియం హెల్త్‌కేర్ సేవల వ్యాపారాలు భారీగా లాభపడ్డాయని రిపోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి క్రెడిట్ కార్డు హోల్డర్లు 80 శాతం పెరగగా.. కార్డుల ద్వారా వ్యయాలు 250 శాతం పెరిగాయని తెలిపింది.

ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా మైక్రోసాఫ్ట్

Microsoft

రెండో స్థానానికి యాపిల్

న్యూయార్క్: అమెరికన్ స్టాక్ మార్కెట్లో శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి, యాపిల్‌ను వెనక్కి నెట్టి మైక్రోసాఫ్ట్ ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. ఈ వారంలో మైక్రోసాఫ్ట్ షేర్లు 3 శాతానికి పైగా పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) 2.89 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇదే సమయంలో యాపిల్ షేర్లు 3 శాతానికి పైగా క్షీణించడంతో, సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ 2.87 లక్షల కోట్ల డాలర్లకు జారుకుంది. గురువారం ఇంట్రాడే ట్రేడింగ్‌లోనూ కొద్ది సమయం పాటు మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాప్ యాపిల్‌ను మించినప్పటికీ, మళ్లీ కిందికి జారుకుంది. ప్రపంచంలోని విలువైన కంపెనీల లిస్ట్‌లో మైక్రోసాఫ్ట్ నం.1 స్థానానికి చేరుకోవడం 2021 తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి. జనరేటివ్ ఏఐ అప్లికేషన్ చాట్ జీపీటీ అభివృద్ధి సంస్థ ఓపెన్ఏఐలో పెట్టుబడులతో పాటు చాట్‌జీపీటీని తన ఉత్పత్తుల్లో వినియోగించుకోనున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించడం కంపెనీ షేర్ల ర్యాలీకి దోహదపడింది. కాగా, యాపిల్ ఐఫోన్ల గిరాకీ మందగించడం సంస్థ షేర్ల విలువ క్షీణతకు కారణమైంది.

డీమార్ట్ లాభం రూ.690 కోట్లు

న్యూఢిల్లీ: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రిటైల్ చెయిన్ డీమార్ట్‌ను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ నికర లాభం 17 శాతం వృద్ధి చెంది రూ.690.41 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ లాభం రూ.589.64 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కార్యకలాపాల నుంచి వచ్చిన ఆదాయం కూడా 17.31 శాతం వృద్ధితో రూ.13,572.47 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు రూ.12,656.46 కోట్లుగా ఉన్నట్లు అవెన్యూ సూపర్‌మార్ట్స్ పేర్కొంది. కాగా డిసెంబరు ముగిసే నాటికి మొత్తం స్టోర్ల సంఖ్య 341గా ఉందని తెలిపింది.

భారత మార్కెట్లోకి తొలిసారిగా యాంటీ డయాబెటిక్ ఔషధం లిరాగ్లుటైడ్ బయోసిమిలర్‌ను తీసుకువచ్చినట్లు గ్లెన్‌మార్క్ వెల్లడించింది. లిరాఫిట్ బ్రాండ్ పేరుతో ఈ బయోసిమిలర్ ఔషధాన్ని విడుదల చేసినట్లు తెలిపింది. టైప్-2 మధుమేహ రోగుల్లో గ్లైసిమిక్‌ను నియంత్రించటంలో ఈ ఔషధం సమర్థవంతంగా పనిచేస్తుందని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,270 ▲	58,000 ▲	78,000 ▲
ముంబై	62,515 ▲	57,264 ▲	71,530 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
14 జనవరి		విశాఖపట్నం	599
చిత్తూరు	563	వరంగల్	542
గోదావరి	555	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	గోదావరి	101
వరంగల్	102	విజయవాడ	101
కరీంనగర్	102	గుంటూరు	102
మహబూబ్‌నగర్	102	ఒంగోలు	102
కర్నూలు	102	చిత్తూరు	103
విశాఖపట్నం	96		

నయా ఫండ్స్.. ఓల్డ్ బ్రిడ్జ్ ఎంఎఫ్.. ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్

ఓల్డ్ బ్రిడ్జ్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్.. 'ఓల్డ్ బ్రిడ్జ్ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్' పేరుతో కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ ఫండ్. ఈ ఫండ్ గరిష్ఠంగా 30 మల్టీక్యాప్ షేర్లలో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈ నెల 17న ప్రారంభమై 19న ముగుస్తుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. సిప్ రూపంలో అయితే రూ.2,500 పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది.

బంధన్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బంధన్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ పథకం. ఈ ఫండ్.. భారత ఈక్విటీలతో పాటు అంతర్జాతీయ ఈక్విటీలు, ఆర్బిట్రేజ్, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, బంగారం, వెండి.. విభాగాల్లో పెట్టుబడులు పెడుతుంది. ఇందులో 50 శాతం పెట్టుబడులు భారత ఈక్విటీల్లోని లార్జ్,మిడ్, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌ల్లో పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 24.

మిరే అసెట్ అలోకేషన్ ఫండ్

మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్.. రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్లతో మిరే అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. గ్రోత్ ఆప్షన్, ఇన్‌కమ్ డిస్ట్రిబ్యూషన్ కమ్ క్యాపిటల్ విత్‌డ్రాయల్ (ఐడీసీడబ్ల్యూ) ఆప్షన్స్‌తో దీన్ని తీసుకువచ్చింది. ఈ ఫండ్‌కు బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లుగా ఎస్ అండ్ పీ బీఎస్ఈ 200 టీఆర్ఐ, నిఫ్టీ షార్ట్ డ్యూరేషన్ డెట్ ఇండెక్స్ ఉండనున్నాయి. డెట్, గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌ల్లో కూడా పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. సిప్ రూపంలో అయితే రూ.500 నుంచి పెట్టుబడులు పెట్టుకుంటూ పోవచ్చు. ఈ నెల 24న ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది.

బజాజ్ ఫిన్‌సర్వ్.. నిఫ్టీ 50 ఈటీఎఫ్, నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్

బజాజ్ ఫిన్‌సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్.. తొలిసారిగా రెండు కొత్త ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను విడుదల చేసింది. బజాజ్ ఫిన్‌సర్వ్ నిఫ్టీ 50 ఈటీఎఫ్, నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్ పేరుతో వీటిని తీసుకువచ్చింది. భారత స్టాక్ మార్కెట్లో ఇవి రెండు కీలకమైన బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లుగా ఉన్నాయని, వీటిల్లో ఇన్వెస్టర్లు వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టేందుకు అవసరమైన తోడ్పాటును ఈ ఈటీఎఫ్‌లు అందించనున్నాయని బజాజ్ ఫిన్‌సర్వ్ వెల్లడించింది. ఈ ఈటీఎఫ్‌లను ఎన్ఎస్ఈ, బీఎస్ఈల్లో లిస్టింగ్ చేయనుంది. ఈ ఫండ్స్‌కు నిఫ్టీ 50 టీఆర్ఐ, నిఫ్టీ బ్యాంక్ టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లుగా ఉన్నాయి. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 18.

అపార్ట్‌మెంట్ రెసిడెన్స్ సంఘాలు జీఎస్‌టీ చెల్లించాలా?



రాంబాబు గొండాల

ఇదీ GST

ఒకప్పుడు అపార్ట్‌మెంట్ అంటే నాలుగైదు అంతస్తులకు మాత్రమే పరిమితమై ఉండేవి. వీటిలో కనీస అవసరాలు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ప్రజల జీవన శైలి మారటం, అభిరుచుల్లో మార్పులతో పాటు బ్యాంకింగ్ సేవలు అందరికీ అందుబాటులోకి రావటంతో వివిధ సదుపాయాలు ఉండే బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. వీటిలో సకల సౌకర్యాలు ఉండటంతో చాలా మంది వీటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. బిల్డర్ తాను అపార్ట్‌మెంట్ కట్టే సమయంలో అన్ని సౌకర్యాలు కల్పించినా ఆ తర్వాత వాటిని మెయింటెయిన్ చేయటం చాలా ఖర్చుతో కూడుకున్న పని. అందుకే అపార్ట్‌మెంట్‌లో నివసించే వారు ఒక సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటారు. దీన్ని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ లేదా సొసైటీగా వ్యవహరిస్తారు.

ఈ అసోసియేషన్ పని ఏమిటంటే అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అన్ని పనులు అంటే.. సెక్యూరిటీ, లిఫ్ట్, కామన్ ఏరియా, పార్క్‌లు, ఆట స్థలాలు మొదలైన వాటిని చూసుకుంటుంది. దీనిలో అపార్ట్‌మెంట్‌లోని అందరూ.. సభ్యులుగా వ్యవహరిస్తారు. నెలవారీ ఖర్చుల కోసం ప్రతి సభ్యుడి నుంచి కొంత మొత్తం మెయింటెనెన్స్ చార్జీల కింద వసూలు చేస్తారు. మరి ఇలా వసూలు చేసే మెయింటెనెన్స్ చార్జీల మీద ఆయా సంక్షేమ సంఘాలు జీఎస్‌టీ చెల్లించాలా? చెల్లించాల్సి వస్తే దాని విధివిధానాలు ఏమిటి? ఇలాంటి సందేహాలు చాలా మందికి ఉన్నాయి.

ముందుగా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ జీఎస్‌టీ చెల్లించాలా అంటే.. కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి. తమ సభ్యుల ద్వారా వసూలు చేసే మొత్తం.. సంవత్సరానికి రూ.20 లక్షలు దాటనంత వరకు ఆయా సంక్షేమ సంఘాలకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఒకవేళ ఆ మొత్తం రూ.20 లక్షలు దాటితే రిజిస్ట్రేషన్ తప్పకుండా తీసుకోవాలి. ఇంకా సభ్యుడి నుంచి వసూలు చేసే నెలవారీ మెయింటెనెన్స్ చార్జీ నెలకు రూ.7,500 మించకపోతే ఎలాంటి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు.

ఉదాహరణకు ఒక అపార్ట్‌మెంట్‌లో మూడు బెడ్‌రూముల ఫ్లాట్‌కు మెయింటెనెన్స్ చార్జీ నెలకు రూ.8,000, రెండు బెడ్‌రూముల ఫ్లాట్‌కు రూ.7,000 అనుకుందాం. అప్పుడు మూడు బెడ్‌రూముల ఫ్లాట్‌కు సంబంధించిన మెయింటెనెన్స్ చార్జీల మీద అంటే రూ.8,000 మీద మాత్రమే జీఎస్‌టీ కడితే సరిపోతుంది. అయితే ఇక్కడా ఒక సందేహం రావచ్చు. రూ.7,500 వరకు పన్ను మినహాయింపు ఉంది కాబట్టి.. అది పోను మిగతా మొత్తం మీద అంటే రూ.500 మీద జీఎస్‌టీ కడితే సరిపోతుందా అని. అయితే దీనికి సంబంధించి ప్రభుత్వం ఒక వివరణ ఇవ్వటం జరిగింది. దీని ప్రకారం ఒక నెల మెయింటెనెన్స్ చార్జీ రూ.7,500 దాటినట్లయితే.. మొత్తం చార్జీ మీద జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుంది. అంటే ఇప్పుడు చెప్పుకున్న ఉదాహరణలో రూ.500 మీద కాకుండా మొత్తం రూ.8,000 మీద జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుంది. అలాగే ఒక అపార్ట్‌మెంట్‌లో ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఫ్లాట్లు ఉంటే జీఎస్‌టీ కోసం మెయింటెనెన్స్ చార్జీ మొత్తంగా కలిపి చూడాలా లేదా విడివిడిగా చూడాలా అనే సందేహం కూడా చాలా మందికి ఉంటుంది. పైన చెప్పిన ఉదాహరణలో ఒకే వ్యక్తికి ఒక ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్, డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ ఉన్నాయనుకుందాం. రెండింటి మీద కలిపి రూ.15,000 మెయింటెనెన్స్ చార్జీ కట్టాల్సి వస్తుంది. ఈ మొత్తం పన్ను మినహాయింపు పరిమితి రూ.7,500కి మించి ఉంది కాబట్టి మొత్తం మీద జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుందా? దీనికి కూడా ఒక వివరణ ఇవ్వటం జరిగింది. ఒక వ్యక్తికి ఎన్ని ఫ్లాట్స్ ఉన్నప్పటికీ ఏ ఫ్లాట్‌కు అయితే మెయింటెనెన్స్ చార్జీ రూ.7,500 దాటుతుందో దాని మీద మాత్రమే జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుంది. కొన్ని అపార్ట్‌మెంట్స్‌లో తక్కువ సంఖ్యలో ఫ్లాట్స్ ఉన్నప్పుడు మెయింటెనెన్స్ చార్జీ రూ.7,500 దాటినప్పటికీ. వార్షిక టర్నోవర్ రూ.20 లక్షలు దాటకపోవచ్చు. అలాంటప్పుడు కూడా ఆయా అసోసియేషన్స్‌కు జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఇంకొక విషయం ఏమిటంటే ఈ వెల్ఫేర్ సొసైటీ తాము పొందిన వస్తు సేవల మీద జీఎస్‌టీ నియమ నిబంధనల మేర ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకోవచ్చు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
భోగి శుభాకాంక్షలు

'ఇండియా' చైర్మన్‌గా ఖర్గే



- విపక్ష కూటమి ఏకగ్రీవ ఆమోదం
- కన్వీనర్‌గా నితీశ్ పేరు ప్రతిపాదన
- తిరస్కరించిన జేడీయూ అధినేత
- బదులుగా ఉమ్మడి కమిటీకి సూచన

8

నేటి నుంచి రాహుల్ న్యాయ్ యాత్ర



మహిళలకు 'పీఎం కిసాన్' డబుల్!

8

- ప్రస్తుతం 6 వేలు.. 10 లేదా 12 వేలకు పెంపు
- మిగతా రైతులకు రూ.8 వేలు లేదా 9 వేలు
- లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం కసరత్తు

ఆదివారం | 14-1-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**



రావులపాలెంలో కోడి పుంజుతో రఘురామకు స్వాగతం

నాలుగేళ్ల తర్వాత నా గడ్డకొచ్చా

- ఈ అనుభూతిని మరవలేను
- కష్టకాలంలో బాబు, లోకేశ్, పవన్ అండ
- టీడీపీ-సేన అభ్యర్థిగా పోటీ చేస్తా: రఘురామ
- రాజమహేంద్రి విమానాశ్రయం నుంచి నరసాపురం వరకు భారీ ర్యాలీ

11



మా అబ్బాయి పెళ్లికి రండి!

10

- టీడీపీ అధినేత చంద్రబాబుకు షర్మిల ఆహ్వానం
- రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు ఉండకూడదు
- రాజకీయం మా వృత్తే కానీ జీవితం కాదు: షర్మిల

ఒకే మాట ఒకే బాట

వడివడిగా, ఉమ్మడిగా టీడీపీ-జనసేన అడుగులు

- చంద్రబాబు నివాసానికి పవన్ కల్యాణ్
- మూడున్నర గంటలపాటు సుదీర్ఘ చర్చలు
- సీట్లు, అభ్యర్థులు, ఉమ్మడి మేనిఫెస్టోపై చర్చలు
- అవసరమైనచోట పరస్పర సర్దుబాటుకు నిర్ణయం
- బలమైన అభ్యర్థులకు అవకాశమివ్వాలని తీర్మానం
- ఉమ్మడిగానే మేనిఫెస్టో విడుదల?



శనివారం ఉండవల్లిలోని తన నివాసానికి వచ్చిన పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

అమరావతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారుపై ఉమ్మడిగా పోరాటం, ఉమ్మడిగా పోటీ, ఉమ్మడి మేనిఫెస్టో.. వెరసి ఒకే మాట, ఒకే బాటగా ముందుకు సాగాలని టీడీపీ, జనసేన నిర్ణయించుకున్నాయి. ఎక్కడా పొరపొచ్చాలు రాకుండా.. అవసరమైన చోట సర్దుబాటుతో పరస్పరం సహకరించుకోవాలని తీర్మానించాయి. ఈ దిశగా టీడీపీ-జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య విస్తృత చర్చలు జరిగాయి. శనివారం సాయంత్రం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి పవన్ వెళ్లారు. సుమారు మూడున్నర గంటలపాటు ఇరువురు నేతలు భేటీ అయ్యారు. రాత్రి అక్కడే విందు కూడా చేశారు. ఈ

మిగతా 10వ పేజీలో...

ఫలించని 'నీలి' గోల!

- కాపు ఓట్లలో చీలికకు వైసీపీ యత్నం
- పొత్తులో చిచ్చు పెట్టేలా ప్రచారం
- వాటిని పట్టించుకోని యువత, నేతలు
- జనసేనలో వరుసగా చేరికలు
- మారుతున్న ముద్రగడ మనసు!

10

2 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లకు అభ్యర్థులు ఖరారు!

- నెల రోజులుగా పవన్ కసరత్తు
- సాన సతీశ్‌కు కాకినాడ ఎంపీ
- బాలశౌరికి బందరు లేదా గుంటూరు!

వైసీపీకి షాక్..

ఎంపీ బాలశౌరి గుడ్‌బై

- ఎక్స్ వేదికగా పార్టీకి రాజీనామా
- తిడితే సహించేదిలేదని పరోక్ష హెచ్చరిక
- జనసేనలోకి వెళ్తానని వెల్లడి

8



కీలక తరుణంలో వైసీపీకి రాజీనామా చేసిన కాపు నేత





కాకినాడ జిల్లా సర్పవరంలో పకడ్బందీ ఏర్పాట్లతో సిద్ధమైన బరి

పందేలకు సై!

- కోళ్లు.. కోట్లూ.. అన్నీ సిద్ధం.. హోటళ్లు, విడిదిళ్లూ కిటకిట
- బరుల చెంతనే మద్యం.. జూదం.. చేతులు మారనున్న రూ.కోట్లు
- ఈడుపుగల్లులో సీఎం జగన్ జెండాలతో స్వాగత ఏర్పాట్లు

అమరావతి, భీమవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేళ.. కోడి పందేలకు బరులు సిద్ధమయ్యాయి. పందేల బరులు.. వాటిని వీక్షించేందుకు ఎత్తైన పరంజాలు, ఆ పక్కనే కోడి పలావు, పకోడి.. వాటి

మిగతా 10వ పేజీలో...

పల్లెకు పోదాం..

10

పతాక స్థాయిలో పండగ ప్రయాణాలు

- ఎన్‌హెచ్-65పైకి పోటెత్తిన కార్లు.. టోల్ ప్లాజాల వద్ద కిటకిట
- హైదరాబాద్ నుంచి బెజవాడకు 6 లక్షల మంది.. ఆర్టీసీ, రైల్వే అంచనా
- బస్సులు, రైళ్లు, విమానాలన్నీ ఫుల్.. దాంతో కార్లలోనే బెజవాడకు



సంక్రాంతి ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బెజవాడ బస్టాండ్

అయ్యగారు.. అబ్బాయి జోరు



అమ్మో ఎమ్మెల్యే

తండ్రీ కొడుకుల కబ్జా కాండ



అక్రమంగా తవ్వితీసిన లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలిస్తున్న లారీలను గడచిన నాలుగున్నరేళ్లలో స్థానిక ప్రజలు 70 సార్లకు పైగా అడ్డుకుని సంబంధిత అధికారులకు అప్పగించారు. ఒక్కోసారి ప్రాణాలకు తెగించి మరీ పట్టుకున్నారు. ఈ ప్రయత్నాల్లో గాయాలపాలయ్యారు కూడా. అయితే, మట్టి దందా ఎవరి ఆధ్వర్యంలో సాగుతుందో తెలిసిన పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు తూతూ మంత్రంగానే చలానాలు రాస్తున్నారు. రాత్రి పట్టుకున్న వాహనాలను ఉదయానికల్లా పోలీస్ స్టేషన్ల పరిధిలో లేకుండా పంపించేస్తున్నారు. అబ్బాయ్‌కి తిరుగులేని విధేయత చూపుతున్నారు.

దెబ్బంటే బాబాయ్‌దే! అబ్బాయికి బాబాయి వరసయ్యే ఆ వ్యక్తి కొల్లేరును ఎడాపెడా కొల్లగొట్టేస్తున్నారు. కొల్లేరు ప్రాంతంలో ఒక్కో రైతు నుంచి ఎకరానికి రూ.25 వేల చొప్పున వసూలు చేశారు. సుమారు 700-800 ఎకరాల కొల్లేరు భూముల్లో వారికి చేపల చెరువులకు అనధికారికంగా అనుమతులిచ్చేశారు. ప్రస్తుతం ఆ భూములన్నీ చెరువులుగా మారిపోయాయి. దాదాపు 1600 ఎకరాల దాకా కొల్లేరు భూములకు గేలం వేసి మంచినీటి సరస్సు ఉనికినే ప్రమాదంలో పడేశారు.

- ఏలూరు జిల్లాలో తవ్వుకుతింటున్నారు
- కొల్లేరునూ వదలరు.. కోర్టు చెప్పినా తగ్గరు
- భూ దోపిడీలో అబ్బాయ్ రూటే వేరు
- వసూళ్లకు మండలానికో సామంతుడు
- తండ్రి కన్నేసిన చోటల్లా ఎమ్మెల్యే స్వాహాపర్వం
- అక్రమ తవ్వకాలు, అనధికారిక లీజుల్లో కోట్లు
- అడ్డంగా దొరికినా వదిలేస్తున్న అధికారులు
- జీ గ్యాంగ్, బాబాయ్‌తోనూ దాడులు, దందాలు

(ఏలూరు - ఆంధ్రజ్యోతి)

భూములు, ఆస్తులు, పొలాలు, కాలువలపై తండ్రి కన్నేస్తాడు. అబ్బాయ్ దున్నేస్తాడు. రామాయణం తిప్పి చదువుకుంటే ఈ తండ్రీకొడుకులే కథానాయకులు. పేరుకేగానీ ఆ తండ్రికి రామచంద్రుడి గుణం ఒక్కటీ రాలేదు. తండ్రికి తగినవాడే అబ్బాయీ. దెబ్బకొడితే.. అబ్బ అని అరవడానికి

మిగతా 11వ పేజీలో...

సంక్రాంతి కాంతులు



శ్రీ శుభములిచ్చి తెలుగిళ్ళ సిరులు దెచ్చి
గతపు కార్తీక మాసపు కాంతులిచ్చి
పుష్య మాసపు పూజల పుణ్యమిచ్చి
తెలుగు ముంగిళ్ళ రావమ్మ వెలుగులిచ్చి

గత చితికిన బ్రతుకులలో వెతలు బాపి
మంచి మానవత మమత మనసు నిల్పి
క్రాంతితో భోగి సంక్రాంతి క్రమ రీతి
పెద్ద పండగై రావమ్మ పేర్మి మీర

ఉమ్మడి కుటుంబ బంధాల యాసులేవి
ఉన్న యూరిపై మమకారమున్న నేమి
పల్లె రైతు జీవితములు డొల్లలాయె
ధరలు ఆకాశవీధుల దరికి జేరె

అయిన మాయిళ్ళ ముంగిట యాడ పడుచు
లా గడప గడపలయందు లాటలాడి
పాడిపంటల పండగై భాగ్య రీతి
ముద్దు మురిపాలు తేవమ్మ ముద్దబంతి

చిరము శ్రీశైల మల్లన్న సిరులనివ్వ
దక్షవాటికా భీమన్న దయను జూప
భవుడు కాళేశ్వరుడు సదా భాగ్యమీయ
మన తెలుగు సీమలెప్పుడూ మహిత కాగ
ఇంటి యింటికిట శుభములీయ రామ్మ

– రాఘవ మాస్టారు కేదారి

సంక్రాంతి వర్ధిల్లుగాక



మేర లేని ప్రకృతి మంచు చీరగట్టు
సొగసులారబోయు భువి ఉషోదయాన
భక్తి భావ సంపదలకు పట్టు గొమ్మ
సత్కవి ప్రస్తుతంబైన సంకురాత్రి

బంతి పూలు విచ్చంగ సంక్రాంతి వచ్చె
కడగి దాసు పాడంగ సంక్రాంతి వచ్చె
రంగవల్లి పిల్వంగ సంక్రాంతి వచ్చె
గంగిరెద్దు చిందేయ సంక్రాంతి వచ్చె

అరయ సరసాల సరదాలకాకరమ్ము
అంబరంబంటు ప్రజలలో సంబరమ్ము
ఉక్కుప్రకటించు సమరాన కుక్కుటమ్ము
వశమే– వర్ణింప సంక్రాంతి వైభవమ్ము

భాగ్యమొసగు గదా క్రాంతి భావనంబు
శ్రేయమొసగు గదా భవ్యపాయసంబు
చెలిమి పంచు గదా నవజీవనంబు
కలిమి నింపు గదా శుభ కామితంబు

పృథివి మానవ బంధాల వేదిక యిదె

అవని పంచభక్ష్యపు పరమాన్నమిదియె
సంతతానంద సౌభాగ్య సారమిదియె
నూతనోత్సాహమొనగూర్చు చేతనమిదె

శ్రమకు పట్టంబు గట్టు పర్వంబులోన
జానపదకళారూపాలు కాననగును
దానధర్మాల సద్బుద్ధి కాననగును
పూని పసులనర్చించుట కాననగును

కన్గొనంగజాతికి గర్వకారణంబు
అతులమౌ సమైక్యగతికి ఆర్ణవంబు
భాసుర యశోరమణికి సింహాసనంబు
దివ్యపాశుర కాంతి వర్ధిల్లుగాక!!

– మంకు శ్రీను

సకల శుభావహమై...



కృషికి ఫలితము చేతికందెను
రైతుబిడ్డకు ముదము హెచ్చెను
గంగిరెద్దుల గుణము పోవలె
హేతువాదపు విలువ తెలిసిన
శాంతి పథమె మనది కావలె

నింగి నేలు ఉదయాద్రి శోభల
రంగురంగుల రంగవల్లుల
గొబ్బియల గారాల నెలవుల
రాగరంజిత రమ్యవిపంచిగ
సంకురాతిరి తరలి వచ్చెను
సకల శుభావహమై

మంచు ముత్యపు పిలుపునందిన
పుష్యమాసపు పడతి వధువై
మహీతలపు ప్రణయ వేదిక
ముగ్ధమోహన రాగసుధగా
సంకురాతిరి మరల వచ్చెను

భోగిమంటల నింగి కెగసిన
భాగ్యమేమియు కూడిరాదు
ఆ అగ్నిజ్వాలల దహన మవవలె
అంతరంగపు కలుషమంతయు

అపుడె జాతికి తేజ మొదవును
భాగ్యరాసులె పొంగి పొరలును
ప్రజల రాజమె వెలసినపు డదె
నిక్కమగు సంక్రాంతి పర్వము

– పింగళి పాండురంగారావు

కొత్త పొంగలి రుచులతో...



పాడి పంటలు పొంగి పొరలే
రైతు సంక్రాంతులు రావాలి

ఇళ్ల ముంగిళ్లలో
ముత్యాల ముగ్గులు మురిసినట్టు
చలిపొద్దు పొడుపులో
సూరీడు ఎర్రబారినట్టు
నవనవోన్మేశంగా
నవ సంక్రాంతులు రావాలి

పడతులు పూల సజ్జలై
పట్టు పరికిణీలు కట్టినట్టు
చెరుకు కంకుల గడలు
తియ్యందనాలను చిమ్మినట్టు
అభి'రుచుల' సంక్రాంతులు రావాలి

పిల్లల భోగిపళ్ల ముచ్చటలా
కోడి పందాల కలహాల హేలలా
రథం ముగ్గులో గొబ్బిల్లలా
కొత్త పొంగలి రుచులతో
కొంగ్రొత్తగా సంక్రాంతి రావాలి..!

----పాతకు గోరీ కడుతూ
కొత్తకు భేరీ కొడుతూ
భోగి మంటల సయ్యాటలా
బ్రతుకు బ్రతుకులో
సం'క్రాంతులు' రావాలి

గంగిరెద్దులు నాట్యమాడినట్టు
బొమ్మల కొలువులు
ముచ్చట గొలిపినట్టు
జంగమ దేవరలు దీవించి నట్టు

తాళం తీసినవారే తంటా తెస్తున్నారు!

భారతీయ నాగరికత విశిష్ట గుణం వైవిధ్యత. భాషలు, మతాలు, సంస్కృతులు, నైసర్గికతలు బహుళమైనవి. వాటిని అలంబన చేసుకున్న సామాజిక సముదాయాలలో భిన్నత్వం బహుముఖీనమైనది. అయితే ఏదీ విడిగా ఉండదు. ఆదానప్రదానాలు నిరంతరం జరుగుతూ ఉంటాయి. ఈ ప్రక్రియ అవిచ్ఛిన్నంగా సాగేందుకు తోడ్పడుతున్న శక్తి ఒకటి ఉన్నది. అదే కనుక లేనట్టయితే భారత్ చాలాకాలం క్రితమే పరస్పరం సంఘర్షించుకుంటున్న సామాజిక బృందాలు, జాతులుగా విచ్ఛిన్నమై వుండేది. ఏమిటా శక్తి? గురుదేవ్ రవీంద్రుడు శతాబ్దం క్రితమే దాని గురించి వివేచించారు. 1917లో 'జాతీయ వాదం'పై ఒక స్ఫూర్తిదాయక వ్యాసంలో ఆయన ఇలా రాశారు: 'భిన్న భిన్న జన సముదాయాలు కలసికట్టుగా ఉండగలిగే ఒక సామాజిక సమైక్యతను రూపొందించేందుకు భారత్ ఏ నాటినుంచో నానా ప్రయోగాలు చేస్తూ వస్తోంది. ఐక్యత పేరిట ఏ సామాజిక సముదాయ స్వేచ్ఛను కట్టడి చేయని సమైక్యత కోసం అన్వేషించింది. ఆ అన్వేషణ ఒక 'సామాజిక సమాఖ్య సంయుక్త రాజ్యాలు' (యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఎ సోషల్ ఫెడరేషన్)గా ఫలించింది. ఈ 'సమాఖ్య' ఉమ్మడి నామమే హిందూమతం. రవీంద్రుడు అభివర్ణించిన 'సామాజిక సమాఖ్య సంయుక్త రాజ్యాల' ప్రధాన ప్రతీకలలో శ్రీరామచంద్రుడు ఒకడు. హిందూ మత ఔన్నత్య పునరుద్ధరణకై అయోధ్యలో పునర్నిర్మించిన రామ మందిరాన్ని ఈ నెల 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. మార్క్సిస్టులు, ఇస్లామిస్టులు, అంబేడ్కరైట్‌లు ఆ రామమందిరాన్ని వ్యతిరేకిస్తున్నారు. భారత జాతీయ మహా పురుషుడుగా రాముడిని గౌరవించేందుకు వారు నిరాకరిస్తున్నారు. తమ జాతీయ మహాకవిగా పాకిస్థాన్ ప్రజలు గౌరవించే అల్లామ ఇక్బాల్ రామాయణ మహానాయకుడిని 'ఇమామ్ -ఎ- హింద్' (భారతదేశ ఆధ్యాత్మిక నాయకుడు) అని ప్రస్తుతించాడు. మరి కాంగ్రెస్ వాదులు, కమ్యూనిస్టులు అంబేడ్కర్ వాదులు మొదలైన వారు ప్రధాని ఈ నెల 22న అయోధ్యలో రాముడికి చేయనున్న 'ప్రాణ ప్రతిష్ఠ'ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? విధిగా వికసించే చరిత్రకు వారి వైఖరి సమ్మతమేనా?

ఆధునిక భారతదేశ సమైక్యత బ్రిటిష్ వలసపాలనా దక్షత నిర్మించింది కాదు. 1950లో అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం మాత్రమే వాటికి భరోసా. ఆ సమైక్యత మౌలికంగా సాంస్కృతిక, నాగరికతా విధాయకమైనది. భారత్ భావన లేదా భారత జాతీయ అస్తిత్వ నిర్మాణంలో రాముడు ఒక ప్రధాన వ్యక్తి. స్వాతంత్ర్య లబ్ధి వెన్వెంటనే అయోధ్యలోని బాబ్రీ మసీద్ స్థానంలో రామాలయాన్ని పునర్నిర్మించాలని హిందువులు చేసిన డిమాండ్ పూర్తిగా న్యాయసమ్మతమైనది. దేశ విభజన కల్లోల పరిస్థితుల కారణంగా నాడు ఆ డిమాండ్‌పై ప్రజలు శ్రద్ధ చూపలేదు. వామపక్షవాదులు, లౌకికవాదులు విశ్వసిస్తున్నట్టుగా ఆ డిమాండ్ సంఘ్ పరివార్ కృత్రిమంగా సృష్టించింది కాదు. 1980 దశకంలో ఆ డిమాండ్ మళ్లీ ఊపిరిపోసుకున్నప్పుడు ఉత్తరాది రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ నాయకుల కంటే కాంగ్రెస్ పార్టీ నాయకులే ముందుగా



బాబ్రీ మసీద్ తాళాలు తెరిచింది 1986లో. అప్పుడు ప్రధానమంత్రి ఎవరు? రాజీవ్ గాంధీ. 1989లో అయోధ్యలో జరిగిన శిలాన్యాస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నాటి హోంమంత్రి బూటాసింగ్‌ను రాజీవ్ గాంధీయే పంపించారు. 1989 పార్లమెంటరీ ఎన్నికల ప్రచారాన్ని - ఫైజాబాద్‌లో ప్రారంభిస్తూ 'రామరాజ్యం' స్థాపిస్తానని రాజీవ్ హామీ ఇచ్చారు. మరి, రామాలయం విషయమై కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఊగిసలాట ధోరణితో వ్యవహరిస్తోంది?

దానికి మద్దతు నిచ్చారు! జూన్, 1989లో పాలంపూర్ (హిమాచల్‌ప్రదేశ్)లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో మాత్రమే అయోధ్యలో రామాలయాన్ని నిర్మించాలన్న తీర్మానాన్ని బీజేపీ ఆమోదించింది.

బాబ్రీ మసీద్ తాళాలు తెరిచింది ఎప్పుడు? 1986లో. అప్పుడు ప్రధానమంత్రిగా ఉన్నది ఎవరు? రాజీవ్ గాంధీ. ఈ వాస్తవాన్ని నేటి కాంగ్రెస్ నాయకులు ఎలా మరచిపోయారు? 1989 నవంబర్‌లో అయోధ్యలో జరగనున్న శిలాన్యాస్ (శంకుస్థాపన) కార్యక్రమంలో పాల్గొనేందుకు నాటి కేంద్ర హోంమంత్రి బూటాసింగ్‌ను రాజీవ్ గాంధీయే పంపించారు. అంతేనా? 1989 పార్లమెంటరీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని రాజీవ్ గాంధీ -ఫైజాబాద్‌లో ఒక ర్యాలీలో ప్రారంభించారు. ఆ బహిరంగసభలోనే ఆయన 'రామరాజ్యం' స్థాపిస్తానని హామీ ఇచ్చారు.

ఈ నెల 22న అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనవలసిందిగా తమకు అందిన ఆహ్వానాలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి తిరస్కరించారు. 'అయోధ్యలో ఆలయ అంశాన్ని సంఘ్ పరివార్ / బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని వారు విమర్శించారు. అదే ప్రకటనలో వారొక వ్యాఖ్య కూడ చేశారు: 'మతం అనేది ఒక వ్యక్తిగత వ్యవహారం'. అవునా? మతం వ్యక్తిగత వ్యవహారమే అయితే అయోధ్యలో రాజీవ్ చేపట్టిన చర్యలను ఎలా అర్థం చేసుకోవాలి? జనవరి 15న తాము అయోధ్యను సందర్శించి సరయు నదిలో స్నానం చేసి రామ్ లల్లాకు పూజలు నిర్వహిస్తామని యూపీలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఎందుకు ప్రకటించారు? సోనియా, రాహుల్, ప్రియాంకలు సైతం సమీప భవిష్యత్తులోనే అయోధ్యలోని రామాలయాన్ని సందర్శిస్తే మనం ఆశ్చర్యపోనవసరం లేదు. అసలు రామాలయం విషయమై కాంగ్రెస్ పార్టీ ఇంతగా ఎందుకు ఊగిసలాట ధోరణిలో వ్యవహరిస్తోంది? హిందువుల మనోభావాలను ఎందుకు ఉపేక్షించింది? తొలుత రామజన్మభూమి ఉద్యమాన్ని వ్యతిరేకించి, ఆ తరువాత ఆ ఉద్యమం పూర్తిగా బీజేపీ గుత్తాధిపత్యంలోకి పోయేందుకు ఎందుకు అనుమతించింది? హిందువుల న్యాయసమ్మతమైన ఆకాంక్షలను గౌరవించి, అంగీకరించాలని ముస్లింలకు ఎందుకు నచ్చచెప్పలేదు?

సరే, ముస్లిం సమాజ మత, సామాజిక, రాజకీయ నాయకులు రామాలయంపై ఎందుకు అంతగా పట్టు విడుపులు లేని ధోరణి ప్రదర్శిస్తున్నారు? తొలుత వారు, అయోధ్యలో రామజన్మభూమిగా హిందువులు విశ్వసించే ప్రదేశంలోని రామాలయాన్ని కూల్చివేసి బాబ్రీమసీద్‌ను నిర్మించారనే వాదనను వామపక్షాలవారితో పాటు తిరస్కరించారు. అసలు ఆ స్థలం రామజన్మభూమి అవునా కాదా అనేది మత విశ్వాసానికి సంబంధించిన విషయం. అయితే ఆ ప్రదేశంలోని ఒక పురాతన ఆలయాన్ని కూల్చి మసీదును కట్టారనడం కొట్టివేయలేని వాస్తవం. బాబ్రీ మసీద్‌ను కాపాడడమనేది భారత్ లోని ముస్లింలకు ఒక జీవన్మరణ సమస్యగా పరిగణించడం ముస్లిం సమాజ పెద్దలు చేసిన తప్పు.

భారత్‌లో లౌకికవాదాన్ని కాపాడేందుకు బాబ్రీ మసీద్‌ను సంరక్షించడం తప్పనిసరి అని కాంగ్రెస్, వామపక్షాలు, ముస్లిం నాయకులు ముక్తకంఠంతో వాదించడం మరో తప్పు. దీనివల్ల, ఆచరణలో లౌకికవాదం ముస్లింలకు సానుకూలంగాను, తమకు వ్యతిరేకంగాను ఉంటుందని హిందువులు భావించేందుకు ఆస్కారమేర్పడింది. ఇంతకూ ముస్లిం నాయకులు తమ మొండి వైఖరితో ఏమి సాధించినట్టు? ఆత్మ పరిశీలన చేసుకుంటారా? కాలమే చెప్పాలి.



ఊహించినట్టుగానే అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా హిందూ మత విజయోత్సవ వాతావరణాన్ని సృష్టించడంలో మోదీ ప్రభుత్వం, సంఘ్ పరివార్ సఫలమయ్యాయి. ఆలయ నిర్మాణం పూర్తికాకముందే ప్రారంభోత్సవానికి పూనుకోవడం రాబోయే పార్లమెంటరీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే. రామాలయాన్ని నిర్మిస్తోంది రాజకీయ ప్రయోజనాల కోసమేనా అనే ప్రశ్నను రామభక్తులు తప్పక వేసుకోవాలి. అయోధ్య రామాలయం మన సమాజ నైతిక వ్యక్తిత్వాన్ని సమున్నతం చేసేందుకు తోడ్పడుతుందా లేక మత దురహంకారం మరింతగా పెచ్చరిల్లడానికి కారణమవుతుందా? అనే విషయాన్ని కూడా హిందువులు నిష్పాక్షికంగా ఆలోచించాలి. హిందూ ధర్మ సుగుణాలను మనం చిత్తశుద్ధితో ఆవాహన చేసుకోవాలి. మన నిత్య జీవితంలో వాటిని ఆచరించాలి. లేనిపక్షంలో భారతీయ ప్రజాస్వామ్యం, లౌకికవాద విలువలు, సంప్రదాయాలకు ఎనలేని హాని చేయడమే అవుతుంది.

> అయోధ్య రామాలయం మన సమాజ నైతిక వ్యక్తిత్వాన్ని సమున్నతం చేసేందుకు తోడ్పడుతుందా లేక మత దురహంకారం మరింతగా పెచ్చరిల్లడానికి కారణమవుతుందా?

అయోధ్యలో రామాలయ స్వప్నం సాకారమవుతోంది. అయితే రామరాజ్యం -ధర్మ పాలన- ఎక్కడ? నైతిక విలువలు, ఆర్థిక, సామాజిక న్యాయం విషయమేమిటి? మనం దయా స్వభావంతో ప్రవర్తిస్తున్నామా? భిన్న వర్గాలతో సమన్వయ దృక్పథంతో సాగుతున్నామా? అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవ సంబరంలో ఉన్న దేశ ప్రజలు మన కాలం మహోన్నత రామభక్తుడి మాటలను గుర్తు చేసుకోవలసిన అవసరమున్నది. దేశ విభజనతో ప్రజ్వరిల్లిన మతకలహాలు రక్తపుటేర్లను పారిస్తూ ఉధృతమవుతున్న వేళ 1947 అక్టోబర్‌లో మహాత్మా గాంధీ తన 'హరిజన్' పత్రికలో ఇలా రాశారు: 'నేను విశ్వసించే హిందూ ధర్మం అన్ని మతాలను గౌరవించమని నాకు బోధించింది. ఈ బోధనను పాటించడంలోనే రామరాజ్యం రహస్యం ఉన్నది'. ఆయన ఇంకా ఇలా రాశారు: 'రామరాజ్యం రూపంలో భగవంతుడిని చూడాలని మీరు కోరుకుంటున్నారా? అలా అయితే అందుకు మీరు ముందుగా ఆత్మశోధన చేసుకోవాలి. మీ తప్పులను మీరు ఎక్కువ చేసి చూసుకోవాలి. మీ ఇరుగుపొరుగువారి తప్పులను ఉపేక్షించాలి. ఇదే నిజమైన పురోగతికి ఏకైక మార్గం'. ఈ సత్యవాక్కుల ద్వారా హిందువులు, ముస్లింలు, కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు, మితవాదులు... ప్రతీ ఒక్కరితోనూ మహాత్ముడు మాట్లాడారు.

■ -సుధీంద్ర కులకర్ణి

జన్మభూమిలో రఘురాముడు


అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో, జనవరి 22, 2024 మధ్యాహ్నం 12.20 గంటల శుభముహూర్తాన జరుగనున్న 'ప్రాణ ప్రతిష్ఠ వేడుక' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ అదే రోజున దేశ ప్రజలంతా వారివారి ఇళ్లల్లో 'రామజ్యోతి' వెలిగించి ఆ వేడుకను జరుపుకోవాలని, పెద్ద సంఖ్యలో ఒకేసారి అందరూ అయోధ్యకు వచ్చి ఇబ్బందికి గురికావద్దనీ విజ్ఞప్తి చేశారు.

'శ్రీ రామజన్మ భూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్' సభ్యులు ఎంపిక చేసిన, 51 అంగుళాల 'రామ్ లల్లా' విగ్రహానికి ప్రాణశక్తిని ఆవాహన చేసే 'ప్రాణ ప్రతిష్ఠ వేడుక'ను, ఆలయాల ఆచారానికి, సాంప్రదాయానికి అనుగుణంగా నిర్వహిస్తున్నారు నిర్వాహకులు. దీన్ని పురస్కరించుకుని ఏడు రోజులపాటు నిర్విరామంగా జరుగనున్న సాంప్రదాయ, ఆచారబద్ధమైన కార్యక్రమాలు జనవరి 16న ప్రారంభం అవుతున్నాయి. వీటికి పూర్వరంగంలో, ట్రస్ట్ కార్యదర్శి చంపట్ రాయ్ పవిత్ర అక్షతల పంపిణీ కార్యక్రమానికి ఆంగ్ల నూతన సంవత్సరం నాడు లాంఛనంగా శ్రీకారం చుట్టారు.

మహర్షి వాల్మీకి రచించిన ఆదికావ్యం సంస్కృత రామాయణంలో 'రామజన్మభూమి'గా ప్రసిద్ధికెక్కిన అయోధ్యకు సంబంధించిన అనాది కాలంనాటి అనేక విషయాలను స్పష్టంగా వర్ణించారు. ఇప్పటిలాగానే, ఆ కాలంలో కూడా సరయూ నది ఒడ్డున వున్న అయోధ్యా నగరానికి ఒకవైపున 'గంగా, పంచల ప్రదేశ్', మరోవైపున 'మిథిలా' ఉండేవి. కాలక్రమేణా అయోధ్య పరిమాణంలో కుంచించుకుపోవడమే కాకుండా, అక్కడి నదులు వాటి మార్గాన్ని మార్చుకున్నాయి. వర్తమాన పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా నరేంద్ర మోదీ విజన్ మేరకు అయోధ్య నగరాన్ని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నారు. పరంపరగా వస్తున్న దాని అద్భుతమైన వారసత్వాన్ని సంరక్షించే దిశగా పనులు జరుగుతున్నాయి.

సంస్కృత భాషలో వాల్మీకి రచించిన రామాయణాన్ని, మూలంలోని 24,000 శ్లోకాలకు, శ్లోకానికి ఒకటి చొప్పున, తెలుగులో 24,000 పద్యాలతో, ప్రతిపదార్థ తాత్పర్యసహితంగా, ఆంధ్రవాల్మీకిగా ప్రసిద్ధికెక్కిన స్వర్గీయ వావిలికొలను సుబ్బారావు తొమ్మిది సంపుటాలలో 'శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం మందరం' పేరుతో వందేళ్ల క్రితం అనువదించారు. ఈ మందర సంపుటాలను సమకాలీన 'ఆధ్యాత్మిక, బహువిషయ విజ్ఞానసర్వస్వాలు'గా విస్తృతంగా భావిస్తారు. సంస్కృత వాల్మీకి రామాయణం, వావిలికొలను సుబ్బారావు తెలుగు యథావాల్మీకం అలనాటి అయోధ్యను కళ్లకు కట్టినట్లు వివరిస్తాయి. సరయూ నదీతీరంలోని కోసల దేశంలో వున్న అయోధ్యా నగరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో వుండేవారు. చక్కటి రాజవీధులతో అలరారుతూ, అందాలొలికే ఆ అయోధ్యాపురం 'లక్ష్మీపురం'నే మరిపించేది. స్వర్గ నగరమైన అమరావతికి దీటుగా వుండేది. అయోధ్యాపురంలోని బ్రాహ్మణులు అడిగిన వారికి లేదనకుండా శక్తికొలది దాన ధర్మాలు చేసేవారు. వేదాధ్యయనం చేయడం వారికి నిత్యకృత్యం. బ్రాహ్మణులు ఉపదేశించిన కార్యాలలో ఆసక్తి కలిగి క్షత్రియులు నడచుకునేవారు. వైశ్యులు రాజులకు అనుకూలంగా వుండేవారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు చేదోడువాదోడుగా కులవృత్తులలో నిమగ్నమై కార్మిక, కర్షక వర్గాల వారు ఉండేవారు. అయోధ్యా నగరంలోని ప్రజలందరు సద్గుణవంతులే.

అయోధ్యా నగరాన్ని ఇక్ష్వాకుల సూర్య వంశానికి చెందిన దశరథ మహారాజు, సమర్థులైన మంత్రుల తోడ్పాటుతో పరిపాలించేవాడు. చైత్ర మాసం, శుక్లపక్షం, నవమి తిథి నాడు, పునర్వసు నక్షత్రంలో, అభిజిల్లగ్నం, కర్కాటక లగ్నంలో, చంద్రుడిని కూడిన బృహస్పతి కలిగిన ఉదయాన, దశరథుడి జ్యేష్ఠ



మహర్షి వాల్మీకి రచించిన ఆదికావ్యం సంస్కృత రామాయణంలో 'రామజన్మభూమి'గా ప్రసిద్ధికెక్కిన అయోధ్యకు సంబంధించిన అనాది కాలంనాటి అనేక విషయాలను స్పష్టంగా వర్ణించారు. 'రామ్ మందిర్' నిర్మాణానికి పరిపూర్ణ కృషి చేసిన వ్యక్తిగా నరేంద్రమోదీని యావత్ హిందూ సమాజానికి చెందిన ఆబాలగోపాలం, ఆసేతు హిమాచలం ఎప్పటికీ జ్ఞాపకం ఉంచుకుంటుంది.

భార్య కౌసల్యాదేవి జగత్ పాలకుడైన శ్రీమహావిష్ణువు అర్ధాంశమూర్తి శ్రీరాముడికి జన్మనిచ్చింది. ఆ విధంగా, అలనాటి అయోధ్య శ్రీరాముడి జన్మస్థలం, లేదా, రామజన్మభూమి అయింది. ఆ పరంపరతో, అదే అయోధ్య, ఈ నాడు 'రామ్ లల్లా విగ్రహం' ఉండే చారిత్రాత్మక రామ మందిరానికి నిలయమైంది.

ఆధునిక భారతదేశ చరిత్రలో 'అయోధ్య వివాదం' వివిధ న్యాయ స్థానాలలో ఒక ప్రాధాన్యతను సంతరించుకున్నది. అయోధ్యలోని ఒక ప్రాచీన కట్టడంలో వున్న వివాదాస్పద స్థలంలోనే శ్రీరాముడు జన్మించాడని, అదే ఆయన జన్మభూమని, అక్కడొక రామాలయం వుండేదని, దాన్ని 1528 లో బాబర్ కూలగొట్టించి బాబ్రీ మసీదు నిర్మించాడని అందువల్ల ఆ స్థలంపై హక్కు తమదేనని హిందువులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వివాదానికి స్వస్తివాక్యం పలుకుతూ, నవంబర్ 9, 2019న ఐదుగురు సభ్యులున్న సుప్రీంకోర్ట్ ధర్మాసనం, కేంద్ర ప్రభుత్వానికి ఏకగ్రీవంగా ఇచ్చిన ఆదేశంలో, అయోధ్యలో వివాదాస్పద స్థలంలో 'రామ్ మందిర్ దేవాలయం' నిర్మించడానికి ట్రస్ట్‌ను, ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయమని చెప్పింది.

ఆలయాన్ని నిర్మించేందుకు 2.77 ఎకరాల వివాదాస్పద భూమిని హిందువుల ఆరాధ్య దైవం, సాక్షాత్తు భగవత్ స్వరూపుడు 'రామ్ లల్లా విరాజ్మాన్'కు అప్పగించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. 2010 అలహాబాద్ హైకోర్టు తీర్పులో పేర్కొన్నట్లు, వివాదాస్పద భూమి విభజన సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు, అయోధ్యలో 'రామ్ మందిర్ దేవాలయం' నిర్మించడానికి, ఫిబ్రవరి 5, 2020న 15 మంది సభ్యులతో కూడిన ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేశారు ప్రధాని మోదీ. నిర్మాణానికి అవసరమయ్యే అంచనా వ్యయమైన రూ.18,000 కోట్లను ప్రజల నుండి విరాళాలుగా సేకరిస్తున్నారు ట్రస్ట్ సభ్యులు. మొట్టమొదటి విరాళంగా కేంద్ర ప్రభుత్వం ఒక రూపాయి ఇచ్చింది. ఆగస్ట్ 5, 2020న ప్రధాన మంత్రి భూమిపూజ చేసి ఆలయ పునాదిరాయి వేశారు. డిజైన్ మార్పువల్ల నిర్మిస్తున్న 'రామ్ మందిర్ దేవాలయం' మొదట్లో అనుకున్న దానికంటే రెండింతలవుతున్నది. ట్రస్ట్‌కు కేటాయించిన 70 ఎకరాల భూమి మీద 2.77 ఎకరాల స్థలంలో రామ్ లల్లా కేంద్ర బిందువుగా నిర్మిస్తున్న ప్రధాన దేవాలయంతో సహా అనేక ఆలయాల నిర్మాణం జరుగుతున్నది. అష్టభుజ ఆకారపు గర్భగుడి, వృత్తాకార చుట్టుకొలతల నిర్మాణాలు కూడా అక్కడ ఉండబోతున్నాయి. ఆలయం నాలుగు మూలల గోడతో చుట్టబడిన 750 మీటర్ల విస్తీర్ణం కలిగిన ప్రాకారం కలిగివుంటుంది. భక్తులు ధ్యానం చేసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లున్నాయి.

'రామ్ మందిర్' నిర్మాణానికి పరిపూర్ణ కృషి చేసిన వ్యక్తిగా మోదీని యావత్ హిందూ సమాజానికి చెందిన ఆబాలగోపాలం, ఆసేతు హిమాచలం ఎప్పటికీ విధేయతతో జ్ఞాపకం ఉంచుకుంటుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. అలాగే, ఆలయాన్ని కట్టాలని గుండె లోతుల్లోంచి భావించినా, కట్టలేకపోయిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు, అయోధ్య వివాదాస్పద కేసును విజయవంతంగా వాదించిన సీనియర్ అడ్వకేట్, 96ఏళ్ల పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత కె పరాశరన్‌కు, 1949 లోనే నెహ్రూ ఆదేశాలను కాదని రామజన్మభూమిలో పూజలు చేసుకోవడానికి హిందువులకు హక్కు కల్పించిన నాటి ఫైజాబాద్ కలక్టర్ స్వర్గీయ కేకే నాయర్‌కు కూడా ప్రతి భారతీయుడు, ప్రతి హిందువు ధన్యవాదాలు తెలియచేయడం కనీస ధర్మం.

రెవిన్యూ కోర్టులు: కర్ర ఉన్నవాడిదే బర్రె

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 'టైటిల్ గ్యారంటీ చట్టం' రద్దు చేయాలని కొద్ది వారాలుగా రాష్ట్రంలోని న్యాయవాదులు ఆందోళన బాట పట్టారు. వారు కోర్టులను బహిష్కరిస్తుండటంతో న్యాయపరిపాలన నిల్చిపోయింది. భూ వివాదాలను సివిల్ కోర్టుల పరిధి నుండి తప్పించి రెవిన్యూ కోర్టులకు అప్పగిస్తున్నారని, కనుక అది తమ జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నందున వారు ఆందోళన చేస్తున్నారని ప్రచారం. 'టైటిల్ గ్యారంటీ చట్టం' భూ సంబంధాలలో తేదల్చుకున్న మార్పులను, గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో జరుగుతున్న భూముల రీ సర్వేని ఓసారి పరిశీలిద్దాం.

'టైటిల్ గ్యారంటీ చట్టం'కు రాష్ట్రపతి ఆమోదం వచ్చిన తరువాతే న్యాయవాదుల సమాజం, వామపక్ష సంఘాలు మేల్కొనడం విచారకరం. భూముల రీ సర్వే అందరి కళ్ళ ముందు జరుగుతూనే వుంది. అయినా ఎవరు బుర్ర పెట్టే శ్రమ తీసుకోలేదు. ఇప్పటికే వెయ్యికోట్లు ఖర్చుచేశామని, కొన్ని గ్రామాలలో మొత్తం సర్వే, హక్కుల నిర్ధారణ ప్రక్రియలను పూర్తిచేసి కొత్త పద్ధతిలో 'టైటిల్ డీడ్స్' ఇచ్చేశామని రాష్ట్రం ప్రభుత్వం చెప్పుకుంటోంది. వివాదం వేడెక్కిన తరువాత ప్రభుత్వం తరఫున కొందరు అధికారులు వివరణ ఇచ్చే ప్రయత్నం చేసారు. అప్పటివరకూ ప్రభుత్వానికి బయట సమాజం ఒకటి ఉందని, తమ విధాన చర్యల వలన ప్రభావితం అయ్యే వర్గాలతో కనీస సంప్రదింపులు చేయాలని వారికి గుర్తు రాలేదు. ఇప్పటికైనా వచ్చింది. అదే పదివేలు.

భూమికి యజమాని ఎవరు? ప్రకృతి సిద్ధమైన ఈ భూమి మీద ఎందరో వచ్చారు, పోయారు. మరికొందరు రానున్నారు. 'టైటిల్' అనే మాటకు 'యజమాని / హక్కుదారు' అని అర్థం చెప్పుకోవచ్చు. 'హక్కు' అనేది కేవలం ఒకే ఒక రూపంలో, 'యజమాని' అనే ఒకే ఒక అర్థంలో ఉంటుందా? ఇతర హక్కులు లేవా? వుండవా?!. ఒక వ్యక్తికి 'టైటిల్' ఉందా లేదా అనే వివాదం వచ్చినప్పుడు, ఇప్పుడున్న ఏర్పాటులో, ప్రభుత్వం తమ వద్ద వున్న రికార్డులో 'ఇలా నమోదై వుంది' అని చెప్పి ఊరుకుంటుంది. అయితే ఆ టైటిల్‌ను ప్రశ్నిస్తున్న వ్యక్తి న్యాయస్థానంలో సవాల్ చేస్తాడు. టైటిల్ ఉందనుకుంటున్న ఆసామి సమర్థించుకుంటాడు. పౌర న్యాయస్థానం విచారించి తీర్పు ఇస్తుంది. కొత్తగా తీసుకువస్తున్న పద్ధతిలో ఫలానా ఆసామిదే ఈ భూమి అని ప్రభుత్వమే నిర్ధారించి చెప్పేస్తుంది. అంతేగాక హక్కుదారని తాను నిర్ధారించిన వ్యక్తికి మద్దతుగా కూడా నిలబడుతుంది. ఇక ఇప్పుడు వివాదం హక్కును క్లెయిం చేస్తున్న ఇద్దరు వ్యక్తుల మధ్య కాదు. హక్కు అతనిదేనని చెప్పిన ప్రభుత్వానికి, దానిని ప్రశ్నించిన ఆసామికి మధ్య. ఒకవేళ ఆ వివాదంలో ప్రభుత్వం ఓడిపోతే తమ తప్పిదం వలన (సో కాల్డ్) టైటిల్ యజమానికి నష్టం జరిగింది గనుక నష్టపరిహారం ఇస్తామంటోంది. దీనినే 'ఎష్యూరెన్స్ ప్రిన్సిపల్' అని చెపుతున్నారు.

సుందర్ రాజన్ అయ్యంగార్ తన ప్రసిద్ధ గ్రంథం 'లేండ్ టేన్యూర్ సిస్టమ్స్'లో భూమికి—రాజ్యానికి ఉన్న సంబంధం గురించి విపులంగా వివరించారు. మనం సాగు అనుభవానికి ప్రాధాన్యం ఇస్తాం. భూమి రాజు గారిది కాదు దానిని సాగు చేసే సమాజానిది. బ్రిటిష్ వారు తమ అనుభవం నుండి పర్మినెంట్ సెటిల్‌మెంట్‌లో తాము పెట్టిన జమిందార్లను తమవద్ద వున్న 'లార్డ్స్'గా భావించారు. ఆ తరువాత దానిని దిద్దుకునే ప్రయత్నమూ చేశారు. ఈ దిద్దుబాటు క్రమాన్ని (1802 నుండి 1908 వరకు) 'జమిందారి రైతు సమస్య' పేరుతో రాజమండ్రి నుండి మందేశ్వర శర్మ 1933లో ప్రచురించిన పుస్తకంలో వివరించారు. ఈ మార్పుల ద్వారా సాగులో వున్న రైతుల హక్కులను బ్రిటిష్ వారు గుర్తించే ప్రయత్నం చేసారు. చట్టంలో ఉన్నా లేకపోయినా భారతీయ సంప్రదాయం 'స్వాధీన అనుభవ హక్కును' గుర్తిస్తుంది. భూమిపై ఏర్పడిన పలు హక్కులలో పట్టా/యజమాని హక్కు ఒకటి మాత్రమే.

హైదరాబాద్ కౌలుదారి— వ్యవసాయ భూమి చట్టం 1950, సెక్షన్ 5(1) ప్రకారం వరసగా రెండు సంవత్సరాలు సాగు చేయకుండా భూమిని ఉంచరాదు. అందుకు సహేతుకమైన కారణాలు చెప్పాలి. ఉమ్మడి రాష్ట్రం అయిన తరువాత ఆ చట్టాన్ని నెమ్మదిగా నీరుగార్చేశారు. గుజరాత్, మహారాష్ట్ర కర్నాటక ఇలా పలు రాష్ట్రాలలో వ్యవసాయం చేయని వారు వ్యవసాయ భూమి (ఒక ఆస్తిగా/ రియల్ ఎస్టేట్) కొనుగోలు చేయకుండా నిషేధాలు వున్నాయి. ఏ అడ్డంకులు లేనిది మన దగ్గిరే. పట్టాదారు పాసు పుస్తకాల చట్టం (ROR) సెక్షన్ 26(6) ప్రకారం పట్టాదార్ పాసు పుస్తకాలు ఇవ్వాలంటే ఆ వ్యక్తి సాగులో వుండాలి. మన



వంతంగి పేరయ్య, గెమ్మెల బాలరాజు, గోరా సూరిబాబుల హక్కులకు 'టైటిల్ గ్యారంటీ చట్టం' ఎలాంటి రక్షణ ఇవ్వనుంది? ఇది అమలులోకి వస్తే, రికార్డులో పట్టాదార్లుగా నమోదైన వారి తరుపున వకాల్తా తీసుకొని, ఈ నోరు లేని సాగుదారులకు వ్యతిరేకంగా మహాశక్తివంతమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రంగంలోకి దిగుతుందా?

సాంప్రదాయం సాగు అనుభవాన్ని గుర్తిస్తుంది. స్థిర అనుభవం (Settled cultivation) ద్వారా 'సహజంగా' ఏర్పడే 'టైటిల్' హక్కును న్యాయవ్యవస్థ గుర్తిస్తుంది. కనుక 'టైటిల్ గ్యారంటీ భావన' దీనికి విరుద్ధం తాము తెచ్చిన ఈ చట్టం ద్వారా భూమి మీద ఉన్నదానిని రికార్డు ప్రతిఫలిస్తుందని, దానినే 'అద్దంలో ప్రతిబింబం' (మిర్రర్ ఇమేజ్) అని అంటున్నారు. ఇందుకు 'టైటిల్ గ్యారంటీ చట్టం'తో సంబంధం లేదు. 1948 జమీందారి చట్టం రద్దు తరువాత జరిగిన సర్వే అండ్ సెటిల్మెంట్ ద్వారా రూపొందిన రికార్డులు చాలా కాలంపాటు ఆపని చేసాయి. దూరదృష్టి, ప్రత్యామ్నాయ ఏర్పాటు లేకుండా రెవిన్యూ వ్యవస్థలో చేసిన మార్పులు వలననే అది దెబ్బతిన్నది. భూమి శిస్తు నుండి వాణిజ్య పన్నులు, సారా ఆదాయాలకు ప్రభుత్వాలు మళ్ళడంతో రెవిన్యూ వ్యవస్థపై ఆసక్తి పోయింది. అది అసలు కారణం.

తమ తప్పిదం వలన 'టైటిల్ దారు'కు నష్టం జరిగితే ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందనడం నమ్మడానికి వీలు లేని సంగతి. పార్లమెంట్ చేసిన ఉపాధి హామీ చట్టంలో 15 రోజులలో పని, వేతనం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి, పరిహారం హామీ ఇచ్చారు. మేము హైకోర్టుకు వెళ్లి గెలిచిన కేసులలో కూడా ఒక్క దమ్మిడి కార్మికులకు దక్కలేదు. ఇక, ఇప్పుడో మూడు కేసులు చూద్దాం.

అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలం, కొండలకొత్తూరు గ్రామ ఆదివాసీ వంతంగి పేరయ్య వయస్సు 75 సంవత్సరాలు. పేరయ్య అతని పరివారేమే భూమి సాగులో ఉన్నారు. కాని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంకు చెందిన వారే హక్కుదారులుగా, సాగుదారులుగా మండల రెవిన్యూ కార్యాలయం రికార్డులో కనిపిస్తారు. అదే మండలానికి చెందిన కొత్తవీధి అనే కొండు ఆదివాసీల గ్రామం, ఆ గ్రామం చుట్టూ వున్న భూమిలో గెమ్మెల బాలరాజు ఆయన పరివారం సాగులో వుంది. భూమి శిస్తు కమీషనర్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ స్వాధీన అనుభవాన్ని సర్వే చేయమని (మిర్రర్ ఇమేజ్) గత ఏడాదిలో ఆదేశాలిచ్చినా ఏమీ జరగలేదు.

ఇక, గదబపాలెం అన్న ఊరులో అక్కడ ఉన్నవారంతా ఆదిమతెగకు చెందిన గదబ ఆదివాసీలు. గోరా సూరిబాబు, అతని తెగ వారు 40 ఎకరాల మెట్టు భూమిలో సాగులోవున్నారు. కానీ, క్రియదస్తావేజులు ఉన్నాయంటున్న వారు 50 ఏళ్ల కిందటే అమెరికా వెళ్ళిపోయారు, అక్కడి పౌరులైనారు. కాని భూమి మీద టైటిల్ హక్కులు వాళ్ళవేనట. ఈ కొత్త చట్టం, వంతంగి పేరయ్య, గెమ్మెల బాలరాజు, గోరా సూరిబాబుల హక్కులకు ఎలాంటి రక్షణ ఇవ్వనుంది? ఈ చట్టం అమలులోకి వస్తే రికార్డులో పట్టాదార్లుగా నమోదైన వారి తరుపున వకాల్తా తీసుకొని, ఈ నోరు లేని సాగుదారులకు వ్యతిరేకంగా మహాశక్తివంతమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రంగంలోకి దిగుతుందా?

ఏవో మూడు కేసులు చెప్పి ప్రభుత్వ ప్రయత్నాలను తప్పు పట్టడం సరికాదని ఎవరైనా అనవచ్చును. కానీ, ఏదైనా ఒక విధానాన్ని రూపొందించే ముందు కళ్ళముందు మెదలవలసిన, మహాత్మాగాంధీ చెప్పిన ఆఖరి మనుషులు వీళ్ళు. రెవిన్యూలో ఒక్క చిన్న ఉద్యోగి మీద కూడా చర్యలు తీసుకోగలిగే పరిస్థితి లేదు. రాష్ట్ర కేడర్ ఉద్యోగులే కాదు చివరికి కేంద్ర కేడర్ ఉద్యోగులు సైతం రాజకీయ ఒత్తిడికి, ఇతర ప్రలోభాలకు లొంగిపోతున్నారు. రెవిన్యూ కోర్టులంటే అధికారం అనే 'కర్ర' వున్న వారి చేతిలోని 'బర్రె'లని గుర్తించాలి. 'టైటిల్' కు కాదు, సాగు అనుభవానికి గ్యారంటీ ఇవ్వడం ఎలాగో ఆలోచించండి.

◆ పిఎస్. అజయ్ కుమార్

జాతీయ కార్యదర్శి,
అఖిల భారత వ్యవసాయ–గ్రామీణ కార్మిక సంఘం (AIARLA)



ఊహించినదానికంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయి



మహేశ్‌బాబు కథానాయకుడిగా, త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన 'గుంటూరుకారం' చిత్రం ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఈ చిత్రఫలితంపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ, ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేయడానికి శనివారం చిత్ర నిర్మాత ఎస్.నాగవంశీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నైజాం డిస్ట్రిబ్యూటర్ నిర్మాత దిల్ రాజు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. 'మొదటి రెండుమూడు షోలకు మిక్స్‌డ్ రివ్యూలు వచ్చాయి. అయితే, ఫస్ట్‌షో నుంచి టాక్ పాజిటివ్‌గా మారింది. తొలిరోజు ఊహించని దానికంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయి. ఇది పూర్తి పండుగ సినిమా. థియేటర్‌కు వచ్చి సినిమా చూడండి. తప్పకుండా ఎంటర్‌టైన్ అవుతారు' అన్నారు ఎస్.నాగవంశీ. ప్రారంభంలో నెగెటివ్ టాక్ వచ్చినప్పటికీ ప్రేక్షకులకు కథ నచ్చి సూపర్‌హిట్ అయిన సినిమాలు చాలా ఉన్నాయని, తల్లీకొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం అసలుసిసలైన సంక్రాంతి సినిమా అని, బాగున్న సినిమా విజయాన్ని ఎవరూ ఆపలేరని, సినిమా వ్యాపారరంగం కనుక గొడవలు సహజమని, ఇక్కడ ప్రత్యేకించి శత్రువులు, మిత్రులు ఉండరని' అని దిల్ రాజు పేర్కొన్నారు.

మానవసంబంధాలతో కూడిన కథ ఇది

\- నాగార్జున



స్నేహం, ప్రేమ, త్యాగం, విశ్వాసం.. ఇలా మానవ సంబంధాలతో కూడిన అద్భుతమైన కథ 'నా సామిరంగ'. అని అక్కినేని నాగార్జున అన్నారు. ఆయన హీరోగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతికి కానుకగా ఈ ఆదివారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాగార్జున విలేకరులతో ముచ్చటించారు.

● ప్రీప్రొడక్షన్ పక్కాగా చేసుకున్నాం కాబట్టే సినిమాను వేగంగా పూర్తిచేయగలిగాం. కీరవాణి షూటింగ్‌కు ముందే మూడు పాటలు ఇచ్చేశారు. అలాగే ఫైట్స్ సీక్వెన్స్‌కి నేపథ్య సంగీతాన్ని కూడా ఇచ్చేశారు. ఆ నేపథ్య సంగీతం పెట్టుకొని ఫైట్ షూట్ చేశాం. ఓ విధంగా ఇంత వేగంగా సినిమా పూర్తవ్వడానికి కీరవాణిగారు కూడా కారకులే.

● భోగి, సంక్రాంతి, కనుమ ఈ మూడు పండగల నేపథ్యంలో జరిగే కథ ఇది. మన సంక్రాంతి శోభ మొత్తం ఈ సినిమాలో ఉంటుంది. ఇందులో నా పాత్ర పేరు కృష్ణయ్య. నాది టిపికల్ లవ్‌స్టోరీ. నాపాత్రకూ హీరోయిన్ ఆశికా రంగనాథ్ పాత్రకూ మధ్య ప్రేమ కథ 12ఏళ్లు నడుస్తుంది. అది కూడా వ్యక్తపరచుకోకుండానే.

● దర్శకుడు విజయ్ బిన్నీకి మంచి విజువల్ సెన్స్ ఉంది. తను కొరియోగ్రఫీ చేసిన పాటల్ని కూడా కేవలం స్టెప్పులతోనే కాకుండా ఒక కాన్సెప్ట్‌గా తీర్చిదిద్దుతాడు. అందుకే అతనికి అవకాశం ఇచ్చాను. ఈ కథను అతను తీర్చిదిద్దిన విధానం అందరికీ నచ్చింది. కెమెరా డిపార్ట్‌మెంట్‌తో కలిసి రౌండ్ క్లాక్ పనిచేశాడు. అలాగే పోస్ట్ ప్రొడక్షన్ టైమ్‌లో కూడా అందరినీ సమన్వయపరచుకుంటూ పనిచేయించుకున్నాడు. చక్కని క్లారిటీ ఉన్న దర్శకుడు తను.

● నరేశ్, రాజ్‌తరుణ్ పాత్రలు కథలో చాలా కీలకమైనవి. ఇద్దరూ అద్భుతంగా నటించారు. సాంకేతికంగా అబ్బురపరిచేలా ఉంటుందీ సినిమా. నిర్మాత శ్రీనివాస్ చిట్టూరి ఏ విషయంలోనూ వెనకడుగు వేయలేదు. అందరూ మనసుపెట్టి పనిచేశారు. ఈ సినిమా తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో చేస్తున్నాను.

















కీసర టోల్‌గేట్ వద్ద బారులు తీరిన కార్లు

హైదరాబాద్ నుంచి పోటెత్తిన కార్లు

ఎన్‌హెచ్-65పై ఒకటే రద్దీ

కిలోమీటర్ల కొద్దీ బారులు తీరిన ట్రాఫిక్

కీసర టోల్‌ప్లాజా వద్ద రికార్డుస్థాయిలో 65వేల కార్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కంచికచర్ల/జగ్గయ్యపేట రూరల్) : పండుగ ప్రయాణం పోటెత్తింది. అంచనాలకు మించి హైదరాబాద్, ఇతర దూరప్రాంతాల నుంచి బెజవాడకు ప్రయాణికులు కదిలారు. 65వ నెంబర్ జాతీయ రహదారి కిటకిటలాడింది. కీసర టోల్‌ప్లాజా వద్ద ఇసకేస్తే రాలనంత కార్లు బారులు తీరి కనిపించాయి. హైదరాబాద్ నుంచి రికార్డు స్థాయిలో ప్రయాణికులు రావడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. రోజుకు 3 లక్షల మంది వస్తారని అంచనా వేయగా, 6 లక్షలకు పైగా వచ్చారు. శనివారం అంచనాలు మించి 3 లక్షల మంది పెరిగారు. హైదరాబాద్ మహానగరంలోని ఓలా, ఉబర్, జూమ్ తదితర ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ట్యాక్సీ ఏజెన్సీ సంస్థలన్నీ ఏపీకి క్యూ కట్టాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 50 వేల పైచిలుకు కార్లు విజయవాడ వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. శనివారం రాత్రి 7 గంటల వరకు 65 వేల కార్లు వచ్చినట్టుగా టోల్‌ప్లాజా గణాంకాలు చెబుతున్నాయి. ఈ లెక్కన మరో 2.60 లక్షల మంది ప్రయాణికులు కార్లలో విజయవాడ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఎన్‌హెచ్-65పై వస్తున్న కార్ల దండును కొందరు డ్రోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విజయవాడకు భారీ సంఖ్యలో కార్లు వస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కనకదుర్గ ఫ్లై ఓవర్, బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్లపై రద్దీ కనిపించింది.



పీఎన్‌బీఎస్‌లో బస్సుల కోసం వేచి ఉన్న జనం

కిటకిట..!

సంక్రాంతికి ప్రయాణాల రద్దీ తారస్థాయికి చేరింది. ఆర్టీసీ బస్సులతో పాటు రైళ్లు, విమానాలు కూడా నూరుశాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. పండిట్ నెహ్రూ బస్టాండ్‌తో పాటు రైల్వేస్టేషన్, విమానాశ్రయం కూడా ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

సంక్రాంతి ప్రయాణాల సందడే సందడి

పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్, విమానాశ్రయంలో రద్దీ

రికార్డు స్థాయిలో బస్సులు నడిపినా చాలని పరిస్థితి

మరిన్ని ప్రత్యేక రైళ్లు ప్రకటన

చార్జీ ఎక్కువైనా విమానాల్లోనూ రాకపోకలు

బస్సులకు భలే డిమాండ్

ప్రయాణికులతో పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ కిటకిటలాడుతోంది. శనివారం సాయంత్రం నాటికి రికార్డు స్థాయిలో 180 బస్సులు నడిపింది. హైదరాబాద్ షెడ్యూల్ బస్సులతో పాటు ఇప్పటికే ప్రకటించిన స్పెషల్స్ కూడా సరిపోకపోవటంతో మరో 72 స్పెషల్స్ నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజమండ్రి సెక్టార్‌లో బస్సులకు డిమాండ్ ఏర్పడింది. రాజమండ్రికి వెళ్లటానికి 3, 4 గంటలు వేచి చూడాల్సి వస్తోంది. ఇక విశాఖపట్నం వైపునకు శనివారం సాయంత్రం వరకు 20 స్పెషల్స్ నడిపారు. ప్రైవేట్ బస్సుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.



రైలు ఎక్కేందుకు ఇలా..

విమానాలన్నీ ఫుల్

విమానాలు కూడా ఫుల్ ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. విజయవాడ నుంచి రాకపోకలు సాగించిన ప్రతి విమానం నూరుశాతం ఆక్యుపెన్సీ సాధించింది. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి విజయవాడకు డిమాండ్ ఆన్ ఫేర్ ప్రకారం టికెట్ ధర రూ.35 వేలు పలకడం విశేషం. విజయవాడ నుంచి శనివారం మొత్తం 38 విమానాలు రాకపోకలు సాగించాయి. డిమాండ్ దృష్ట్యా చివరి నిమిషంలో బుక్ చేసుకున్నవారు భారీగా చార్జీలు చెల్లించాల్సి వచ్చింది.

రైళ్లన్నీ రద్దీ

హైదరాబాద్-విజయవాడ మధ్య రైళ్లు రద్దీగా నడిచాయి. దాదాపుగా 30 సంక్రాంతి స్పెషల్ రైళ్లను ప్రకటించగా, అందులో హైదరాబాద్-విజయవాడ మధ్య 15కు పైగా నడిచాయి. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో సికింద్రాబాద్-విజయవాడ మధ్య మరో ఐదు ప్రత్యేక రైళ్లు నడిపారు.



చలి మంటలు.. రేగిపళ్లు.. రంగుల రంగవల్లులు.. ఎగిరే గాలిపటాలు.. ఘుమ ఘుమలాడే పిండి వంటలతో పెద్ద పండక్కి స్వాగతం పలుకుతూ, వెలుగుల ఉత్తరాయణాన్ని ఆహ్వానించే భోగభాగ్యాల భోగిని ఘనంగా జరుపుకొనేందుకు అటు పల్లెలు, ఇటు పట్టణాలు అందంగా ముస్తాబయ్యాయి.

ఒకపక్క కోడి పుంజులు.. మరోపక్క పేకముక్కలు.. జిల్లాలో ముస్తాబై కూర్చున్నాయి. గంప కింద కోళ్లు ఊళ్లు దాటుకుని తోటల్లోకి చేరుతున్నాయి. పేకముక్కల లోపల, బయట అనడానికి ఆహ్వానాలు పంపుతున్నాయి. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే సంక్రాంతి సంబరాల్లో సంప్రదాయం ముసుగులో కోడిపుంజులు ఎగిరెగిరి తన్నుకోతున్నాయి. పేకముక్కలు గిరిగిరా తిరగబోతున్నాయి. అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో ప్రతిచోటా భారీగా బరులు ఏర్పాటు చేయగా, పందెపురాయుళ్లు రూ.కోట్లలో కట్టలు సిద్ధం చేశారు.



ఈడుపుగల్లులో ఏర్పాటు చేసిన బరులు

పుంజుకున్నాయ్

రెండు జిల్లాల్లో భారీగా కోడిపందేల బరులు

- అధికార పార్టీ నేతల అండతో పకడ్బందీ ఏర్పాట్లు
- పందేల కోర్టుల వద్ద ఫ్లడ్‌లైట్లు
- రూ.కోట్లలో లావాదేవీలు
- హైదరాబాద్ నుంచి వచ్చిన పందెపురాయుళ్లు
- నగరంలోని హోటళ్లలో బస
- నేటి నుంచి కోళ్లతో రంగప్రవేశం



ఈడుపుగల్లులో వైసీపీ జెండాలతో స్వాగత ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార పార్టీ నేతలు జూదాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లాలో ఖాళీ స్థలాల్లో, తోటల్లో టెంట్లు వేశారు. భూమి చదును చేసి కోడిపుంజులు కొట్టుకోవడానికి అనువుగా కోర్టులు ఏర్పాటు చేశారు. అన్ని మండల కేంద్రాల్లోనూ, శివారు ప్రాంతాల్లోనూ బరులు, గిరులు కనిపిస్తున్నాయి. ప్రతి బరి వెనుక అధికార పార్టీ నేతలు ఉండటంతో పోలీసులు చూసీచూడనట్టే వ్యవహరిస్తున్నారు.

రూ.5 లక్షల నుంచి ఆరంభం

భోగి నుంచి కనుమ వరకు జరిగే కోడిపందేలు, పేకాటల్లో కోట్లాది రూపాయలు చేతులు మారబోతున్నాయి. కోడిపందేల బరుల వద్ద ప్రారంభ పందేన్ని రూ.5 లక్షలుగా నిర్ణయించినట్టు కొంతమంది చెబుతున్నారు. బరుల వద్దకు భారీగా జనం రాకుండా కొన్నిచోట్ల నిర్వాహకులు పాసులు జారీ చేసినట్టు చెబుతున్నారు. మూడు రోజులపాటు ఈ బరుల వద్ద బసచేసే వారికి ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నారు. ఏటా సంక్రాంతికి హైదరాబాద్ ఖాళీ కావడం ఒక సంప్రదాయం. అక్కడి నుంచి భారీసంఖ్యలో పందేల కోసం ఇక్కడికి వస్తుంటారు. వారంతా విజయవాడలోని హోటళ్లలో బస చేస్తారు. కోడిపందేలు, లోపల-బయట ఆటల ద్వారా భారీగా డబ్బులు వెనుకేసుకోవాలని నిర్వాహకులు భావిస్తున్నారు.

ఈసారి ఎన్టీఆర్ జిల్లాలో రూ.10 కోట్ల వరకు పందేలపై బెట్టింగ్‌లు నడిచే సూచనలు కనిపిస్తున్నాయి. పందేల వద్ద కొంతమంది ప్రత్యేకంగా వ్యాఖ్యాతలను ఏర్పాటు చేసుకున్నారు.

'రజనీ' స్టైలే వేరు

కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పాములకాల్వ వద్ద ఏటా కోడిపందేలు నిర్వహిస్తారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అనుచరుడు పాములకాల్వ వద్ద 'రజనీ' స్టైల్ చూపిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం నుంచి ఇక్కడ బరుల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశాడు. అనుమతుల కోసం ప్రయత్నాలు చేశాడు. కోడిపందేల నిర్వాహణ విషయంలో హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు చేతులు ఎత్తేశారు. ఎలాంటి పందేలు నిర్వహించవద్దని అతడిని హెచ్చరించామని పోలీసులు చెబుతున్నారు. అతడిని ఇప్పటికే బైండోవర్ చేశామని అంటున్నారు. అయినా ఈ అధికార పార్టీ నాయకుడు బరులను సిద్ధం చేస్తున్నాడు. కోడిపుంజులకు కత్తులు కట్టకుండా పందేలు నిర్వహిస్తామని తన అనుచరుల వద్ద చెబుతున్నాడు. పైకి ఈవిధంగా చెబుతున్నప్పటికీ కత్తులు కట్టి పందేలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. భోగి రోజు ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఈ పందేలు కనుమ పండుగ రాత్రి వరకు జరుగుతాయి. 24/7గా జరిగే ఈ జూదాలకు వచ్చే వారికి ఆహారం, పానీయాలు సరఫరా చేయడానికి స్టాల్స్‌ను వేలం వేశాడు. వాటిద్వారా ఇప్పటికే లక్షలాది రూపాయలు తన జేబులో వేసుకున్నాడని ఆరోపణలు ఉన్నాయి. మాజీమంత్రి అండ ఉండటంతో బరుల వద్ద పోలీసులు అడుగు పెట్టబోరని అనుచరుల వద్ద వ్యాఖ్యానిస్తున్నాడు. అధికారులెవరైనా కేసులు నమోదు చేయడానికి సిద్ధమైతే వారిని కట్టడి చేయడానికి నోట్ల కట్టలను సిద్ధం చేసుకున్నాడు.





• నీరాజనం

కానూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు శనివారం ఘనస్వాగతం లభించింది. చంద్రబాబు వస్తున్నారని సమాచారం రావడంతో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఆయన కాన్వాయ్‌పై పూలజల్లులు కురిపించడానికి బంతిపూలను భారీగా తీసుకొచ్చారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. వారిని చంద్రబాబు వాహనం వరకు అనుమతించకపోవడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు.



• అలుపెరగని అంగన్వాడీలు

అంగన్వాడీలు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. రోజుల తరబడి ఇళ్లు వదిలి, రోడ్డెక్కి, పండుగ నాడూ అయినవారికి దూరంగా ఆందోళన చేపడుతున్నారు. 33వ రోజు శనివారం కూడా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ధర్నాచౌక్‌లో అంగన్వాడీలు చేపట్టిన రిలే దీక్షలకు మద్దతు భారీగా చేకూరగా, పిడికిలి బిగించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తారు.

వైభవంగా జోసఫ్ తంబి తిరునాళ్ల ప్రారంభం

- 6లో..

అధికార మదంతో అమానుషంగా ప్రవర్తిస్తున్నారు

- 6లో..

▸▸ చర్యలు తీసుకోండి..వైసీపీ నేతపై తంగిరాల సౌమ్య ఫిర్యాదు

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దుర్మరణం

- 6లో..

ఒక్కొక్కరుగా గుడ్‌బై



రెండు జిల్లాల్లో వైసీపీని వీడుతున్న కీలక నేతలు

రెండు జిల్లాల్లో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడిన మచిలీపట్నం ఎంపీ బాలశౌరి శనివారం పార్టీకి రాజీనామా చేశారు. ఇప్పటికే పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ పార్టీకి గుడ్‌బై చెప్పే వారి జాబితాలో ఉండగా, అనూహ్యంగా వారందరి కంటే ముందు బాలశౌరి పార్టీకి రాజీనామా చేయడం ఆశ్చర్యపరిచింది. వైఎస్సార్ హయాం నుంచి బాలశౌరి ఆ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా పేరొందారు. మొత్తానికి ఒకరి తర్వాత ఒకరు వైసీపీకి గుడ్‌బై చెబుతుండటంతో రెండు జిల్లాల్లో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

- అధిష్ఠానం తీరుతో బయటకొస్తున్న ఎమ్మెల్యేలు
- తాజాగా ఎంపీ బాలశౌరి రాజీనామా
- లిస్టులో పార్థసారథి, విష్ణు, రక్షణనిధి కూడా..
- పార్టీ నగర అధ్యక్షుడు భవకుమార్ ఆలోచనా అదే..
- బందరులో కుటిల రాజకీయాలతో బాలశౌరి మనస్తాపం
- కలిసి ప్రయాణం కష్టమంటూ సన్నిహితులతో వ్యాఖ్య

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన బాలశౌరి 2004లో తెనాలి, 2009లో నరసరావుపేట లోక్‌సభ నుంచి ఎంపీగా గెలుపొందారు. 2013, అక్టోబరులో వైసీపీలో చేరారు. 2014లో గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2019లో మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని అందరు ఎమ్మెల్యేలతో సఖ్యతగా ఉండే బాలశౌరికి స్థానిక ఎమ్మెల్యే పేర్ని నానీతో మాత్రం తొలి నుంచీ పొసగలేదు. మచిలీపట్నంలో

- మిగతా 6లో

పొగబెట్టి.. బుజ్జగింపులు!

- భవకుమార్ ఇంటికి దేవినేని అవినాశ్, బుచ్చిబాబు
- వైసీపీని వీడొద్దని బుజ్జగింపులు
- టీడీపీలోకి రండి..భవకుమార్‌కు వంగవీటి రాధా ఆహ్వానం



భవకుమార్‌తో భేటీ అయిన రాధా

(విజయవాడ - ఆంధ్రజ్యోతి): 'పార్టీని వీడొద్దు.. కలిసి ప్రయాణం చేద్దాం' అంటూ వైసీపీ విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్‌కు ఆ పార్టీ నేతలు దేవినేని అవినాశ్, కడియాల బుచ్చిబాబు విజ్ఞప్తి చేశారు. భవకుమార్ పార్టీని వీడుతున్నారన్న సమాచారంతో వైసీపీ పెద్దలు అప్రమత్త మయ్యారు. శనివారం హడావుడిగా దేవినేని అవినాశ్, బుచ్చిబాబును భవకుమార్ వద్దకు పంపారు. ఆయన్ను బుజ్జగించి పార్టీలో కొనసాగాలే చూసేందుకు అవినాశ్, బుచ్చిబాబు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నెహ్రూతో కలిసి ప్రయాణం చేసిన తనకు ఆయన కొడుకు అవినాశ్‌తో కలిసి పనిచేయడం ఇబ్బందేమీ కాదని కానీ అవినాశ్ తనను దూరం పెడుతూ వచ్చారని భవకుమార్ వారి వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. అవినాశ్ వైసీపీలో చేరకముందు నుంచే తాను పార్టీలో ఉన్నానని, తన సీనియార్టీకైనా గౌరవం ఇవ్వకుండా తనను అవమానాలకు గురి చేశారని, అలాంటి పార్టీలో కొనసాగాలనే ఉద్దేశం తనకు లేదని భవకుమార్ స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో గంటకుపైగా భవకుమార్‌తో భేటీ అయిన అవినాశ్ నిరాశతో వెనుదిరిగారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉంటూ వైసీపీలో బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేశానని, కానీ పార్టీ తనను గుర్తించి పదవిని ఇవ్వాలని ప్రయత్నించిన ప్రతిసారీ అవినాశ్ వర్గం అడ్డుకుందన్న అభిప్రాయంతో భవకుమార్ ఉన్నారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ పదవి దాదాపు ఖరారై జాబితాలో తన పేరు ఉన్నా చివరి నిమిషంలో దాన్ని మార్పించేశారని, డీసీసీబీ చైర్మన్‌గా తనకు అవకాశం లభించాల్సి ఉండగా దాన్నీ అడ్డుకున్నారని సన్నిహితులతో వ్యాఖ్యానించారు. తనకు చాలా అవమానాలు జరిగినా ఏనాడూ బయటపడలేదని, ఇకపై మౌనం సరికాదనే పార్టీని వీడాలన్న నిర్ణయానికి భవకుమార్ వచ్చారు.

త్వరలోనే టీడీపీలో చేరుతా..

భవకుమార్‌ను టీడీపీ నేతలు యార్లగడ్డ వెంకట్రావు, వంగవీటి రాధా శనివారం వేర్వేరుగా కలిశారు. టీడీపీలోకి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాధా, భవకుమార్ వైసీపీలో తాము ఎదుర్కొన్న అవమానాలను గుర్తు చేసుకున్నారు. చిత్తశుద్ధితో పనిచేసే వారికి వైసీపీలో సరైన గుర్తింపు ఉండదని భవకుమార్ వ్యాఖ్యానించారు. త్వరలోనే టీడీపీలో చేరతానని ఆయన రాధాకు స్పష్టం చేశారు.



సీఐడీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న టీడీపీ పెనమలూరు కార్యకర్తలు

బోడె ప్రసాద్‌కే టికెట్ ఇవ్వాలి

విజయవాడ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): "పెనమలూరు సీటును మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కే ఇవ్వాలి. ఆయనే మాకు కావాలి. కానూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయం వద్ద శనివారం వినిపించిన నినాదాలు ఇవి. ఇసుక సరఫరాలో అవకతవకలు జరిగాయని సీఐడీ నమోదు చేసిన కేసులో వ్యక్తిగత పూచీకతును సమర్పించాలని హైకోర్టు చంద్రబాబును ఆదేశించిన విషయం తెలిసిందే. ఆయన వ్యక్తిగత పూచీకతు సమర్పించడానికి సీఐడీ కార్యాలయానికి వచ్చారు. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కానూరులోని తులసీనగర్‌కు చేరుకున్నారు. చంద్రబాబు ఎదుట ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేశారు. చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలని ఒకసారి నినాదాలు చేస్తే, బోడె ప్రసాద్‌కు పెనమలూరు సీటు ఇవ్వాలని రెండుసార్లు నినాదాలు చేశారు. నినాదాలు చేయెుద్దని కొంతమంది ద్వితీయ శ్రేణి నేతలు వారించినా కార్యకర్తలు ఆగలేదు. చంద్ర బాబు సీఐడీ కార్యాలయానికి వచ్చినప్పుడు, వెళ్లేటప్పుడు, కార్యాలయంలో ఉన్నప్పుడూ నినాదాలు భారీగా చేశారు. చంద్రబాబు వారికి అభివాదం చేశారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న తంగిరాల సౌమ్య

అధికార మదంతో అమానుషంగా ప్రవర్తిస్తున్నారు

- దళిత మహిళనని చూడకుండా అవమానించారు
- చర్యలు తీసుకోండి..వైసీపీ నేతపై తంగిరాల సౌమ్య ఫిర్యాదు

నందిగామ, జనవరి 13: అధికార మదంతో దళిత మహిళనైన తనను అవమానించేలా వీడియోలు ప్రదర్శించిన వైసీపీ నాయకుడు దుబాయ్ కరీముల్లాకు బుద్ధి చెప్పి తీరుతానని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ఆరో వార్డులో నిర్వహించిన వైసీపీ సభలో తనపై అవమాన కరంగా డాక్యుమెంట్ సిద్ధం చేసిన కరీముల్లాపై శనివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికార మదంతో వైసీపీ నాయకులు తన పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెకిలి ప్రవర్తన గల నాయకులు దళిత మహిళను అవమానిస్తుంటే చూస్తూ ఆనందించిన మంత్రి జోగి రమేశ్, ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహనరావు, సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీ మొండి తోక అరుణ్‌కుమార్‌లకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. తనను అవమానించిన వ్యక్తులను పట్టణ వీధుల్లో పరిగెత్తిస్తానని హెచ్చరించారు. సరైన ప్రత్యామ్నాయం లేకుండా రోడ్ల విస్తరణ పనులు చేపట్టి ప్రజలను ఇబ్బంది పడుతుంటే ప్రశ్నించడం పిచ్చి ఎలా అవుతుందని ప్రశ్నించారు. జాతీయ నాయకుల విగ్రహాలతో పాటు తన తండ్రి విగ్రహాన్ని మునిసిపల్ కార్యాలయంలో బాత్‌రూమ్‌ల వద్ద పడవేశారని దానిపై స్పందించడం తప్పా అని ప్రశ్నించారు. మీ ఇళ్లలో ఆడవారి వీడియోలు కూడా ఇలానే తయారు చేసి మేము ప్రదర్శిస్తే మీకు ఆ బాధ తెలుస్తుందన్నారు. మూడు నెలల తరువాత మీ పరిస్థితి ఎలా ఉంటుందో చూసుకోండని హెచ్చరిం చారు. మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మహిళకు జరిగిన అవమానాన్ని ఆనందిం చడం హేయమన్నారు. తాను అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తానని ఆమె హెచ్చరించారు.

వైసీపీ ప్రభుత్వం రూ.600 కోట్లు దారి మళ్లించింది

- వెంటనే ఆ నిధులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమచేయాలి
- సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ డిమాండ్

ఉయ్యూరు, జనవరి 13: స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో వైసీపీ ప్రభుత్వం వాడుకునేందుకు చూస్తున్న రూ.600 కోట్లను గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో వెంటనే జమచేయాలని సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ డిమాండ్‌చేశారు. శనివారం స్థానికంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12,918 గ్రామాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-2023 ఆర్థిక సంవత్సరానికి రెండో విడతగా రూ.988 కోట్ల నిధులు విడుదల చేసిందని, అందులో రూ.393 కోట్లు గ్రామ పంచాయతీల పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో జమచేసి, మిగిలిన రూ.600 కోట్లు వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆయన ఆరోపించారు. గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులు దారి మళ్లింపునకు నిరసనగా సంఘం ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టేందుకు సిద్ధమవుతున్నామన్నారు. దారిమళ్లించిన నిధులు గ్రామపంచాయతీల ఖాతాల్లో జమచేయకపోతే పంచాయతీరాజ్ చాంబర్, సర్పం చ్‌ల సంఘం ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముట్టడించేం దుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంత రాయ గ్రంథాలయంలో శనివారం చావా నర్సింహారావు నిర్వహించారు. యువగాయని ప్రజ్ఞకి ఆత్మీయ సత్కారం చేశారు. సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి, కొప్పరపు బలరాం దంపతులు, ప్రసూనరామన్, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని ఆమెను సత్కరించారు.



కొత్తపల్లిలో పామాయిల్‌తోటలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరి

బరులు సిద్ధం

అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సంక్రాంతికి కోడి పందేల బరులను సిద్ధం చేశారు. బరుల వద్ద గుండాట, పేకాట వంటి జూదాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వీటిని నియంత్రించాల్సిన పోలీసులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

కోడిపందేలతో పాటు గుండాట, పేకాటకు ఏర్పాట్లు ● పట్టించుకోని పోలీసులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 13: గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి గ్రామగ్రామాన కోడిపందేలు నిర్వహించేందుకు బరులను అధికార పార్టీకి చెంది స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో భారీగా ఏర్పాటు చేస్తున్నారు. బరుల వద్దే పేకాట, గుండాటకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది రూ.వందకోట్లకు పైగా చేతులు మారనున్నాయని పందెంరాయుళ్లే చెబుతున్నారు. గతంలో కొత్తపల్లి, మడిచర్ల, ఓగిరాల గ్రామాల్లో కోడిపందేల్లో ఘర్షణలు చెలరేగాయి. కొన్ని రోజుల క్రితమే కొత్తపల్లిలో టీడీపీ-జనసేన బ్యానర్లను ధ్వంసం చేశారు. ఘటనపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదు. కోడిపందేల మాటున శాంతి భద్రతలకు విఘాతం కలిగితే గ్రామాల్లో గొడవలు జరిగే ప్రమాదం ఉంది.

అంపాపురంలో కేసినోకు ప్రత్యేక ఏర్పాట్లు

రాష్ట్రంలోనే పేరుగాంచిన అంపాపురం ప్రధానబరిలో రూ.కోట్లలో పందేలు నిర్వహించేందుకు అన్నిరకాల హంగులతో ఏర్పాట్లు చేశారు. ప్రధాన బరిలో ఒక్కో పందెం రూ.5లక్షలకు పైనే వేయనున్నారు. పక్కన 8బరుల్లో రూ.3లక్షల నుంచి రూ.50 వేల వరకూ పందేలు నిర్వహించనున్నారు. కేసినో కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అందర్‌బాహర్‌ను రూ.లక్షల్లో నిర్వహించాలని చూస్తున్నారు. చిన్నకోసు(పేకాట, గుండాట)కు కోసం 15 ఏర్పాటు చేస్తున్నారు. వీటికోసం ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకూ నిర్వాహకులు తీసుకున్నారని సమాచారం. పార్కింగ్, కోసుల ద్వారానే నిర్వాహకులకు పండగ మూడురోజుల్లోనే రూ.4కోట్లకు పైగా రాబడి ఉంటుందని అనుకుంటున్నారు.

జగ్గయ్యపేట ప్రాంతంలో 11కు పైగా..

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రాంతంలో పోలీసుల హెచ్చరికలు బేఖాతరు చేస్తూ పందెం బరులు సిద్ధమయ్యాయి. మండలం, పట్టణ పరిధిలో 11కి పైగా బరులు ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా చిన్న, చిన్న బరులు అనేకం ఉన్నాయి. జగ్గయ్యపేట ప్రాంతం తెలంగాణకు సరిహద్దుగా ఉండటంతో సరిహద్దు గ్రామాల్లో బరులకు డిమాండ్ బాగా ఉంది. బూదవాడ, జాతీయ రహదారిపై అనుమంచిపల్లి, తిరుమలగిరి, జగ్గయ్యపేట సమీపంలో సత్యనారాయణపురం, మంగోల్లు, వత్సవాయిల్లో బరులు సిద్ధం చేశారు.

బరులు, పేకాట శిబిరాల వద్ద బౌన్సర్లు

తిరువూరు: నియోజకవర్గంలో భారీగా కోడి పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. పందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసిన పోలీసుల వద్దకే పందేలు, పేకాల నిర్వాహణకు అనుమతుల కోసం నిర్వాహకులు వెళ్లడం గమనార్హం. గత ఏడాది ఆర్డీవో కార్యాలయం(ఎన్టీఆర్ స్టేడియం)పక్కనేగల మామిడి తోటలో కోడిపందేలు, పేకాట నిర్వహించారు. ఈ ఏడాది ఆ తోటలో పందేల నిర్వాహణకు బరులు సిద్ధం చేసుకుని, స్టాల్స్ నిర్వహణకు అడ్వాన్సులు తీసుకుని స్థలం కేటాయింపులు పూర్తిచేసుకున్నారు. చివరి నిముషంలో ఆర్డీవో కార్యాలయం సమీపంలోని మామిడి తోటలో పందేల నిర్వాహణకు అనుమతి ఇవ్వరనే సమాచారంతో పట్టణ శివారు అష్టలక్ష్మి ఆలయం సమీపంలోని మామిడి తోటలో బరులు సిద్ధం చేశారు. స్టాల్స్ పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పట్టణంలో రెండు చోట్ల, మండలంలోని కాకర్ల, మల్లేల, ముష్టికుంట్ల గ్రామాల్లో నియోజకవర్గం పరిధిలోని విస్సన్నపేట మండలంలో తాతకుంట్ల, వేమిరెడ్డిపల్లి, కొర్లమండ, తెల్లదేవరపల్లి, పుట్రాల గ్రామాల్లో, ఎ.కొండూరు మండలంలో గోపాపురం, చీమలపాడు, గంపలగూడెం మండలంలో తునికిపాడు, ఊటుకూరు, కొణిజర్ల గ్రామాల్లో కోడి పందేల నిర్వాహణకు ఏర్పాట్లు చేశారు. పట్టణంతో పాటు మండలంలోని కాకర్ల, మల్లేల గ్రామాల్లోని కోడిపందేల శిబిరాల వద్ద పేకాట శిబిరాల నిర్వహణకు పెద్దమొత్తంలో నగదుచేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. దూరప్రాంతానికి చెందిన వారు పందేల వద భారీ పేకాట శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బరులు, పేకాట శిబిరాల వద్ద బౌన్సర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

జూదగాళ్లు, అధికార పార్టీ నేతలు చేతులు కలిపి..

పామర్రు: అధికారుల ఉదాసీన వైఖరితో అడ్డూ, పామర్రులో జూదగాళ్లు, అధికార పార్టీ చోటా నేతలతో చేతులు కలిపి పందెపు బరులు సిద్ధం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు తమవారేనని అధికార పార్టీకి చెందిన ఓ నేత జూదపురాయుళ్లకు అభయం ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. నిత్యం కలెక్టరు, ఎస్పీ ఇతర ఉన్నతాధికారులు పయనించే మచిలీపట్నం-విజయవాడ రహదారి సమీపంలోని పామర్రు మార్కెట్ యార్డు ఎదురుగా బరి ఏర్పాటుకు, జూదనిర్వహణకు స్టాల్స్ పేకాట, గుండాట శిబిరాలకు రూ.లక్షల వసూలు చేశారని తెలుస్తోంది.



ఉయ్యూరు మండలం బొల్లపాడులో సిద్ధం చేసిన బరి





పామర్రు, తిరువూరులో బరులు







కంకిపాడు మండలం ఉప్పలూరు, కె.సీతారాంపురంలో జాతీయ రహదారి పక్కన, ఉయ్యూరు మండలం పెద ఓగిరాలలో సిద్ధమైన బరులు

ఆకునూరు హైస్కూల్‌లో బరి

- తొలగించిన పోలీసులు



ఆకునూరు హైస్కూల్‌లో బరి వద్ద టెంట్లు తొలగించిన పోలీసులు

ఉయ్యూరు: మండలపరిధిలో కోడిపందేలకు బరులను పెద్ద సంఖ్యలో సిద్ధం చేశారు. బోల్లపాడు, ఆకునూరు, పెద ఓగిరాలలో పందేలు వేసేందుకు లైటింగ్‌తో పాటు పందెంరాయుళ్ల కోసం ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. ఆకునూరు ప్రభుత్వ పాఠశాల(హైస్కూల్) ఆవరణలో పెద్ద సంఖ్యలో పందేలు వేసేందుకు శనివారం ఉదయానికే టెంట్లువేసి బరులు సిద్ధం చేయగా కంకిపాడు సీఐ శ్రీనివాస్, ఉయ్యూరు రూరల్ ఎస్సై అవినాశ్ సిబ్బందితో వెళ్లి టెంట్లు తొలగించారు. మూర్తిరాజు పాలెం రోడ్డులోని ఓ ప్రైవేట్ వెంచర్‌లోకి మార్చారు. పెదఓగిరాల, ఆకునూరు ప్రైవేట్ వెంచర్, బోల్లపాడు చింతల తోటలో బరుల వద్ద ఇప్పటికే చాటుమాటుగా పందేలు ప్రారంభించారు.

వైభవంగా జోసఫ్ తంబి తిరునాళ్ల ప్రారంభం

ఉంగుటూరు, జనవరి 13: పెదఅవుటపల్లిలోని కథోలిక పుణ్యక్షేత్రంలో బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి మహోత్సవాలు(తిరునాళ్ల)శనివారం ఉదయం 7గంటలకు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు నిర్వహించే వేడుకలను మేరీమాత కపూచియన్, ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా ప్రొవిన్షియల్ రెవరెండ్ ఫాదర్ ప్రత్తిపాటి మరియదాసు, ఇతర గురువులు కలిసి జ్యోతి ప్రజ్వలనచేసి లాంఛనంగా ప్రారంభించారు. తొలుత తంబి సమాధివద్ద మరియదాసు ప్రత్యేక ప్రార్థనలు చేశాక, తంబి కళావేదిక వద్ద దివ్యపూజాబలిని సమర్పించారు. ఉదయం పదిన్నరకు రెవరెండ్ ఫాదర్ చాపిరేవుల ఏసుపాదం, మధ్యాహ్నం రెండున్నరకు రెవరెండ్ ఫాదర్ కాటా బాలజోజప్ప దివ్యపూజలను సమర్పించారు. సాయంత్రం 5గంటలకు కపూచియన్ నూతన గురువులు, జూబిలేరియన్స్ సమిష్టి దివ్యబలిపూజను సమర్పించారు.



జ్యోతి ప్రజ్వలనచేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న గురువులు

శరవేగంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 13: స్వరాజ్య మైదానంలో 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 19న నిర్వహిస్తున్నందున కార్యక్రమ ఏర్పాట్లను శరవేగంగా చేస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు వివరించారు. శనివారం విగ్రహావిష్కరణ ఏర్పాట్లను జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి ఏలూరు, పల్నాడు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి 80 వేల మందికి పైగా తరలిరానున్నారని కలెక్టర్ తెలిపారు. వాహనాలకు జిల్లాల వారీగా ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి అంబేడ్కర్ స్మృతివనం వరకు మహాత్మాగాంధీ రహదారిపై బారికేడింగ్ ఏర్పాటు చేస్తున్నామని, వివరాలను ప్రజలకు తెలియజేసేలా ఎల్ఈడీ స్క్రీన్లను నగరంలోని ప్రధాన కూడళ్ల, ఎంజీ రోడ్డులో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి వచ్చే వారి కోసం మధ్యాహ్నం భోజనం, స్నాక్స్, రాత్రి భోజనానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సంక్రాంతి శోభ ప్రతి కుటుంబంలో వెల్లివిరియాలి

- జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు



కృష్ణలంక, జనవరి 13: సంక్రాంతి అంటేనే అచ్చ తెలుగు పండుగ. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ. పల్లె పండుగ, రైతుల పండుగ. ఉపాధి కోసం ఎక్కడికెక్కడికో వెళ్లిన జిల్లా ప్రజలు తమ స్వగ్రామాలకు ఆటవిడుపుగా వచ్చి తమ కుటుంబ, సాంస్కృతిక మూలాలకు విలువనిచ్చే పెద్ద పండుగని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అధికారులు, ఉద్యోగులు, ప్రజలు ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పండుగ జరుపుకోవాలని ఢిల్లీరావు శుభాకాంక్షలు తెలిపారు.

కొండలకు గుండ్లు..!

- రూరల్ గ్రామాల్లో వైసీపీ నేతల అక్రమ మైనింగ్
- టీడీపీ నేత గన్నె ప్రసాద్ ధ్వజం
- కొత్తూరు తాడేపల్లిలో టీడీపీ నేతల నిరసన దీక్ష

విజయవాడ రూరల్, జనవరి 13: రూరల్ గ్రామాల్లోని వైసీపీ నేతలు సీఎం వైఎస్ జగన్‌ను ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లో కొండలకు గుండ్లు కొట్టేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ (అన్నా) విమర్శించారు. గ్రామంలో అక్రమ మైనింగ్ అరికట్టాలని కోరుతూ రెండు రోజులుగా జరుగుతున్న నిరసన దీక్షా శిబిరం వద్దకు శనివారం వచ్చిన గన్నె నేతలకు సంఘీభావం తెలిపారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోపిడీ పెరిగిపోయిందని ప్రధానంగా గ్రామాల్లో సంపదను దోచుకుంటున్నారన్నారు. కొత్తూరు తాడేపల్లి పరిసరాలతో పాటు మైలవరం నియోజకవర్గంలో మైనింగ్ మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. కోట్లాది రూపాయలు దోపిడీ చేస్తున్నారన్నారు. మైనింగ్ మాఫియా అంతా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కనుసన్నల్లో నడుస్తోందన్నారు. తరువాత రాబోది తెలుగుదేశం ప్రభుత్వమేనని హెచ్చరించారు. అనంతరం గ్రామ రైతు వేములకొండ నాగరాజు మాట్లాడుతూ తన పొలం పక్కనే అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ అక్కల రామమోహనరావు గాంధీ, జిల్లా కార్యదర్శిచింతల లక్ష్మీ, రీజనల్ కోఆర్డినేటర్ విజయలక్ష్మీ, గ్రామ రైతులు చెరుకుపల్లి సురేష్, చింతా సుధాకర్, ఈడ రామకృష్ణ, వెంకట్రావు, బుజ్జి, సాయి, మొండం జమలయ్య పాల్గొన్నారు.

వరల్డ్ టెన్నిస్ మాస్టర్స్ టోర్నీకి రామకృష్ణ

విజయవాడస్పోర్ట్సు, జనవరి 13: టర్కీలో మార్చి 10 నుంచి 15 వరకు జరిగే ఐటీఎఫ్ ప్రపంచ టెన్నిస్ మాస్టర్స్ టూర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌కు నగరానికి చెందిన డాక్టర్, ప్రముఖ మాస్టర్స్ టెన్నిస్ ప్లేయర్ సూదగాని రామకృష్ణ ఎంపికయ్యారు. 75 ప్లస్ విభాగంలో అశోక్ జిందాల్ కెప్టెన్‌గా వ్యవహరించే టీమ్‌లో రామకృష్ణ ఇండియా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దుర్మరణం

ఉంగుటూరు, జనవరి 13: చెన్నై-కోల్‌కతా 16వనెంబర్ జాతీయరహదారిపై పొట్టిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతిచెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. ఆత్కూరు ఎస్సై టి.సూర్యశ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం పసర్లపూడికి చెందిన శ్రీరామరెడ్డి సత్యానాగసాయి(26), అదే జిల్లా రామచంద్రపురానికి చెందిన బొబ్బా చాందిని(25) హైదరాబాద్‌లో వేర్వేరు కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు ఇద్దరు బుల్లెట్‌పై శుక్రవారం రాత్రి 11గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరారు. తలకు హెల్మెట్లు ధరించారు. శనివారం ఉదయం విజయవాడ దాటాక చాందినికి చెవి నొప్పిగా వుండటంతో హెల్మెట్ తీసి బండికి తగిలించింది. పొట్టిపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగిన తర్వాత మంచు కారణంగా దారి సరిగా కనబడకపోవడంతో రోడ్డు పక్కన ఆగి ఉన్న భారీ కంటైనర్‌ను బుల్లెట్ వెనుక నుంచి ఢీకొట్టింది. బైక్ వెనుక కూర్చున్న చాందిని ఎగిరి రోడ్డుపై పడి, తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సత్యనాగసాయికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు చాందిని మృతదేహాన్ని పోస్టుమార్టానికి గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒక్కొక్కరుగా గుడ్‌బై

(ఐదో పేజీ తరువాయి)

తమదే ఆధిపత్యం అనే రీతిలో పేర్ని నాని, ఆయన కొడుకు కిట్టూ వ్యవహరిస్తుండటంతో ఎంపీకి అధికారుల నుంచీ సహాయ నిరాకరణ ఎదురవుతూ వచ్చింది. కనీసం ప్రొటోకాల్ పాటించకుండా తనను అవమానిస్తున్నారని సాక్షాత్తూ ఎంపీనే బహిరంగంగా పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో పేర్ని నాని ఆధ్వర్యంలో జరిగిన ప్రధానమైన అభివృద్ధి కార్యక్రమాలకు కానీ, పార్టీ కార్యక్రమాలకు కానీ బాలశౌరిని ఆహ్వానించలేదు. మచిలీపట్నం నియోజకవర్గంలో తమకు ఇష్టం లేకుండా, సంప్రదించకుండా ఏదైనా అభివృద్ధి చేస్తే పేర్ని నాని సహించలేకపోయేవారు. తాను, తన కొడుకు తప్ప మరొకరికి పేరు రావడాన్ని ఆయన అంగీకరించేవారు కాదు. ఈ ధోరణితో ఎంపీతో ఆయనకు దూరం పెరుగుతూ వచ్చింది.

అడుగడుగునా అవమానాలే..

- మచిలీపట్నం నియోజకవర్గంలోని ఇనుగుదురుపేట జామియా మసీదు ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధుల కోసం వైసీపీ మైనారిటీ నాయకులు ఎంపీ బాలశౌరిని కోరారు. వారి అభ్యర్థన మేరకు ఎంపీ రూ.25 లక్షలు తన ఎంపీ నిధుల నుంచి మంజూరు చేయించారు. ఈ మేరకు 2022, డిసెంబరు 2న జిల్లా కలెక్టర్‌కు లేఖ కూడా రాశారు. ఎంపీ నుంచి నిధులు తెచ్చుకున్నారన్న కారణంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మచిలీపట్నం కార్పొరేషన్ నుంచి అనుమతులు రాకుండా చేశారు పేర్ని నాని. అనుమతులు ఇవ్వకుంటే ఆందోళన చేస్తామని ముస్లిం మత పెద్దలు హెచ్చరించడంతో చివరికి దిగివచ్చి అనుమతులు మంజూరు చేయించారు.
- ఉమ్మడి కృష్ణాజిల్లావాసుల సుదీర్ఘ కల అయిన మచిలీపట్నం పోర్టును సుమారు రూ.12 వేల కోట్లతో అభివృద్ధి చేయడానికి టీడీపీ హయాంలోనే రూట్‌మ్యాప్ రెడీ అయింది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే పేర్ని నాని పోర్టు నిర్మాణ పనులను ప్రభుత్వమే చేపట్టి పరుగులు తీయిస్తుందని ప్రకటించారు. ఐదేళ్ల కాలంలో మూడేళ్లపాటు పేర్ని నాని మంత్రిగా అధికారం చెలాయించారు. కానీ, బందరు పోర్టు పనులు మాత్రం అడుగు ముందుకు పడలేదు. ఎంపీ బాలశౌరి పోర్టు నిర్మాణం కోసం చొరవ తీసుకున్నా ఆయనకు పేరు రాకూడదన్న ఉద్దేశంతో నాని వాటిని అడ్డుకుంటూ వచ్చారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో కొద్దిరోజుల క్రితం పోర్టు నిర్మాణం జరుగుతుందంటూ హడావుడి మొదలుపెట్టారు.
- ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడిగా, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మచిలీపట్నం ఖ్యాతిని దశదిశలా చాటిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో స్మారక భవనం నిర్మించాలన్న ఆలోచనకు ఎంపీ బాలశౌరి ఊపిరిపోశారు. స్మారక భవనంతో పాటు మ్యూజియం, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఆంధ్రాబ్యాంకును విలీనం చేసుకున్న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉన్నతస్థాయి అధికారులతో పలుమార్లు సంప్రదింపులు జరిపి రూ.70 కోట్లను మంజూరు చేయించారు. ఈ నిర్మాణ పనులకు మచిలీపట్నంలో 2 ఎకరాలు కేటాయించాలని ఎంపీ... అధికారులను పదేపదే కోరుతూ వచ్చారు. కానీ, భూకేటాయింపులు జరగకుండా పేర్ని నాని అడ్డుచక్రం వేయడంతో ఆ పనులు ముందుకు సాగలేదు. మరోవైపు స్మారక భవనానికి కేటాయించాలని కోరిన స్థలాన్ని వైసీపీ జిల్లా కార్యాలయానికి కేటాయింపజేసుకున్నారు. అక్కడ వైసీపీ జిల్లా కార్యాలయం ఆగమేఘాలపై పూర్తయింది. యువతకు ఉపాధి కల్పించాల్సిన స్కిల్ సెంటర్ మాత్రం జాడ లేకుండాపోయింది.
- మచిలీపట్నం కార్పొరేషన్ 33వ డివిజన్ కార్పొరేటర్ అస్గర్ అలీని పేర్ని నాని రెచ్చగొట్టి ఎంపీ బాలశౌరిని బూతులు తిట్టించారు. 2022, జూన్ 10న జరిగిన ఈ ఘటన పేర్ని నాని, ఎంపీ బాలశౌరికి నడుమ శాశ్వతంగా దూరం పెంచేసింది. అస్గర్.. పేర్ని నానికి ముఖ్య అనుచరుడు. ఆయన గీసిన గీత దాటడన్న పేరుంది. ఈ వివాదంలో వైసీపీ పెద్దలు సరైన రీతిలో వ్యవహరించలేదని బాలశౌరి మనస్థాపం చెందారు.

త్వరలో మరో ఇద్దరు ఎమ్మెల్యేలు అవుట్

వైసీపీ నుంచి త్వరలో మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా బయటకు వస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఈ ఇద్దరిలో ఒకరు తెలంగాణ సరిహద్దులో ఉన్న నియోజకవర్గానికి చెందినవారు కాగా, మరొకరు విజయవాడ చెంతనే ఉన్న నియోజకవర్గానికి చెందినవారు. ప్రభుత్వం నుంచి వీరిద్దరికీ నిధులు విడుదల కావాల్సి ఉంది. ఈ కారణంగా ఇద్దరూ ఓపిగ్గా వేచిచూసే ధోరణిలో ఉన్నారు. నిధుల విడుదలపై స్పష్టత వచ్చిన మరుక్షణం వీరిద్దరూ పార్టీ నుంచి బయటకు వస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఒకరు జనసేనలో.. మరొకరు టీడీపీలో చేరుతారని సమాచారం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

ఘనంగా రాకేష్ శర్మ జన్మదిన వేడుకలు

చిట్టినగర్, జనవరి 13: అంతరిక్ష తొలి భారతీయ వ్యోమగామి రాకేశ్ శర్మ జన్మదిన వేడుకలు శనివారం కేఎల్ రావునగర్ రాకేష్ పబ్లిక్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. తొలుత స్కూల్ డైరెక్టర్ ఎన్.వి.రావు, ప్రభుత్వం ఉపాధ్యాయురాలు రేణుకాదేవి, పలువురు ఉపాధ్యాయులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రేణుకాదేవి తదితరులు రాకేష్‌శర్మ అంతరిక్షంలో ప్రయాణం చేసిన అనుభవాలను వివరించారు.

ఎన్.వి.రావు మాట్లాడుతూ రాకేష్ శర్మ పేరిట తన స్కూల్‌లో పేదలకు అతి తక్కువ ఫీజుతో విద్యను అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు మల్లేశ్వరి, మహారాజ్, మమత, షకీలా, ధనలక్ష్మి, చాముండేశ్వరి, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాతియుగంగా మారిన రాష్ట్రం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 13 : వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం రాతియుగంగా మారిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. తూర్పులోని 11వ డివిజన్‌లో బూత్ కన్వీనర్ల సమావేశాన్ని శనివారం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గద్దె పాల్గొని మాట్లాడారు. జగన్ మోహన్‌రెడ్డి చేసిన అక్రమాలు, దురాగతాలకు సంబంధించి జారీ చేసిన పత్రాలను ఆదివారం తెల్లవారుజామున టీడీపీ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయం ఆవరణలో నిర్వహించే భోగి మంటల్లో వేసి దహనం చేస్తామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అనేక శక్తులు, కార్యక్రమాలు చాలా ఉన్నాయని, వాటినన్నింటిని భోగి మంటల్లో వేయాలన్నారు. రానున్న కాలంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత చేసే మంచి కార్యక్రమాలను తలచుకుంటూ మన గుండెల్లో సంతోషాన్ని నింపుకుని భోగి మంటల కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. రాష్ట్రాన్ని గంజాయి వనం కాకుండా, యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ భోగి మంటల సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తామన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి చోట ఈ భోగి మంటల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు గద్దె భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ అధ్యక్షుడు కోనేరు రాజేష్, కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, దేవరపల్లి ఆంజనేయులు, పామర్తి కిషోర్, కొలసాని నాగమణి, బంగారు మురళీ, వల్లభనేని సుగణ పాల్గొన్నారు.

టీడీపీ సెంట్రల్ కార్యాలయం వద్ద సంక్రాంతి సంబరాలు

● భోగి మంటల్లో జీవో నెం. 2 కాపీలు దహనం

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 13 : టీడీపీ సెంట్రల్ కార్యాలయం వద్ద శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భోగి మంటల్లో అంగన్వాడీలకు వ్యతిరేకంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.2 కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీలు చేస్తున్న ఆందోళనలో న్యాయం ఉందన్నారు. అంగన్వాడీల సేవలకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజల ఆగ్రహ జ్వాలల్లో కాలిపోవడం ఖాయమని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. నేతలు ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు, పిరియా సోమేశ్వరరావు, లబ్బా వైకుంఠం, పైడి శ్రీను, మాజీ కార్పొరేటర్ పైడి తులసి పాల్గొన్నారు.



జీవోనెం. 2 కాపీలను దహనం చేస్తున్న బొండా ఉమా

సంక్రాంతి సందడి



కేబీఎన్ కాలేజీలో..

విద్యాధరపురం, జనవరి 13: కేబీఎన్ కాలేజీలో శుక్రవారం ప్రారంభమైన రెండు రోజుల సంక్రాంతి సంబరాలు శనివారం సందడి సందడిగా సాగాయి. హైందవ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ సంక్రాంతి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ వేడుకలను కళాశాల కోశాధికారి అన్నం రామకృష్ణారావు ప్రారంభించారు. ఉమెన్స్ స్టడీ సెంటర్, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. గంగిరెద్దు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. హరిదాసులు తమ సంకీర్తనలతో ఆధ్యాత్మికతను పంచారు. విద్యార్థినులు కోలాటాలు ఆడారు. భోగి మంటలతో సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినులు తమదైన శైలిలో హంగామా చేశారు. పిండివంటలు చేసి రుచులను తినిపించారు. కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, స్టడీ సెంటర్ కన్వీనర్ విశైలజ, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి కార్యక్రమాలు నిర్వహించగా వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఇన్నర్ వీల్ క్లబ్ కన్వీనర్‌లు కరీమ్ బీర్‌కౌర్, శ్రీదేవి పాల్గొన్నారు.

● 42వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ● 37వ డివిజన్‌లో మన ఊరు-మన ఆట కార్యక్రమంలో భాగంగా 37వ డివిజన్ జనసేన అధ్యక్షుడు శిగినంశెట్టి రాముగుప్తా కమిటీ ఆధ్వర్యంలో గోవింద రాజుల వారి వీధిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ పాల్గొని బహుమతి ప్రదానం చేశారు. తవ్వా మారుతి, మాజేటి శ్రీనివాస్, కొల్లిశెట్టి శివ, బొట్టా సాయి, పిళ్లా రవి తదితరులు పాల్గొన్నారు.



42వ డివిజన్‌లో



లయోల కాలేజీలో..

భారతీనగర్: లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ జోజిరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కళాశాల పోర్టికో వద్ద బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు.

విద్యార్థుల నృత్య ప్రదర్శనలతో కళాశాల ప్రాంగణం ఆహ్లాదకరంగా మారింది. ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ జోజిరెడ్డి బహుమతులను అందజేశారు. డాక్టర్ జోజిరెడ్డి విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రిన్సిపాల్ ఒ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాల స్వామి, డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, రీటా, లావణ్య, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం పనుల పరిశీలన

గవర్నర్‌పేట, జనవరి 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నగరంలో ఒక మైలురాయిగా మారబోతోందని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ అన్నారు. ఈనెల 19న ముఖ్యమంత్రి ప్రారంభించనున్న అంబేడ్కర్ స్మృతివనం పనులను శనివారం కమిషనర్ పరిశీలించారు. స్మృతివనం విజయవాడకు మణిహారం కానుందని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగేలా అధికారులు సన్నద్ధం కావాలని కోరారు.



మొబైల్ అన్న క్యాంటీన్

వన్‌టౌన్, జనవరి 13 : కేశినేని ఫౌండేషన్ 53వ డివిజన్‌లోని చేపలమార్కెట్ వద్ద మొబైల్ అన్న క్యాంటీన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు, అన్నార్తులకు భోజనాన్ని పంపిణీ చేశారు. చీపుళ్ల కోటేశ్వరరావు, తుపాకుల వెంకటేశ్వరరావు, సోమి వెంకటేశ్వరరావు, బోకం సత్తిబాబు, గుండు సుధాకర్, తాడిశెట్టి నరసింహ, దువ్వలపల్లి దుర్గారావు, బొమ్మిడి రాము, వరద వెంకటేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వన్‌టౌన్, జనవరి 13: గాయాలతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. నవంబరు 25న ఏలూరు రోడ్డులోని చల్లపల్లి బంగ్లా వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధుడి(70)ని అప్సరా థియేటర్ వైపు నుంచి వేగంగా వస్తున్న గుర్తుతెలియని కారు ఢీకొని తీవ్రంగా గాయ పడ్డాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇన్ని రోజులుగా అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా అతని తాలూకా ఎవరూ రాలేదు మరో వైపు అతను అపస్మారక స్థితిలో ఉండడంతో ఏమీ సమాచారం ఇవ్వలేకపోయాడు. గవర్నరుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు నిత్యావసర కిట్ల పంపిణీ

భవానీపురం, జనవరి 13 : సంక్రాంతి పండుగ సందర్భంగా జనసేన నగర అధికార ప్రతినిధి, ఐజా గ్రూప్ అధినేత షేక్ గయాజుద్దీన్ 5వేల మంది పేదలకు 15 రకాల నిత్యావసరాలతో కూడిన కిట్లను శనివారం భవానీపురం రజా మసీదు వద్ద పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం తాను ఇచ్చిన మాట ప్రకారం ఏటా హిందువులకు సంక్రాంతి కానుక, ముస్లింలకు రంజాన్ తోఫా, క్రిస్టియన్లకు కిస్మస్ కానుకలను అందిస్తున్నట్లు గయాజుద్దీన్ అన్నారు. ఐజా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న ముఠా కార్మికుడు అరెస్టు

విద్యాధరపురం, జనవరి 13: అక్రమంగా మద్యం తరలిస్తున్న విద్యాధరపురానికి చెందిన ముఠా కార్మికుడు గుంజా భాను (27)ను శనివారం భవానీపురం పోలీసులు అరెస్టు చేశారు. భాను శనివారం అక్రమంగా 16 బీరు బాటిల్స్ తీసుకుని వెళుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శంకర్ తన సిబ్బందితో వెళ్లి భానును అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.



రమణమ్మకు నివాళులర్పిస్తున్న కేశినేని శివనాథ్

గుజ్జర్లపూడి వెంకట రమణమ్మకు కేశినేని శివనాథ్ నివాళి

జి.కొండూరు, జనవరి 13: గడ్డమణుగు గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి సాంబశివరావు మాతృమూర్తి వెంకట రమణమ్మకు టీడీపీ నేత కేశినేని శివనాథ్, రాష్ట్ర మాజీ కార్యదర్శి జంపాల సీతారామయ్యతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. శనివారం ఆమె దశదిన కర్మ సందర్భంగా ఆయన గడ్డమణుగు వచ్చి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గొల్లపూడి నళినీ మోహన్‌రావు, లంక రామకృష్ణ, ఉయ్యూరు నరసింహారావు, పావులూరి సాంబశివరావు, వరికూటి శ్రీనివాసరావు ఉన్నారు.

మహిళలకు 'పీఎం కిసాన్' సాయం డబుల్!

▸ లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్రం కసరత్తు..

న్యూఢిల్లీ, జనవరి 13: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైతులకు పీఎం కిసాన్ సాయాన్ని పెంచేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు కసరత్తు చేస్తోంది. 2019 ఎన్నికలకు ముందు తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా ప్రస్తుతం దేశవ్యాప్తంగా 11 కోట్ల మంది రైతులకు ఏడాదికి రూ.6 వేలు అందుతోంది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే మహిళా రైతులకు ఈ మొత్తాన్ని రెట్టింపు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రూ.10 వేలు లేదా 12 వేలకు.. మిగతా రైతులకు రూ.8 వేలు లేదా రూ.9 వేలకు పెంచాలని యోచిస్తున్నారు. ఈ మేరకు ఫిబ్రవరి 1న సమర్పించే మధ్యంతర బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయనున్నట్లు సమాచారం. పీఎం కిసాన్ పథకం కోసం ఈ ఏడాది రూ.60 వేల కోట్లు కేటాయించారు. ఈ నెల 31వ తేదీన బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశముంది.

పదివేల మందికి చంద్రన్న సంక్రాంతి కానుక

▸ గుంటూరు పశ్చిమలో ఇంటింటికీ మన్నవ పంపిణీ



గుంటూరులో దివ్యాంగ మహిళకు సంక్రాంతి కానుక అందజేస్తున్న మన్నవ

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 10 వేల కుటుంబాలకు చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. కానుకల పంపిణీకి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో శనివారం స్వయంగా ఆయనే ఇంటింటికీ తిరిగి కానుకలు అందజేశారు. ఇటీవల దసరా పండుగకు కూడా చంద్రన్న పండుగ కానుక పంపిణీకి మన్నవ మోహనకృష్ణ ఏర్పాట్లు చేయగా, పోలీసులు ఆంక్షలు విధించి అడ్డుకున్నారు. దీంతో సంక్రాంతికి ఎలాగైనా పేదలకు పండుగ కానుక అం దజేయాలని సంకల్పించిన మన్నవ మోహనకృష్ణ ఈసారి పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆయనే ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అందించిన సేవా స్ఫూర్తితో పదేళ్లకు పైగా మన్నవ మోహనకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేదల ఇళ్లలో పండుగ ఆనందాలు తేవాలని గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు, రంజాన్ తోఫా పంపిణీ చేస్తే, జగన్‌రెడ్డి వాటిని రద్దు చేసి పేదల ఇళ్లలో పండుగ వెలుగులు లేకుండా చేశారని మండిపడ్డారు. పేదల కంట ఆనందం చూడాలని తాను కూడా చంద్రబాబు స్ఫూర్తితో చంద్రన్న సంక్రాంతి కానుక అందజేస్తున్నానని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతోపాటు, విపరీతమైన పన్నుల బాదుడుతో సామాన్యులు సైతం గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. అందుకే తన వంతు సామాజిక బాధ్యతగా నియోజకవర్గంలోని ఇంటింటికీ సంక్రాంతి కానుక అందజేశానని చెప్పారు.

విశాఖ ఉక్కు బ్లాస్ట్‌ఫర్నేస్-3లో పేలుడు

▸ ఎగిసిన మంటలు... కార్మికుల పరుగులు



విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్-3 నుంచి ఎగసిపడుతున్న మంటలు

విశాఖపట్నం, ఉక్కు టౌన్‌షిప్, జనవరి 13: విశాఖ స్టీల్‌ప్లాంటు బ్లాస్ట్‌ఫర్నేస్-3లో భారీ పేలుడు సంభవించింది. శనివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో ఆ పరిసరాల్లో పనిచేస్తున్న కార్మికులంతా ఎక్కడి పనులు అక్కడ వదిలేసి పరుగులు తీశారు. కార్మిక సంఘ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం..బ్లాస్ట్ ఫర్నేస్‌లో లిక్విడ్ స్టీల్ తయారీ ప్రక్రియలో భాగంగా 'స్లాగ్'(బూడిద) ఉప ఉత్పత్తిగా వస్తుంది. దానిని ఓపెన్ పిట్ (దీనినే స్లాగ్ గ్రాన్యులేషన్ పాట్-ఎస్‌జీపీగా వ్యవహరిస్తారు)లో తరలిస్తారు. బ్లాస్ట్ ఫర్నేస్-3 చాలాకాలం క్రితమే మూతపడగా, జిందాల్ స్టీల్ సాయంతో దానిని గత నెల 28నే తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఇంకా పూర్తిస్థాయిలో ఉత్పత్తి పునఃప్రారంభం కాలేదు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం ఓపెన్ పిట్‌లో తొలిసారిగా స్లాగ్‌ను వేశారు. అయితే అందులో నీరు ఉండడంతో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించి, మంటలు వ్యాపించాయి. ప్రాణ భయంతో కార్మికులు తలో దిక్కుకు పారిపోయారు. సీఐఎస్ఎఫ్ ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. దూరం నుంచి మంటలను చూసినవారు ప్లాంటులో పెద్ద ప్రమాదమే జరిగిందని భావించారు. అయితే ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ప్రాణాపాయం సంభవించలేదు. ప్రమాదంపై యాజమాన్యం స్పందించింది. బ్లాస్ట్ ఫర్నేస్-3లోని ఉత్తరం వైపునున్న ఓపెన్ పిట్‌లో స్లాగ్ స్ప్లాష్ వల్ల మంటలు ఎగిసి, రహదారి పక్కన పొదలు అంటుకున్నాయని యాజమాన్యం పేర్కొంది. ఘటనలో ఆస్తినష్టం, ప్రాణ నష్టం జరగలేదని వివరించింది.

ఒకే కేంద్రంలో ఆరు బూత్‌లా?!

▸ పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ఈసీ మార్గదర్శకాలేవీ?

▸ హైకోర్టుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

▸ నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌కు ధర్మాసనం ఆదేశాలు

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): విజయవాడ అసెంబ్లీ తూర్పు నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాల ఏర్పాటు విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అమలుచేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ విషయంలో పిటిషనర్ సమర్పించిన వినతిపత్రం పై ఈ నెల 22లోపు నిర్ణయం తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించింది. వివరాలను పిటిషనర్‌కు తెలియజేయాలని జిల్లా కలెక్టర్‌కు స్పష్టం చేసింది. విచారణను ఫిబ్రవరి 15కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడ అసెంబ్లీ తూర్పు నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు రెండు కిలోమీటర్ల కన్నా దూరంగా ఏర్పాటు చేయడం, ఒక పోలింగ్ కేంద్రంలో ఆరు బూత్‌లు ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపించారు. పిటిషనర్ సమర్పించిన వినతి పై ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

13 వేల నకిలీ ఓట్లు తొలగించాం

▸ బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు ఫిర్యాదుపై ఈసీ స్పందన

▸ 'విశాఖ ఉత్తరం' జాబితాలో మార్పులు

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): "మీ ఫిర్యాదుపై పరిశీలన చేయించాం. 13,378 ఓట్లు తొలగించాం" అని కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజుకు తెలిపింది. విశాఖపట్నం ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అధికార పార్టీ 61,431 దొంగ ఓట్లు చేర్పించిందంటూ డిసెంబరు 19న సీఈసీకి ఆయన లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. తిరుపతి లోక్‌సభ పరిధిలో 35 వేలకు పైగా ఇతర ప్రాంతాల ఓటర్లను తీసుకొచ్చి వైసీపీ అరాచకాలకు పాల్పడిందని, క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయని, రాష్ట్ర వ్యాప్తంగా అధికార పార్టీ ఇదే పద్ధతులు అవలంబిస్తోందని తెలిపారు. దీంతో విష్ణుకుమార్ రాజు లేఖతోపాటు ఆయా వివరాలను సీఈసీ విశాఖపట్నం జిల్లా ఎన్నికల అధికారికి పంపించింది. ఈ నేపథ్యంలో జాబితాను మరోసారి పరిశీలించి చనిపోయిన, బదిలీ అయిన వారిపేర్లతో ఉన్న 13 వేలకు పైగా ఓట్లను గుర్తించారు. వీటిని జాబితాల నుంచి తొలగించామని, సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని విష్ణుకుమార్ రాజుకు పంపించిన సమాచారంలో సీఈసీ పేర్కొంది.

'ఇండియా' చైర్మన్‌గా ఖర్గే

కూటమి ఏకగ్రీవ ఆమోదం.. కన్వీనర్‌గా నితీశ్ పేరు ప్రతిపాదన.. తిరస్కరించిన జేడీయూ అధినేత

▸ వర్చువల్‌గా భేటీ అయిన కూటమి

▸ లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై చర్చ

▸ ముందస్తు పనుల వల్ల భేటీకి హాజరుకాని మమత, అఖిలేశ్, ఉద్ధవ్



న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పట్నా, జనవరి 13: ప్రతిపక్ష కూటమి ఇండియా చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కన్వీనర్‌గా జేడీయూ అధినేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ పేరును కూటమి నేతలు ప్రతిపాదించారు. అయితే, ఆయన సున్నితంగా తిరస్కరించారు. శనివారం ఇండియా కూటమి పార్టీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యాయి. ఏప్రిల్-మే నెలలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధత గురించి చర్చలు జరిపాయి. ఈ సందర్భంగానే, కూటమికి నేతృత్వం వహించే నాయకుడి ఎంపికపై చర్చ జరిగింది. ఈ పదవికి కాంగ్రెస్ నుంచే ఎవరైనా ఉంటే బాగుంటుందని స్వయంగా నితీశ్‌కుమార్ పేర్కొన్నారు. మిగిలిన నేతలు కూడా దీనికి అంగీకరించారు. ఈ నేపథ్యంలో మల్లికార్జున ఖర్గే పేరు ముందుకు రాగా, హాజరైన నేతలందరూ ఆమోదం తెలిపారు. తద్వారా ఆయన ఇండియా కూటమి చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అయితే, కూటమి కన్వీనర్ పదవిని నితీశ్‌కుమార్ కోరుకుంటున్నారని కొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఇదే సమావేశంలో.. చైర్‌పర్సన్ తర్వాత స్థానమైన కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టవలసిందిగా కోరుతూ పలువురు నితీశ్ పేరును ప్రతిపాదించారు. దీనిని నితీశ్ సున్నితంగానే తిరస్కరించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, దీనిపై జేడీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఝా మాత్రం భిన్నంగా స్పందించారు. సదరు ప్రతిపాదనకు నితీశ్ ఇప్పటి వరకైతే ఆమోదం తెలుపలేదని, దీనిపై తమ పార్టీలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పటం విశేషం. శనివారం నాటి సమావేశానికి నితీశ్‌తోపాటు సంజయ్ కుమార్ ఝా కూడా హాజరయ్యారు. ఖర్గేకు చైర్‌పర్సన్ పదవిని అప్పగించటంపై నితీశ్ నిరాశ చెందారా అన్న విలేకర్ల ప్రశ్నకు.. అటువంటిదేమీ లేదని, ఆ పదవిని కాంగ్రెస్‌కు చెందిన వారే ఎవరైనా తీసుకోవాలని స్వయంగా నితీశే ప్రతిపాదించారన్నారు. కాగా, ఇండియా కూటమి వర్చువల్ భేటీకి.. ముందస్తు కార్యక్రమాల కారణంగా మమతాబెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), ఉద్ధవ్ ఠాక్రే (శివసేన) హాజరు కాలేదు. కన్వీనర్‌గా నితీశ్ నియామకంపై వారితోనూ చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. సమావేశంలో నితీశ్ కుమార్ (జేడీయూ), శరద్ పవార్ (ఎన్సీపీ), స్టాలిన్, కనిమొళి (డీఎంకే), హేమంత్ సోరెన్ (జేఎంఎం) తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం అందిస్తాం: పవార్

కూటమి సమావేశం అనంతరం ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌ను విలేకర్లు సంప్రదించగా, కన్వీనర్ పదవి కోసం నితీశ్ పేరును ప్రతిపాదించినప్పటికీ.. అసలు కన్వీనర్ పదవే అవసరం లేదని, దాని బదులు కొన్ని పార్టీల అధినేతలతో ఒక కమిటీని ఏర్పాటు చేయటం మంచిదని నితీశ్ అభిప్రాయపడ్డారని పవార్ చెప్పారు. 'ఓట్ల కోసం ఎవరో ఒక నేతను ముందు పెట్టాల్సిన అవసరం లేదు. ఎన్నికల తర్వాత ఒక నేతను మేం ఎన్నుకుంటాం. ప్రజలకు ప్రత్యామ్నాయం అందిస్తామన్న నమ్మకంతో ఉన్నాం. 1977లో కూడా నాటి ప్రతిపక్షాలు ఎన్నికల ముందే మొరార్జీ దేశాయ్ పేరును ప్రధాని అభ్యర్థిగా ఏమీ ప్రచారం చేయలేదు' అని గుర్తు చేశారు. కూటమి అనుసరించాల్సిన విధానాల గురించి చర్చ జరిగిందని, సీట్ల పంపకాలపై మాట్లాడుకోలేదని వెల్లడించారు. దేశవ్యాప్తంగా సంయుక్తంగా బహిరంగ సభలు నిర్వహించాలని, ఆ మేరకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

తన పరిమితుల్ని కాంగ్రెస్ తెలుసుకోవాలి: తృణమూల్

ఇండియా కూటమి వర్చువల్ సమావేశానికి తమ అధినాయకురాలు మమతా బెనర్జీ పలు ముందస్తు కార్యక్రమాల కారణంగా హాజరు కాలేదని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఒకరు తెలిపారు. బెంగాల్‌లో రాజకీయ పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఉన్న పరిమితుల్ని, బలహీనతల్ని ఆ పార్టీ అధిష్ఠానం గుర్తించాలన్నారు. బెంగాల్‌లో బీజేపీని ఓడించే పోరాటానికి తాము నేతృత్వం వహిస్తామని, కాంగ్రెస్ ఇందుకు అంగీకరించాలన్నారు. కాగా, బెంగాల్‌లో సీట్ల పంపకాలపై ఢిల్లీకి చర్చలకు రావాల్సిందిగా ఇటీవల కాంగ్రెస్ పంపిన ఆహ్వానాన్ని తృణమూల్ తిరస్కరించింది. కాగా, ఇండియా కూటమి వర్చువల్ మీటింగ్‌ను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎద్దేవా చేస్తూ.. 'అదొక వర్చువల్ కూటమి. కాబట్టి వర్చువల్ సమావేశాలే జరుపుతుంది' అని పేర్కొన్నారు.

చైర్‌పర్సన్ పదవి వద్దన్న రాహుల్

న్యూఢిల్లీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి భేటీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కూటమి చైర్‌పర్సన్‌గా నియమించాలని జేఎంఎం నేత, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ ప్రతిపాదించారు. తాను భారత్‌జోడో న్యాయ యాత్ర చేపడుతున్నందున ఆ బాధ్యత తీసుకోలేనని రాహుల్ సున్నితంగా తిరస్కరించారు. ఖర్గే పేరును సీపీఎం నేత సీతారాం ఏచూరి ప్రతిపాదించగా మిగతా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా సీట్ల పంపిణీ విషయంపై తమ మధ్య చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని సమావేశం తర్వాత ఖర్గే తెలిపారు. రాహుల్ యాత్రలో వీలును బట్టి పాల్గొనాల్సిందిగా ఖర్గే చేసిన అభ్యర్థనకు మిత్రపక్షాలు సానుకూలంగా స్పందించాయి.



ధరలు, నిరుద్యోగమే ప్రధాన ఎజెండా

▸ నేడు ప్రారంభం కానున్న రాహుల్ న్యాయ్‌యాత్ర

ఇంఫాల్, జనవరి 13: పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, సామాజిక న్యాయం ప్రధాన అంశాలుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్‌యాత్ర మణిపూర్ రాష్ట్రం నుంచి ఆదివారం ప్రారంభం కానుంది. 15 రాష్ట్రాల్లోని 100 లోక్‌సభ నియోజకవర్గాల మీదుగా సాగే ఈ న్యాయ్‌యాత్ర భారత్ జోడో యాత్ర లాగే పార్టీకి పేరు తెస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యల మీద పార్లమెంటులో మాట్లాడనివ్వనందున.. ప్రజలకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం దక్కాలని కోరుతూ న్యాయ్‌యాత్ర చేపడుతున్నట్లు కాంగ్రెస్ పేర్కొంది. ఈ నెల 22న అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బీజేపీ ప్రధానంగా చేపడుతున్నందున.. కాంగ్రెస్ నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలను ఈ యాత్ర ద్వారా వెలుగులోకి తేవాలని భావిస్తోంది. అసలైన సమస్యలపై ప్రజల దృష్టి పడకుండా భావోద్వేగ అంశాలను రాజకీయాలకు వాడుకుంటూ దేశ ప్రజలను మోసం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆయన 'ఎక్స్'లో ఒక పోస్టు చేస్తూ... మన కలల భారతం ఇదేనా...? జీవన ప్రమాణాలు ముఖ్యమా... భావోద్వేగ అంశాలా...? ఆందోళనల్లో నినాదాలివ్వడమా... ఉద్యోగాలా? ప్రేమ... ద్వేషమా? ఏది ముఖ్యం అనేదానిపై యువత ఆలోచించాలన్నారు.

లోకం తీరు



ఉగ్రవాద నిర్మూలనకు 'ఆపరేషన్ సర్వశక్తి'

కశ్మీర్‌లోని పీర్ పంజాల్ కొండల్లో అమలు.. పాక్ కుయుక్తులకు చెక్

న్యూఢిల్లీ, జనవరి 13: జమ్మూ-కశ్మీర్‌లో పాకిస్థాన్ ప్రోద్బలంతో జరుగుతున్న ఉగ్రవాద చర్యలను అణచివేసేందుకు భారతసైన్యం సన్నద్ధమైంది. ఇందుకు 'ఆపరేషన్ సర్వశక్తి' వ్యూహాన్ని అమలు చేయనుంది. ఇటీవలికాలంలో రాజౌరీ-పూంఛ్ సెక్టారులోని పీర్ పంజాల్ పర్వతశ్రేణి దక్షిణ భాగంలో ఉగ్రవాద కార్యకలాపాలు అధికమయ్యాయి. ఉగ్రవాదుల దాడుల్లో ఇప్పటికే 20 మంది భద్రత సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. గత నెల 21న డేరా కీ గలీ ప్రాంతంలో ఉగ్రవాదుల కాల్పుల్లో నలుగురు జవాన్లు మరణించారు. దాంతో పీర్ పంజాల్ కొండల్లో ఉగ్రవాదుల ఏరివేతకు భద్రత బలగాలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందుకోసమే ఆపరేషన్ సర్వశక్తికి రూపకల్పన చేశారు. శ్రీనగర్‌లోని చినార్ కార్ప్స్, నగ్రోటాలోని వైట్ నైట్ కార్ప్స్, జమ్మూ-కశ్మీర్ పోలీసు, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ ఆపరేషన్ గ్రూపు, నిఘావర్గాలు అన్నీ మరింత సమన్వయంతో పనిచేయనున్నాయి. గతేడాది పీర్ పంజాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో 'ఆపరేషన్ సర్ప్ వినాశ్' చేపట్టి విజయం సాధించారు. ఇటీవల ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్‌పాండే మాట్లాడుతూ పీర్ పంజాల్ ప్రాం తంలో గతేడాదికే పూర్తిగా ఉగ్రవాద నిర్మూలన జరిగిందని, కానీ 'పశ్చిమ దిశ శత్రువు' దాన్ని మళ్లీ రాజేస్తోందని చెప్పారు. దీన్ని ఎదుర్కోవడానికి ఆ యన నార్తర్న్ కమాండ్ అధికారులతో క్షుణ్ణంగా చర్చలు జరిపారు. ఆర్మీ ప్రధాన కార్యాలయం, ఉదంపూర్‌లోని నార్తర్న్ కమాండ్ కార్యాలయం సునిశిత పర్యవేక్షణలో ఈ ఆపరేషన్‌ను అమలు చేయనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జరిపిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం అనంతరం ఈ ఆపరేషన్‌కు రూపకల్పన చేశారు.



విదేశాల్లో 'అయోధ్య' ప్రత్యక్ష ప్రసారాలు

▸ అమెరికాలోని 10 రాష్ట్రాల్లో భారీ బిల్‌బోర్డుల ఏర్పాటు

▸ ఆఫ్రికాలోని మారిషస్‌లో 10 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు

▸ పూజల్లో పాల్గొనేందుకు ఉద్యోగులకు రెండు గంటల అనుమతి

▸ వీధుల్లో ర్యాలీలు, కూడళ్లలో ఎల్‌సీడీ స్క్రీన్ల ఏర్పాటు

వాషింగ్టన్, పోర్ట్ లూయిస్, జనవరి 13: అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ జరపనున్న నేపథ్యంలో అమెరికాలోని పదికిపైగా రాష్ట్రాలలో రామమందిరానికి సంబంధించిన భారీ బిల్‌బోర్డులను 40కిపైగా ఏర్పాటు చేస్తున్నట్టు వీహెచ్‌పీ-అమెరికా ప్రధానకార్యదర్శి అమితాబ్ వీడబ్ల్యూ మిత్తల్ తెలిపారు. ఇప్పటికే టెక్సాస్, ఇల్లినాయిస్, న్యూయార్క్, న్యూజెర్సీ, జార్జియా రాష్ట్రాలలో ఈ బోర్డులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అరిజోనా, మిస్సోరీ రాష్ట్రాలలో ఈనెల 15వ తేదీన రామమందిర బిల్‌బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే అమెరికాలోని హిందువులు భారీ కారు ర్యాలీలు నిర్వహించారు. అలాగే, ఆఫ్రికా ఖండంలోని మారిషస్ దేశంలో హిందువులైన ఉద్యోగులు ఈనెల 22న పూజల్లో పాల్గొనేందుకు రెండు గంటలు అనుమతి ఇచ్చే ప్రతిపాదనకు ఆ దేశ కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది. 2011 జనాభా లెక్కల ప్రకారం మారిషస్ జనాభాలో హిందువులు దాదాపు 48.5 శాతం ఉన్నారు. కాగా, ఆ దేశ జనాభాలో 68 శాతం వరకు భారత సంతతికి చెందినవారే. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో వచ్చే 10 రోజులు మారిషస్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మారిషస్ సనాతన ధర్మ టెంపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఘూర్బిన్ భోజ్‌రాజ్ తెలిపారు. వీధుల్లో ర్యాలీలు, చారిత్రక, ముఖ్యమైన భవనాలను విద్యుద్దీపాలతో అలంకరించడంతోపాటు ముఖ్యమైన కూడళ్లలో ఎల్‌సీడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి మందిర ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు చెప్పారు. ఈనెల 22న అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ రామాలయ ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు మారిషస్ సీనియర్ మంత్రి అంజీవ్ రామ్‌ధన్య చెప్పారు. మారిషస్ వ్యాప్తంగా ప్రమిదలు కూడా వెలిగించనున్నట్టు తెలిపారు. తాను కూడా అయోధ్యను సందర్శిస్తానని మంత్రి అంజీవ్ రామ్‌ధన్య చెప్పారు.

పండుగ ముందు వైసీపీపై పిడుగు!



▸ మచిలీపట్నం ఎంపీ బాలశౌరి గుడ్‌బై

▸ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఇచ్చిన విందుకు హాజరైన బాలశౌరి

▸ దీనిపై సీఎం జగన్ సీరియస్.. నిలదీత

▸ మచిలీపట్నం టికెట్ ఇవ్వకుండా సెగ

▸ క్షేత్రస్థాయిలో పేర్నితోనూ పొసగని వైనం

▸ తుదకు పార్టీకి రాజీనామా చేసిన కాపు నేత

అమరావతి/విజయవాడ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముందు అధికార పార్టీ వైసీపీపై పిడుగు పడింది. వైసీపీ అధినేత, సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన, కాపు సామాజిక వర్గానికి చెందిన మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పార్టీకి గుడ్‌బై చెప్పారు. వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించారు. "వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నా. పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేనపార్టీలో చేరాలని నిర్ణయించుకున్నా" అని ట్విట్టర్(ఎక్స్) వేదికగా బాలశౌరి పేర్కొన్నారు. దీంతో ఆయన అధికార పార్టీని వీడినట్టయింది. వచ్చే ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంటు టికెట్ ఇచ్చేందుకు పార్టీ విముఖత వ్యక్తం చేయడంతోపాటు, ఢిల్లీలో జరిగిన 'విందు' వ్యవహారంపై సీఎం జగన్ సీరియస్ కావడం, మాజీ మంత్రి పేర్ని నానితో ఉన్న విభేదాలే బాల శౌరి నిష్క్రమణకు కారణంగా కనిపిస్తున్నాయి. అయితే, బాల శౌరి వర్గంలో మరో ప్రచారం కూడా ఉంది. సౌమ్యుడు, వివాదరహితుడు అయిన బాలశౌరికి పార్టీ అధినేత, సీఎం జగన్ నుంచి ఇటీవల కాలంలో తీవ్ర అవమానాలు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. స్థానికంగా ఎంపీకి ఎవరూ సహకరించలేదని అంటున్నారు.

రేవంత్ విందు.. నేరమా?

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల తన లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా సమర్పించిన నేపథ్యంలో కొందరు పార్లమెంటు సభ్యులకు ఆయన విందు ఇచ్చారు. ఈ విందుకు వైసీపీ ఎంపీ హోదాలో బాలశౌరి హాజరయ్యారు. ఇది సీఎం జగన్‌కు ఆగ్రహం తెప్పించింది. మచిలీపట్నం వైసీపీ నేతల ముందే బాలశౌరిపై జగన్ అసహనం వ్యక్తం చేశారని తెలిసింది. రేవంత్ ఇచ్చిన విందుకు వెళ్లడాన్ని ఆయన పార్టీ లైన్ దాటి వ్యవహరించినట్టుగా భావించారు. దీంతో, బాలశౌరి హోదాను కూడా చూడకుండా బాలశౌరిని తూలనాడారని తెలిసింది. సీఎం జగన్ వైఖరితో బాలశౌరి ఆత్మాభిమానం దెబ్బతింది. దీంతో.. తిడితే సహించేదిలేదంటూ పార్టీకి దూరమయ్యారు. కాగా, బాలశౌరి త్వరలో జనసేనలో చేరనున్నట్లు పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసి, పార్టీలో చేరాలన్న తన అభిప్రాయాన్ని పవన్‌కు చెప్పగా, ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో శనివారం బాలశౌరి తన నిర్ణయాన్ని ప్రకటించారు. మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచే ఆయన జనసేన తరఫున బరిలో ఉంటారని సమాచారం.

బందరులో ఎవరు?

రేవంత్ విందులో పాల్గొన్న కారణంగా బాలశౌరిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం జగన్.. బందరు ఎంపీ అభ్యర్థి కోసం అన్వేషణ ప్రారంభించారు. సామాజికంగా బలమైన యాదవ కులానికి చెందిన.. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని బందరు లోక్‌సభ స్థానానికి పంపాలని జగన్ నిర్ణయించారు. ఇలా చేయడం ద్వారా.. ఒకవైపు సామాజిక న్యాయం చేసినట్టుగానూ.. మరోవైపు సంపన్ననేతకు టికెట్ ఇవ్వడం ద్వారా అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులకు ఆర్థిక సహకారాన్ని అందించే వీలుందని జగన్ భావించారు. కానీ.. ఇక్కడే జగన్ వ్యూహం తారుమారైంది. గడచిన నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యేగా పార్థసారథికి జగన్ తగిన గౌరవాన్ని ఇవ్వలేదు. నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేలా ఆర్థిక ప్రోత్సాహం కూడా ఇవ్వలేదు. ఇదే విషయాన్ని పార్థసారథి బహిరంగంగా వెల్లడించారు. సీఎం జగన్‌పై విమర్శలు గుప్పించారు. జగన్మోహన్‌రెడ్డి బీసీలను గుర్తించడం లేదని, గౌరవం ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. పెనమలూరు అసెంబ్లీ నుంచి కాకుండా బందరు ఎంపీగా పోటీ చేయాలని జగన్ చేసిన ప్రతిపాదనను పార్థసారథి తిరస్కరించారు. తాజాగా ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరే దిశగా అడుగులు వేస్తున్నారు. సామాజిక న్యాయం చేస్తున్నానంటూ గొప్పగా చెబుతూ వచ్చిన జగన్‌కు పార్థసారథి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా నష్టాన్ని చేకూర్చాయి. ఇప్పటికే.. మత్స్యకార సామాజికవర్గానికి చెందిన మోపిదేవి వెంకట రమణారావుకు అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వకపోవడం, యాదవ సామాజికవర్గానికి చెందిన కొలుసు పార్థసారథికి గుర్తింపును ఇవ్వకపోవడాన్ని ఆయా సామాజిక వర్గాల నేతలు తమకు జరిగిన అవమానంగానే భావిస్తున్నారు.

రెండు జిల్లాలపై ప్రభావం

సీఎం జగన్ నిర్ణయాలతో గుంటూరు, కృష్ణా జిల్లాల్లో వైసీపీపై తీవ్ర ప్రభావం పడుతోంది. అధికార పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతోంది. ఇలాంటి సమయంలో.. బలమైన కాపు సామాజికవర్గానికి చెందిన బందరు సిట్టింగ్ ఎంపీ వల్లభనేని బాలశౌరిని కించపరచేలా జగన్ వ్యవహరించారన్న ప్రచారం ఈ వర్గాన్నీ ఆగ్రహానికి గురి చేస్తోంది. ఆత్మాభిమానానికే పెద్దపీట వేస్తూ.. వైసీపీకి బాలశౌరి రాజీనామా చేయడంతో కాపు సామాజికవర్గంలోనూ పాలకపక్షం పట్ల వ్యతిరేకత పెరిగింది. ఈ పరిణామాలన్నీ.. సామాజిక సమీకరణలకు పెద్దపీట వేస్తున్నానని చెబుతున్న జగన్‌కు ఎన్నికల్లో సెగపెట్టడం ఖాయమని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

నమ్మకం కోల్పోతున్న బీసీలు

సార్వత్రిక ఎన్నికలకు ముందు బలమైన నేతలు వైసీపీని వీడుతూ.. సీఎం జగన్ బలహీన వర్గాల నేతలపట్ల అనుసరించే వైఖరిని బట్టబయలు చేస్తున్నారు. కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ వైసీపీని వీడుతూ.. బీసీ నేతలకు జగన్ గౌరవమే ఇవ్వరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు బలశౌరి కూడా ఇదే కారణంతో వైసీపీ నుంచి బయటకు వచ్చేశారు. ఈ నేపథ్యంలో జగన్ చెబుతున్న సామాజిక సమతుల్యాన్ని జనం నమ్మేలా లేరని రాజకీయవర్గాలు చెబుతున్నాయి.

బాలశౌరి వర్సెస్ పేర్ని

మచిలీపట్నం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని నాని తొలి నుంచీ బాలశౌరితో కయ్యానికి కాలు దువ్వుతున్నారు. మచిలీపట్నంలో ఎంపీ చేపట్టే అభివృద్ధి పనులను నాని మోకాలడ్డుతుండటంతో ఈ విషయాన్ని ఎంపీ పలుమార్లు వైసీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. వారి నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో బాలశౌరి మనస్థాపానికి గురయ్యారు. వైసీపీ పెద్దలు పేర్ని నానికి కొమ్ము కాసేలా వ్యవహరిస్తుండటాన్ని ఎంపీ వర్గం జీర్ణించుకోలేకపోయింది. వాస్తవానికి ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే పేర్ని నాని ఇద్దరూ కాపు సామాజికవర్గానికి చెందినవారే. ఇదే వారి నడుమ ఆధిపత్య పోరుకు కారణమైంది. పేర్ని నాని మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలోని కాపు సామాజికవర్గానికి తానే పెద్దన్న రీతిలో ప్రచారం చేసుకున్నారు. అదే సమయంలో ఎంపీ బాలశౌరిని అసలు పట్టించుకునే వారు కాదు. కనీసం ప్రొటోకాల్ ప్రకారం ఇవ్వాల్సిన గౌరవం కూడా ఇవ్వలేదు. పైగా బాలశౌరి ఏదైనా అభివృద్ధి పనికి శ్రీకారం చుడితే దాన్ని అడ్డుకునేందుకు పేర్ని నాని విశ్వ ప్రయత్నాలు చేసేవారు. 2022, జూన్‌లో మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్‌గా ఉన్న పేర్ని నాని అనుచరుడు అస్గర్ అలీ.. బాలశౌరిని పార్టీ శ్రేణుల ముందే బహిరంగంగా దూషించారు. దీని వెనుక పేర్ని నాని ఉన్నారని ఎంపీ వైసీపీ పెద్దలకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. క్రమేణా ఇద్దరి మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. మరోవైపు బాలశౌరిని మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి కాక వేరే స్థానం నుంచి పోటీ చేయాలని వైసీపీ పెద్దలు సూచించినట్లు సమాచారం. ఈ పరిణామాలతో బాలశౌరి విసిగిపోయి వైసీపీకి గుడ్‌బై చెప్పారు.



భృంగి వాహనంపై శ్రీశైల మల్లన్న

- బ్రహ్మోత్సవాలతో పరవశించిన శ్రీగిరి

శ్రీశైలం, జనవరి 13: శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లు భృంగివాహనంపై దర్శనమిచ్చారు.

సీఐడీ కార్యాలయాలకు చంద్రబాబు

- ఇసుక, మద్యం, ఐఆర్ఆర్ కేసుల్లో సొంత పూచీకత్తులు సమర్పణ
- కేంద్ర కార్యాలయంలో ఇస్తామన్న టీడీపీ కుదరదంటూ 3 చోట్లకు తిప్పిన అధికారులు
- టీడీపీ అధినేతపై వైఖరి మార్చుకోని వైనం





కుంచనపల్లిలో కార్యకర్తల కోలాహలం మధ్య చంద్రబాబు కాన్వాయ్, అభివాదం చేస్తున్న చంద్రబాబు

విజయవాడ, జనవరి 13(ఆంధ్రజ్యోతి), తాడేపల్లి/ గుంటూరు: టీడీపీ అధినేత చంద్రబాబుపై ఏపీ సీఐడీ అధికారులు మరోసారి తమ వైఖరి ప్రదర్శించారు. ఇసుక, మద్యం, అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్(ఐఆర్ఆర్) కేసులకు సంబంధించి హైకోర్టు ఆదేశాలతో పూచీకత్తులు సమర్పించేందుకు వచ్చిన చంద్రబాబును మూడు ప్రాంతాల్లో తిప్పారు. వాస్తవానికి సీఐడీ కేంద్ర కార్యాలయంలో అన్ని పూచీకత్తులు సమర్పిస్తామని టీడీపీ చెప్పింది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా.. కానూరు, కుంచనపల్లి, గుంటూరుల్లోని మూడు కార్యాలయాల్లోనే సమర్పించాలని భీష్మించారు. దీంతో చంద్రబాబు శనివారం ఆయా కార్యాలయాలకు వెళ్లి పూచీ కత్తులు సమర్పించారు. టీడీపీ హయాంలో ఇసుక, మద్యం, ఐఆర్ఆర్ వ్యవహారంలో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ ఏపీ సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసులో చంద్రబాబు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో గన్నవరానికి వచ్చి.. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కానూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు. రూ.1.50 లక్షల వ్యక్తిగత పూచీకత్తును సీఐడీ అధికారులకు అందజేశారు. చంద్రబాబు తరఫున మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌లు సాక్షి సంతకాలు చేశారు.

కుంచనపల్లిలో..

టీడీపీ అధినేత చంద్రబాబు తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో ఉన్న సీఐడీ(సిట్) అధికారులకు పూచీకత్తు సమర్పించారు. కుంచనపల్లి వద్ద టీడీపీ నియోజకవర్గ, స్థానిక నేతలు భారీగా హాజరై చంద్రబాబుకు స్వాగతం పలికారు. కాగా సిట్ ఆఫీస్ సమీపంలో పోలీసులు బారికేడ్లు అడ్డు పెట్టి మీడియాను రానివ్వకుండా అడ్డుకున్నారు.

గుంటూరులో..

మద్యం కేసుకు సంబంధించి చంద్రబాబు శనివారం సాయంత్రం గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు రూ.2 లక్షల చొప్పున పూచీకత్తులు సమర్పించారు. మద్యం కేసులో ఏ1 గా ఉన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాస్ శ్రీనరేష్ శనివారం ఉదయమే పూచీకత్తులు సమర్పించి వెళ్లారు. ఈ కేసులో ఏ2గా ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కూడా మధ్యాహ్నమే ష్యూరిటీలు సమర్పించారు. కేసు కోర్టు విచారణలో ఉన్న నేపథ్యంలో చంద్రబాబు ఆయా కేసులకు సంబంధించి మాట్లాడటానికి ఇష్టపడలేదు. గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో చంద్రబాబుకు జిల్లా కోర్టు సమీపంలో ఘన స్వాగతం పలికారు. కాగా, చంద్రబాబు సీఐడీ కార్యాలయానికి వెళ్లే సమయంలో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. చంద్రబాబు కాన్వాయ్‌తో వెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య తోపులాట, స్వల్ప వాగ్వాదం చోటుచేసుకున్నాయి.

నిరంకుశ వైఖరి: నరేంద్ర

కానూరులోని సీఐడీ కార్యాలయం ముందు టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు విషయంలో సీఐడీ అధికారులు నిరంకుశంగా వ్యవహరించారని ఆరోపించారు. కానూరు, కుంచనపల్లి, గుంటూరు ఇలా మూడు చోట్ల వద్దని మంగళగిరిలో ఉన్న సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఈ పూచీకత్తులను తీసుకోవాలని అధికారులకు సూచించామని తెలిపారు. అయినప్పటికీ అధికారులు మూడు చోట్లా వ్యక్తిగత పూచీకత్తులు ఇవ్వాల్సిందేనంటూ చంద్రబాబును తిప్పారని ఆరోపించారు.

అంతర్వేదిలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ పూజలు



జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

అంతర్వేది, జనవరి 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా శనివారం విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

శ్రీవారి సేవలో జస్టిస్ శేషసాయి



ఆలయం ముందు జస్టిస్ శేషసాయి

తిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దినేష్ కుమార్, జస్టిస్ వెంకటేష్ నాయక్ కూడా శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు.

మల్లన్న సన్నిధిలో జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు



స్వామివారి భృంగివాహనసేవలో పాల్గొన్న జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు

శ్రీశైలం, జనవరి 13: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు దంపతులు శనివారం రాత్రి దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవిని దర్శించుకున్నారు. అనంతరం మల్లికార్జున స్వామి, అమ్మవార్ల భృంగివాహన సేవలో పాల్గొన్నారు.

చెల్లింపులు సగమే! పండుగ వేళా రైతుకు అందని డబ్బు

- లక్ష్యం 37 లక్షలు.. కొన్నది 25 లక్షల టన్నులే!
- ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లతో.. మిల్లర్ల ఇష్టారాజ్యం
- కామన్ రకం బస్తాకు చెల్లించేది రూ.1300లే
- రవాణా, హమాలీల ఖర్చుల భారమూ రైతులపైనే!

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

సంక్రాంతి అంటేనే రైతు పండుగ. పంటలు ఇంటికి వచ్చి.. అవి అమ్మిన డబ్బులతో రైతులు ఆనందంగా జరుపుకొనే పండుగ. ఈ పండుగ వేళ కూడా ప్రభుత్వానికి ధాన్యం అమ్మిన రైతులు చేతిలో డబ్బులు లేక విలవిల్లాడుతున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు డబ్బులు జమ చేయలేదు. ఆర్బీకేల ద్వారా 4,12,838 మంది రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం.. ఇప్పటివరకు సగం మంది రైతులకు మాత్రమే రూ.2,384 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో రైతులు అప్పులు చేసి పండుగ జరుపుకోవాల్సిన దుస్థితిలో పడిపోయారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ పౌర సరఫరాల సంస్థ లక్ష్యాన్ని కూడా చేరుకోలేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షలకుపైగా హెక్టార్లలో రైతులు వరి సాగు చేయగా.. మొత్తం 85 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పగా.. పీడీఎస్ అవసరాల కోసం 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లక్ష్యంగా నిర్ణయించింది. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు దాదాపు ముగిసిపోగా.. ఇప్పటివరకు ఆర్బీకేల ద్వారా 4,12,838 మంది రైతుల నుంచి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. అంటే ప్రభుత్వం లక్ష్యాన్ని కూడా చేరుకోలేకపోయింది. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఇప్పటికే పీకల్లోతు అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయలేక చేతులెత్తేసింది. దీంతో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మళ్లీ యథావిధిగా రైసు మిల్లర్ల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. పీడీఎస్ అవసరాల కోసం రైతుల నుంచి ధాన్యాన్ని తప్పనిసరిగా ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే సేకరించాలని, ఇలా సేకరించిన ధాన్యాన్ని ర్యాండమ్ పద్ధతిలో రవాణా కాంట్రాక్టర్ల ద్వారా జీపీఎస్‌లు అమర్చిన వాహనాల్లో మాత్రమే రైసుమిల్లులకు తరలించాలని కేంద్ర సర్కారు నిబంధనలను విధించింది. అయితే వరి కోతలు ప్రారంభమయ్యే సమయంలోనే తుఫాను రావడం, ధాన్యం తడిసిపోతుండటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అనుమతి ఇచ్చింది. ఇదే సదావకాశంగా అధికార పార్టీ నాయకులు, వారి కనుసన్నల్లో నడుస్తున్న రైసు మిల్లర్ల యజమానులు, దళారులు మోసాలకు పాల్పడుతూ దోపిడీకి తెరతీశారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం 75 కేజీల ధాన్యం బస్తాకు రూ.1530 చెల్లించాల్సి ఉండగా.. దళారులు రూ.1200 నుంచి రూ.1300 వరకు మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఆర్బీకేల్లో గోనె సంచులు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొనడంతో ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవడానికి రైతులు అనేక పాట్లు పడాల్సి వస్తోంది. ధాన్యం రవాణా, ఎగుమతి, దిగుమతులకు హమాలీ (జీఎల్‌టీ) చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందని చెబుతున్నా.. ఎక్కడా వాటిని చెల్లించడం లేదు. దీంతో దళారులు జీఎల్‌టీ చార్జీల కింద బస్తాకు రూ.200 వరకు తగ్గించుకుని డబ్బులు చెల్లిస్తున్నారు. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఇచ్చిందే తీసుకుని ఉసూరుమంటున్నారు.

రైసుమిల్లుల లారీల్లోనే ధాన్యం రవాణా

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి టెండరు ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రవాణా కాంట్రాక్టర్లను నియమిస్తుంది. ఈ టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఆయా జిల్లాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది కేటాయించిన మిల్లులకు తరలించాలి. కానీ ఈ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోకుండా రైసు మిల్లర్లు ముప్పుతిప్పలు పెడుతూ నష్టాలకు గురి చేస్తుండటంతో రవాణా కాంట్రాక్టర్లు పారిపోతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు ఒక్క జిల్లాలో కూడా లేకుండా పోయారంటే.. వారిపై మిల్లర్ల ప్రభావం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో చేసేదేమీ లేక సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధికారులు అదర్స్ పేరుతో రైసు మిల్లర్లకే ధాన్యం రవాణా బాధ్యతలు అప్పగించారు. దీంతో మిల్లర్లందరూ సిండికేట్‌గా ఏర్పడి.. మద్దతు ధరను భారీగా తగ్గించేయడంతోపాటు ధాన్యం రవాణా ఖర్చులను కూడా రైతుల నుంచే వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

భార్యను హత్యచేసి భర్త ఆత్మహత్య

- మృతురాలు బీఎస్ఎఫ్ ఉద్యోగి

పుల్లలచెరువు, జనవరి 13: జీవితాంతం తోడుంటానన్న భర్తే కాలయముడయ్యాడు. మానసిక బలహీనతో, కుటుంబ కలహాలో తెలియదు కానీ భార్యను చంపి, అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం ఉదయం ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం నాయుడుపాలెంలో చోటుచేసుకొంది. బంధువుల కథనం ప్రకారం.. రాచర్ల మండలం, అగ్రహారానికి చెందిన జ్యోతికి పుల్లలచెరువు మండలం నాయుడుపాలేనికి చెందిన నారు వెంకటేశ్వరరెడ్డికి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది క్రితం జ్యోతి కేంద్ర సాయుధ దళం (బీఎస్ఎఫ్)లో ఉద్యోగం సంపాదించింది. ప్రస్తుతం ఆమె కోల్‌కతాలో ఉద్యోగం చేస్తోంది. ఇటీవల భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి తరచూ గొడవలు జరుగుతున్నాయి. బంధువులు ఇరువురికి సర్దిచెప్పి శుక్రవారం నాయుడుపాలెంలోని అత్తగారింటికి తీసుకొచ్చారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో వారు మళ్లీ ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో జ్యోతి(25) తలపై వెంకటేశ్వరరెడ్డి రోకలిబండతో కొట్టడంతో బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం వెంకటేశ్వరరెడ్డి(28) కూడా ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పనికి వెళ్లి ఇంటికొచ్చిన వెంకటేశ్వరరెడ్డి తండ్రి ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా, అప్పటికే ఇద్దరు మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీహరి ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో దూకిన తోడికోడళ్లు

- ఒకరి మృతదేహం లభ్యం, మరొకరి కోసం గాలింపు
- అత్తింటి వేధింపులే కారణమని ఆరోపణ



రూపాదేవి, స్వాతి

పెదవేగి, జనవరి 13: ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు తోటికోడళ్లు కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు యత్నించగా, ఒకరి మృతదేహం లభ్యమైంది. మరొకరి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం పినకడివికి చెందిన రూపాదేవి (36), స్వాతి (33) తోటికోడళ్లు. అదే గ్రామానికి చెందిన సమీప బంధువులైన పాలపాటి కామరాజు, తిరుపతమ్మ కుమారులైన శ్రీనివాస్, సాయిశివను పెళ్లి చేసుకున్నారు. శ్రీనివాస్, రూపాదేవికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశారు. సాయిశివ, స్వాతికి చదువుకుంటున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా వివాహం జరిగిననాటి నుంచి కట్నం కోసం నిత్యం వేధిస్తుండేవారని గ్రామస్థులు చెబుతున్నారు. శుక్రవారం వేధింపులు ఎక్కువ కావడంతో విసిగివేసారిన తోటికోడళ్లు ఇంటి నుంచి వెళ్లిపోయారు. విజయవాడ వెళ్లి శనివారం మధ్యాహ్నం ఇద్దరూ కృష్ణానదిలో దూకారు. కాగా.. స్వాతి మృతదేహం లభ్యమైందని, రూపాదేవి మృతదేహం కోసం గాలిస్తున్నారని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఈ ఘటనపై ఆగ్రహించిన మహిళల బంధువులు, అత్తింటిపై దాడికి దిగారు. రాళ్లు రువ్వి, ఇంటిని కొంతమేర ధ్వంసం చేశారు. శ్రీనివాస్, సాయిశివ పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.





విజయవాడ రైల్వే స్టేషన్, బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



పంతంగి టోల్‌గేటు వద్ద రాష్ట్రంలోకి వస్తున్న వాహనాలు

పల్లెకు పోదాం..

- ఎన్‌హెచ్-65పైకి పోటెత్తిన కార్లు..
- టోల్ ప్లాజాల వద్ద వాహనాలు కిటకిట
- బస్సులు, రైళ్లు ఫుల్.. విమానాలన్నీ హౌస్‌ఫుల్

విజయవాడ, ఏలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మొత్తం ఖాళీ అయిందా... కార్ల దండు కదిలిందా.. అన్నట్టు సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వచ్చే వారితో విజయవాడ మార్గం వాహన సంద్రమైంది. పండుగకు ప్రయాణాలు పోటెత్తడంతో 65వ నంబర్ జాతీయ రహదారి కిక్కిరిసింది. టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు కిటకిటలాడాయి. బస్సులు, రైళ్లలో వారం రోజుల ముందుగానే సోల్డ్ అవుట్ బోర్డులు పెట్టడంతో చాలామందికి కార్లే దిక్కయ్యాయి. దీంతో భోగి ముందు రోజైన శనివారం విజయవాడకు కార్లలో బయల్దేరారు. శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు జాతీయ రహదారిపై కార్లు విరామం లేకుండా కదిలాయి. హైదరాబాద్ నుంచి శనివారం సాయంత్రం 5 గంటల వరకే 65 వేల కార్లు వచ్చినట్టు ఎన్‌టీఆర్ జిల్లా కీసర టోల్‌ప్లాజా గణాంకాలు చెబుతున్నాయి. అర్ధరాత్రికి ఈ సంఖ్య భారీగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. పండుగకు ముందు మూడు రోజుల్లో సగటున రోజుకు 2 లక్షల మంది చొప్పున విజయవాడకు వస్తారని అంచనా వేయగా.. దానికి మించి రెండు రోజులుగా రోజుకు 3 లక్షల మందికిపైనే వస్తున్నారు. శనివారం రికార్డు స్థాయిలో 6 లక్షల మంది విజయవాడ బయల్దేరినట్టు.. రైల్వే, ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు. రైల్వే, ఆర్టీసీ, విమానాల ద్వారా చేరుకోలేని వారంతా కార్లను ఆశ్రయించడంతో ఎన్‌హెచ్-65పై రద్దీ నెలకొంది. ఈ ప్రభావంతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. శనివారం సాయంత్రానికి ఆర్టీసీ అధికారులు రికార్డు స్థాయిలో 200 స్పెషల్ బస్సులు నడిపారు. రైల్వే అధికారులు కూడా విజయవాడ-హైదరాబాద్ మార్గంలో సంక్రాంతికి 15 స్పెషల్ రైళ్లు నడిపినా సరిపోలేదని, శనివారం మరో ఐదు స్పెషల్ రైళ్లు వేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు శనివారం ఎనిమిది విమానాలు రాకపోకలు సాగించాయి. కాగా, కరోనా తర్వాత తొలిసారిగా ఏలూరు జిల్లాలో పండుగ శోభ కనిపించింది. ఏలూరు నగర రహదారులన్నీ పక్క రాష్ట్రాల వాహనాలు, షాపింగ్ ప్రియులతో నిండిపోయాయి. బైపాస్ మీదుగా ప్రతి పది సెకన్లకు సుమారు 50 వాహనాలు పరుగులు పెట్టాయి. ఇక రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు ఆశించిన స్థాయిలో అదనపు బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

పందేలకు సై!




ఈడుపుగల్లులో కోడి పందేలకు శనివారమే సిద్ధం చేసిన బరులు, వాటి చుట్టూ వైసీపీ జెండాలు

కోడి పందేల కట్టడికి చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలో కోడిపందేల నిర్వహణను అడ్డుకొనేందుకు హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీచేసింది. కోడిపందేల నిర్వహణ పెద్ద ఎత్తున జూదానికి అవకాశం కల్పిస్తోందని, అవి జరగకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడింది. పందేలను నిలువరించేందుకు హైకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్లు ముఖ్యంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించింది. జంతుహింస నిరోధక చట్టం-1960, ఏపీ జూద నిరోధక చట్టం-1974 నిబంధనలను కఠినంగా అమలు చేయాలని వారికి స్పష్టం చేసింది. చట్ట నిబంధనలు అమలు చేయడంలో విఫలమైతే సంబంధిత జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీసు కమిషనర్‌ను వ్యక్తిగతంగా బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. ఈ నెల 14లోగా ప్రతీ మండలంలో సంయుక్త తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ప్రతీ బృందానికి ఓ ఫొటోగ్రాఫర్, ఇద్దరు కానిస్టేబుళ్లను సహాయకులుగా చేర్చాలని పేర్కొంది. మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి తనిఖీ బృందాలకు అవసరమైన సహాయాన్ని అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది.



ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది. సంక్రాంతి సందర్భంగా రాష్ట్రంలో కోడిపందేలు నిర్వహించకుండా నిరోధించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ కృష్ణా జిల్లా కలిదిండి గ్రామానికి చెందిన హనుమ అయ్యప్ప హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది కేవీ ఆదిత్య చౌదరి వాదనలు వినిపించారు. కోడిపందేలను అడ్డుకొనేందుకు హైకోర్టు గతంలో ఉత్తర్వులిచ్చిందని, అధికారులు వాటిని అమలు చేయడం లేదని అన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

పక్కనే మద్యం బాటిళ్లు.. అన్నీ సర్వసన్నద్ధమైపోయాయి. పందేల చెంతనే పేకాట, గుండాట వంటి జూదాలకు.. అక్కడికి వచ్చే వారికి పార్కింగ్ సౌకర్యాలు ఏ లోటూ లేకుండా.. ఏ లోపమూ రాకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ చేశారు. కృష్ణా జిల్లాలోని అంపాపురం, ఈడుపుగల్లు, నూజివీడు, పశ్చిమలోని భీమవరం, గణపవరం, ఆకివీడు, వీరవాసరం, పాలకొల్లు, తూర్పుగోదావరిలోని అమలాపురం, ఐ.పోలవరం, ముమ్మిడివరం, పెద్దాపురం, జగ్గంపేట తదితర ప్రాంతాల్లో పెద్ద పెద్ద బరులు ఏర్పాటు చేయగా.. ఇక ఈ మూడు జిల్లాల్లోని చిన్న చిన్న గ్రామాల్లో కూడా ఈ ఏడాది పందేల బరులు ఏర్పాటు చేశారు. ఈడుపుగల్లులో ఏర్పాటు చేసిన బరి వద్ద పెద్ద ఎత్తున వైసీపీ జెండాలను, ముఖ్యమంత్రి జగన్ ఫొటోలతో ఎగరవేశారు. ఆ ప్రాంతమంతా వైసీపీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు కనిపిస్తోంది గానీ.. అక్కడికి వెళితే పందేల జోరు కనిపిస్తుంది. కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే పందేలకు రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పందెంరాయుళ్లు తరలివస్తారు. ఈసారి కొన్ని పెద్ద బరుల వద్ద ప్రవేశ రుసుము కూడా పెట్టారు. భీమవరం సమీపంలోని ఓ పెద్ద బరిలో ఎంట్రీ ఫీజు రూ.5వేల వరకు ఉందని చెబుతున్నారు. అయితే అక్కడ సౌకర్యాలు విలాసవంతంగా ఉంటాయి. అందుకే భారీ మొత్తంలో ఎంట్రీ ఫీజు పెట్టారు. గత సంక్రాంతిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కోడి పందాల్లోనే రూ.800 కోట్లు టర్నోవర్ జరిగింది. ఈసారి కూడా అదే స్థాయిలో పందాలు సాగుతాయని అంచనా వేస్తున్నారు. కోడి పందేలను వీక్షించేందుకు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జిల్లాకు చేరుకున్నారు. దాంతో భీమవరం, తాడేపల్లిగూడెం, ఆకివీడు పట్టణాల పరిధిలో హోటళ్లు భర్తీ అయిపోయాయి. అతిథి గృహాలు పెరిగాయి. విడిది గృహాలకు కూడా డిమాండ్ ఏర్పడింది. మరోవైపు పందేలు, జూదాలను ఆపేందుకు పోలీసులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

అధికార పార్టీదే హవా

పందేల బరుల ఏర్పాటులోనూ అధికార పార్టీలో విభేదాలు చోటుచేసుకున్నాయి. వైసీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. అధికార పార్టీ నేత ఆశీస్సులు ఉన్న వారికే బరులు దక్కాయి. మరో వర్గంలో కాస్త నిరాశ పెల్లుబికింది. భీమవరంలోని నియోజకవర్గంలోని ఓ గ్రామంలో ఇటువంటి పంచాయితీ ఒకటి జరిగింది. ఎప్పటినుంచో కోడి పందేలు నిర్వహిస్తూ వచ్చిన అధికార పార్టీ సీనియర్ నాయకునికి చుక్కెదురైంది.

పండక్కి.. మా ఊరికి రండి

- అందరినీ ఆహ్వానిస్తున్న యలమంచిలి
- గోదారి వంటకాలు.. 18 రకాల స్వీట్లు సిద్ధం
- మూడు రోజులపాటు ఆటలు, విందు వినోదాలు



యలమంచిలిలో సంబరాలకు సిద్ధమైన సెట్టింగులు

యలమంచిలి, జనవరి 13: 'రండి రండి రండీ.. దయ చేయండీ.. తమరి రాక మాకెంతో సంతోషం సుమండీ!' ఇది సినిమా పాటే కావచ్చు కానీ.. నిజంగానే అందరినీ ఆహ్వానిస్తోంది పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి గ్రామం. ఆతిథ్యానికి మారుపేరు గోదావరి జిల్లాలైతే.. అందరినీ ఆహ్వానించడం యలమంచిలి ప్రత్యేకత! రెండేళ్లుగా ఈ గ్రామంలో సంక్రాంతి సంబరాలను వినూత్న రీతిలో నిర్వహిస్తున్నారు. పండగ మూడు రోజులూ.. స్థానికులతోపాటే.. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినవారు, చుట్టుపక్కల గ్రామాలు.. ఇలా రాష్ట్ర నలుమూలల నుంచి ఎవరైనా ఆహ్వానితులే! ఇందుకు ఇక్కడి శ్రీ మూలస్థానేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణం వేదిక కానుంది. ఎవరైనా సరే సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేసి భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పాటూ ఎంజాయ్ చేసి వెళ్లడమే లక్ష్యంగా ఉత్సవాలు నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. రోజుకు ఐదు వేల మంది వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేశారు. దూరప్రాంతాల్లో ఉన్న వారికి సామాజిక మాధ్యమాల ద్వారా ఆహ్వాన పత్రికలు పంపించారు. ఫొటోషూట్, సెల్ఫీలు తీసుకోవడానికి బోటింగ్, సుమారు 22 రకాల పూలతోకూడిన వివిధ ఆకృతులను ఏర్పాటుచేశారు.

ఇవీ ప్రత్యేకతలు!

దూరప్రాంతాల నుంచి విచ్చేసే అతిథులు ఉదయాన్నే వచ్చి సాయంత్రం వరకూ ఎంజాయ్ చేయడమే. వీరికి ఉదయాన్నే 5 రకాల ఫలహారాలు, మాంసాహార(నాన్ వెజ్) భోజనాలు, స్నాక్స్, టీ ఏర్పాటు చేశారు. అతిథిలకు స్వీట్స్ అందించి స్వాగతం పలికేందుకు సున్నుండలు, అరిసెలు, పాకుండలు, పూతరేకులు, పాకం గారెలు, కజ్జికాయ వంటి తొమ్మిదిరకాల స్వీట్స్, సాయంత్రం సమయంలో మరో తొమ్మిది రకాల స్నాక్స్ అందించే ఏర్పాట్లు చేశారు. ఆదివారం భోగి పండగ సందర్భంగా ఉదయాన్నే భోగి మంట వేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తారు. మూడు రోజుల పాటూ వినోదాన్నందించేందుకు జబర్దస్త్ టీం, సినీ సంగీత విభావరులు, మ్యాజిక్ షోలతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మహిళలు, చిన్నారులు, యువత కోసం వేర్వేరు విభాగాల్లో వివిధపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వహకులు తెలిపారు. పండగరోజుల్లో శ్రీమూలస్థానేశ్వరి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకునే భక్తులకు(ప్రతిఒక్కరికీ) బహుమతులను అందించేందుకు సుమారు 3 వేల బహుమతులు సిద్ధం చేశారు. స్థానికులతోపాటు ఏప్రాంతంవారైనా ఈ ఉత్సవాలకు కుటుంబంతో విచ్చేసి ఎంజాయ్ చేసి వెళ్లడమే లక్ష్యంగా అన్నిఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి), తాళ్లూరి వెంటేశ్వర రావు తెలిపారు.



భోగి మంటల్లో జగన్ హామీ ప్రతులు, జీవో ప్రతులను వేసి నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

భోగి మంటల్లో జగన్ హామీలు!

- టీడీపీ నేతలు కోటంరెడ్డి తదితరుల నిరసన

నెల్లూరు (వ్యవసాయం), జనవరి 13: ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు ఇస్తానని ముఖ్యమంత్రి జగన్ యువతను నమ్మించి మోసం చేశారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమల నాయుడు ఆధ్వర్యంలో నగరంలోని టీడీపీ కార్యాలయం ఎదుట వేసిన భోగి మంటల్లో జాబ్ క్యాలెండర్ హామీ పత్రాలు, చీకటి జీవోల ప్రతులను వేసి నిరసన వ్యక్తం చేశారు.

నేడు మందడంలో భోగి వేడుకలు

- పాల్గొననున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

అమరావతి, తిరుపతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం ఉదయం 7 గంటలకు రాజధాని గ్రామం మందడంలో భోగి వేడుకల్లో ఉమ్మడిగా పాల్గొనను న్నారు. 'తెలుగు జాతికి స్వర్ణయుగం-సంక్రాంతి సంకల్పం' పేరుతో మందడంలోని గోల్డెన్ రూల్ స్కూల్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జగన్ సర్కార్ ప్రజావ్యతిరేక నిర్ణయాలతో ఇచ్చిన ఉత్తర్వులను భోగి మంటల్లో దహనం చేయనున్నారు.

నేడు నారావారిపల్లెకు చంద్రబాబు, లోకేశ్

సంక్రాంతి పండుగను స్వగ్రామంలో జరుపుకునేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్ ఆదివారం నారావారిపల్లెకు చేరుకోనున్నారు. శుక్రవారమే నారా భువనేశ్వరి ఇక్కడికి చేరుకోగా శనివారం నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, ఆమె చిన్న కుమార్తె తేజస్విని, మనవడు దేవాన్ష్ నారావారిపల్లెకు వచ్చారు.

త్వరలో కిర్లంపూడికి పవన్‌కల్యాణ్

కిర్లంపూడి, జనవరి 13: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం జనసేనలో చేరే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. పవన్ కల్యాణ్ త్వరలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కిర్లంపూడికి వచ్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని జనసేన తాడేపల్లిగూడెం ఇన్‌చార్జ్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 23లోపు ఏదోఒక రోజు స్వయంగా పవన్ కిర్లంపూడి వస్తారని, ముద్రగడతో భేటీ అనంతరం పార్టీలోకి ఆహ్వానిస్తారని ఆయన స్పష్టం చేశారు.

ఇది ఎన్నికల సమయం.. పార్టీ కోసం కష్టపడదాం

- కార్యకర్తలను స్వచ్ఛ అభియాన్‌లో భాగస్వామ్యం చేద్దాం: పురందేశ్వరి

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల సమయం ఆసన్నమైంది. పార్టీ కోసం మరింత ఎక్కువ కష్టపడదాం. ఆలయాలు శుభ్రం చేసే పని పండుగ ముందు మొదలు పెడదాం. భక్తులను స్వచ్ఛ అభియాన్‌లో భాగస్వాముల్ని చేద్దాం' అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మండల, జిల్లా స్థాయి నేతలతో శనివారం ఆమె విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భోగి మంటలతో కార్యక్రమాన్ని మొదలు పెట్టి వెంటనే ఆలయాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని ఆయా ప్రాంతాల్లో భక్తులతో కలిసి ప్రారంభించాలని సూచించారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలంటూ గోడలపై వాల్ రైటింగ్ ఈనెల 15 నుంచి మొదలు పెట్టి విస్తృతంగా కొనసాగించాలి' అని బీజేపీ శ్రేణులకు ఆమె దిశా నిర్దేశం చేశారు.

ఒకేమాట.. ఒకే బాట!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో టీడీపీ జాతీయ ప్రధాన లోకేశ్, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఖరారు, ఉమ్మడి మేనిఫెస్టోపై చంద్రబాబు, పవన్ చర్చించుకున్నారు. పొత్తులో భాగంగా జనసేన వివిధ జిల్లాల్లో ఆశిస్తున్నట్లు సీట్లు, అక్కడ ఆ పార్టీ తరపున ప్రతిపాదనలో ఉన్న అభ్యర్థుల జాబితాతో పవన్ వచ్చినట్లు తెలిసింది. బలమైన, మంచి అభ్యర్థి ఉన్న స్థానాలపై ఎవరూ పట్టుదలకు పోకుండా, అలాంటి వారిని సర్దుబాటు చేయాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. వైసీపీ కొంత మంది ఎమ్మెల్యేలు, ఎంపీలకు సీట్లు నిరాకరించడం.. ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు కొందరు టీడీపీ, జనసేన వైపు చూస్తుండటం ఈ భేటీలో చర్చకు వచ్చింది. వివిధ సమీకరణాల దృష్ట్యా మంచి అభ్యర్థులు వస్తే తీసుకుని, పోటీకి అవకాశం ఇవ్వాలని, అదే సమయంలో రెండు పార్టీల కిందిస్థాయి నేతల మనోగతాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలని ఈ సమావేశంలో ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలోనే... శనివారం వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీ బాలశౌరిని జనసేన తరఫున బరిలో నిలపడంపైనా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఆయన గుంటూరు నుంచి పోటీ చేయాలని భావిస్తుండగా... మచిలీపట్నం కేటాయించాలని టీడీపీ యోచిస్తున్నట్టు సమాచారం! ఇక... సాన సతీశ్ బాబు జనసేన అభ్యర్థిగా కాకినాడ ఎంపీగా పోటీచేసే అవకాశం ఉంది. కృష్ణా జిల్లాలో ఒక సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం ఇచ్చేందుకు వీలుగా పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే పార్థసారథిని తీసుకుని, పోటీకి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. దర్శి నియోజకవర్గంలో ఇటీవల జనసేనలో చేరిన వెంకట్ అనే నేత ఆ పార్టీ అభ్యర్థి అవుతారన్న అభిప్రాయం కూడా ఈ సమావేశంలో వ్యక్తమైంది. విశాఖలో ఇటీవల జనసేన పార్టీలో చేరిన వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్‌ను ఎక్కడైనా సర్దుబాటు చేయడం వీలౌతుందా అనే అంశంపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.

సూపర్ సిక్స్‌కు మరో నాలుగు...

ఈ భేటీలో ఉమ్మడి మేనిఫెస్టోపై కూడా చర్చించారు. 'సూపర్ సిక్స్' పేరుతో టీడీపీ గతంలో ప్రకటించిన హామీలకు మరో మూడు, నాలుగు హామీలను తమ తరఫున జత చేయాలని జనసేన ప్రతిపాదించింది. టీడీపీ అధినేత చంద్రబాబు 'రా.. కదలిరా!' పేరుతో బహిరంగ సభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఒకటి రెండు సభల్లో పవన్ కల్యాణ్ కూడా పాల్గొననున్నారు. ఇందులోనే ఒక సభలో ఇద్దరూ కలిసి ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేసే అవకాశముందని తెలిసింది. సంక్రాంతి తర్వాత ఎప్పుడైనా మేనిఫెస్టోను విడుదల చేయాలని భావిస్తున్నారు. రిపబ్లిక్ డే (జనవరి 26)ను కూడా పరిశీలిస్తున్నారు. తిరుపతి వేదికగా ఉమ్మడిగా శంఖారావం పూరించాలని యోచిస్తున్నారు. 'ప్రతి చేతికీ పని... ప్రతి చేనుకూ నీరు' అనే నినాదాన్ని వినిపించాలని భావిస్తున్నారు. ఈనెల 18వ తేదీ తర్వాత మరోమారు సమావేశం కావాలని ఇరు పార్టీల నేతలు నిర్ణయించుకున్నారు.

ఈసీ స్పందనపై సంతృప్తి...

అధికార వైసీపీ దొడ్డిదారిన ఎన్నికల్లో గెలవటానికి చేస్తున్న ప్రయత్నాలు, ఓటర్ల జాబితాలో అక్రమాలు తదితర అంశాలపైనా ఇరు పార్టీల అగ్ర నేతలు చర్చించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసిన తర్వాత ఈసీ నుంచి వెలువడిన ప్రతిస్పందన కొంత సంతృప్తికరంగానే ఉందని చంద్రబాబు, పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.

2 ఎంపీ, 10 అసెంబ్లీ.. అభ్యర్థులు ఖరారు!

- నెల రోజులుగా పవన్ కసరత్తు
- పదిమంది అభ్యర్థులపై ఇప్పటికే స్పష్టత

అమరావతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీతో సీట్ల సర్దుబాటు కొలిక్కి వస్తుండటంతో... జనసేన తన అభ్యర్థుల ఖరారు దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలోనే బస చేస్తున్న పవన్ కల్యాణ్ జిల్లాల నుంచి నాయకులను పిలిపించుకుని చర్చలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కొంత మంది నాయకులకు సీటు విషయంలో పవన్ హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. కాకినాడ, గుంటూరు లోక్‌సభ అభ్యర్థుల విషయంలో ఇప్పటికే స్పష్టత వచ్చినట్లు సమాచారం. సాన సతీశ్ బాబును కాకినాడ లోక్‌సభ నుంచి బరిలోకి దించాలని పవన్ నిర్ణయించారు. ఈ విషయాన్ని ఆయనకు కూడా తెలిపారు. ఇక... మచిలీపట్నం ఎంపీ బాలశౌరి శనివారం వైసీపీకి రాజీనామా చేశారు. సంక్రాంతి తర్వాత ఆయన జనసేనలో అధికారికంగా చేరనున్నారు. మచిలీపట్నం లేదా గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆయనను పోటీలోకి దించాలని పవన్ ఆలోచిస్తున్నారు. అయితే... బాలశౌరి గుంటూరు ఎంపీ స్థానం నుంచి పోటీ చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. వెరసి... జనసేన తరఫున ఇద్దరు ఎంపీ అభ్యర్థులు ఖరారైనట్లే. పొత్తుల్లో భాగంగా జనసేన పార్టీకి అటూఇటుగా 25 అసెంబ్లీ స్థానాలు కేటాయించే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. ఆ స్థానాలపైనా ఇరుపార్టీల మధ్య ఇప్పటికే అవగాహన కుదిరినట్లు సమాచారం. ఇందులో పది స్థానాలకు సంబంధించిన అభ్యర్థులను జనసేన సిద్ధం చేసుకుంది. సంక్రాంతి తర్వాత టీడీపీ, జనసేన ఉమ్మడిగా అభ్యర్థులను ప్రకటించనున్నాయి.

మా అబ్బాయి పెళ్లికి రండి..!

- టీడీపీ అధినేత చంద్రబాబుకు షర్మిల ఆహ్వానం
- రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు ఉండకూడదు
- రాజకీయం మా వృత్తే కానీ జీవితం కాదు: షర్మిల

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును.. కాంగ్రెస్ నాయకురాలు, వైఎస్ఆర్ కుమార్తె షర్మిల శనివారం ఆయన నివాసంలో కలిశారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి, కుటుంబ సమేతంగా పెళ్లికి రావాలని ఆహ్వానించారు. అనంతరం షర్మిల విలేకరులతో మాట్లాడారు. తమ సమావేశానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని స్పష్టం చేశారు. తన కుమారుడు రాజారెడ్డి పెళ్లికి చంద్రబాబును పిలిచేందుకు మాత్రమే వచ్చానని, ఆయన కూడా పెళ్లి వేడుకకు హాజరై ఆశీర్వదిస్తానని చెప్పారని వెల్లడించారు. దివంగత వైఎస్ఆర్ కూడా తమ కుటుంబంలో జరిగిన వివాహాలకు చంద్రబాబును ఆహ్వానించారని, ఆయనా వచ్చి ఆశీర్వదించారని చెప్పారు. క్రిస్మస్ సందర్భంగా చంద్రబాబుకు స్వీట్లు పంపితే దాన్నీ తప్పు పట్టారని, ఇలా ప్రతి విషయాన్నీ రాజకీయాలతో ముడిపెట్టడం సరైంది కాదని షర్మిల అన్నారు. క్రిస్మస్ సందర్భంగా చంద్రబాబుతోపాటు కేటీఆర్, కవిత, హరీశ్‌రావులకూ స్వీట్లు పంపానని చెప్పారు. రాజకీయం అన్నది తమ వృత్తే కానీ.. అదే జీవితం కాదన్నారు. రాజకీయాల్లో స్నేహపూర్వక వాతావరణం ఉండాలే కానీ.. వ్యక్తిగత కక్షలు ఉండకూడదంటూ షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో తనకు ఏ బాధ్యతలు ఇవ్వాలన్నది కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పారు. వైఎస్‌తో చంద్రబాబుకు ఉన్న స్నేహం గురించి చాలాసేపు చర్చించుకున్నామని, వైఎస్ గురించి బాబు చాలా గొప్పగా చెప్పారని షర్మిల వెల్లడించారు.

భారత్ జోడో న్యాయ్ యాత్రకు షర్మిల

మణిపూర్‌లో ఆదివారం ప్రారంభం కానున్న రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో షర్మిల పాల్గొనున్నారు. ఇందుకోసం ఆమె శనివారంసాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి ఆదివారం ఉదయం మణిపూర్‌కు చేరుకోనున్నారు.

ఫలించని 'నీలి' గోల!

- కాపు ఓట్లలో చీలికకు వైసీపీ యత్నం
- వాటిని పట్టించుకోని యువత, నేతలు
- జనసేనలో వరుసగా చేరికలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జనసేనకు వ్యతిరేకంగా కాపులను రెచ్చగొట్టేందుకు, కాపు ఓట్లలో చీలిక తెచ్చేందుకు 'నీలి మీడియా' చేస్తున్న వ్యూహాత్మక దుష్ప్రచారం ఫలితాలు ఇవ్వడంలేదు. టీడీపీతో పొత్తును వారు స్వాగతించడంలేదని, పొత్తు పెట్టుకుంటే ఫలానా 'షరతులు' తప్పనిసరిగా ఉండాలని కాపులు కోరుకుంటున్నట్లు, జనసేన కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన పార్టీనే అనేలా భిన్నమైన అభిప్రాయాలను వైసీపీ సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేయిస్తోంది. కానీ... క్షేత్రస్థాయిలో ఈ ప్రచారం ఏమాత్రం పని చేయడంలేదు. అంతేకాదు... కాపులతోపాటు ఇతర సామాజిక వర్గాల నాయకులూ జనసేనకు జై కొడుతున్నారు. పొత్తులో భాగంగా తమకు కేటాయించబోయే స్థానాలు, ఇతర సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని ఆయా నాయకులను జనసేనలో చేర్చుకుంటున్నారు.

వరుసగా నేతల రాక...

వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ ఇప్పటికే జనసేనలో చేరారు. ఆయన అధికారికంగా పార్టీ కండువా కప్పుకోవడం ఒక్కటే మిగిలింది. వైసీపీ ఈ షాక్ నుంచి తేరుకోక ముందే క్రికెటర్ అంబటి రాయుడు మరో షాక్ ఇచ్చారు. ఆయన వైసీపీలో చేరి వారం తిరగకముందే జగన్‌కు గుడ్‌బై చెప్పి.. పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. సీట్ల సర్దుబాటు ఇంకా పూర్తికాకపోవడంతో పార్టీలో చేరికను అంబటి రాయుడు వాయిదా వేసుకున్నారు. దీనిపై చర్చ జరుగుతుండగానే... మచిలీపట్నం ఎంపీ బాలశౌరి శనివారం వైసీపీకి రాజీనామా చేశారు. జనసేనలో చేరుతున్నట్లు ట్విటర్ (ఎక్స్) వేదికగా ప్రకటించారు. ఇక..ఇన్నాళ్లు పరోక్షంగానో, ప్రత్యక్షంగానో వైసీపీకి అనుకూలంగా ఉన్న ముద్రగడ పద్మనాభం కూడా జనసేన పట్ల సానుకూలత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మరికొందరు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు జనసేన వైపు చూస్తున్నట్లు సమాచారం. పొత్తులో భాగంగా వారికి లభించే అవకాశాలు, ఇతర సమీకరణాలు ఇందులో కీలకంగా మారాయి. సీట్ల కేటాయింపుపై ఇంకా స్పష్టత రాకపోవడంతో తనతో టచ్‌లో ఉన్న నేతలకు పవన్ పూర్తి స్థాయిలో హామీలు ఇవ్వలేకపోతున్నారు. ఈ కారణంతో చాలా మంది నాయకులు బయటకు రావడం లేదు.

జనసేన వైపు కాపు నాయకుల చూపు...

శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకూ ఉన్న కాపులు జనసేన పార్టీ వైపు చూస్తున్నారు. 2014లో పార్టీ ప్రారంభించినప్పుడు ఇతర సామాజికవర్గం వారితో పాటు కాపు నాయకుల్లోనూ చాలామంది జనసేనను తేలిగ్గానే తీసుకున్నారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ముద్రగడ్డ పద్మనాభం కొన్ని నెలల క్రితం పవన్ కల్యాణ్‌కు కొన్ని లేఖలు రాశారు. అందులోని అంశాలను యువత, కాపు సామాజికవర్గ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ముద్రగడకు అనుకూలంగా గ్రామాల్లో ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలు మాయమైపోయాయి. కాపుల్లో జనసేన పట్ల పెరిగిన ఆదరణ గురించి చెప్పేందుకు ఇదొక్క ఉదాహరణ చాలు. 2019లో వైసీపీ తరఫున గెలిచిన కాపు ఎమ్మెల్యేలు, ఆ సామాజిక వర్గం ప్రభావం అధికంగా ఉన్న నియోజకవర్గాల్లోని వైసీపీ ఎమ్మెల్యేలకు ఇప్పుడు జనసేన భయం పట్టుకుంది. పేర్ని నాని, అంబటి రాంబాబు మినహా వైసీపీలోని ఇతర కాపు నాయకులెవరూ పవన్ కల్యాణ్‌ను విమర్శించేందుకు సాహసించడంలేదు.

ఏపీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామిపై కేసు

- సోనియాపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు..

అఫ్జల్‌గంజ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామిపై హైదరాబాద్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ నారాయణ స్వామిపై ఈ నెల 8న కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోనియాపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నారాయణస్వామి వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు.. వీడియో ఫుటేజ్‌లో నారాయణస్వామి వ్యాఖ్యలను పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బాధ్యతారాహిత్యంగా మాట్లాడినట్లు నిర్ధారించారు. దీంతో ఆయనపై 504, 505(2)తో పాటు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శంకర్ తెలిపారు.



హెడ్‌కానిస్టేబుల్‌ను బెదిరిస్తున్న మంత్రి రోజా అనుచరుడు ప్రత్యూష్

రోజా అనుచరుడా.. మజాకా!

- ఇసుక వాహనాన్ని అడ్డుకున్న హెడ్‌కానిస్టేబుల్
- బెదిరించిన వైసీపీ నాయకుడు.. వీడియో వైరల్

నగరి, జనవరి 13: ఇసుక రవాణాలో జోక్యం చేసుకున్న హెడ్‌కానిస్టేబుల్‌ను మంత్రి రోజా అనుచరుడు బెదిరించిన సంఘటన చిత్తూరు జిల్లా నగరిలో శుక్రవారం చోటుచేసుకుంది. నగరి పట్టణంలోని సత్రవాడ సమీపంలో ఖెరణి వద్ద రీచ్ లేకున్నా ప్రభుత్వ పనులకంటూ వైసీపీ నాయకులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేపడుతున్నారు. ఈ విషయమై ఖెరణి దళితవాడకు చెందిన అంబేడ్కర్ సంఘం వీడియోలతో సహా అధికారులకు ఫిర్యాదు చేసి తమ శ్మశానవాటికను సైతం తవ్వేస్తున్నారంటూ ఇసుక వాహనాలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం పోలీసులు ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని నిలిపి ప్రశ్నించారు. దీంతో వాహన డ్రైవరు మంత్రి రోజా ముఖ్య అనుచరుడు ప్రత్యూష్‌కు ఫోన్ చేయడంతో అక్కడికి వచ్చాడు. హెడ్‌కానిస్టేబుల్‌పై ప్రత్యూష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. 'నువ్ రేపు మేడమ్ ఇంటికి రా.. నీకథ అయిపోతుంది.. రోడ్డు పనులు జరుగుతుంటే వాహనాలను ఆపుతావా నీ కథ చూస్తానంటూ బెదిరిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. హెడ్‌కానిస్టేబుల్‌ను తీవ్ర స్థాయిలో దూషిస్తున్నా మిగిలిన పోలీసులు నిమ్మకునీరెత్తినట్లుండిపోవడం విమర్శలపాలైంది. ఈ విషయంపై నగరి సీఐను వివరణ కోరగా, వారిద్దరూ వ్యక్తిగత విభేదాలతో వాదులాడుకున్నారని చెప్పారు.

వేరొకరి స్థలంలో వలంటీర్ అక్రమ నిర్మాణం

- అధికారులు హెచ్చరించినా బరితెగింపు



వలంటీర్ నిర్మిస్తున్న ఇల్లు

కణేకల్లు, జనవరి 13: అనంతపురం జిల్లా కణేకల్లు మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామంలో దళిత మహిళకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలంలో గ్రామ వలంటీరు ఇంటి నిర్మాణం చేపట్టారు. దీనిపై బాధితురాలు అంజలి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ కాలనీలో తమకు ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చిందని, అందులో కొంతభాగంలో ఇంటిని నిర్మించుకుని, మరికొంత ఖాళీగా ఉంచామని తెలిపారు. ఆ మిగిలిన స్థలాన్ని గ్రామ వలంటీరు అక్కమ్మ ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టిందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయగా.. వారు అక్కమ్మను మందలించి నిర్మాణాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేశారని తెలిపారు. కొన్నాళ్లు మౌనంగా ఉన్న అక్కమ్మ, తిరిగి ఇంటి నిర్మాణం చేపట్టారని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులకు విన్నవించారు.

వైసీపీ బెదిరింపులతో రైతు ఆత్మహత్యాయత్నం

- పార్టీ మారాలని బీసీ రైతుపై ఒత్తిడి.. ప్రభుత్వ పథకాలన్నీ నిలిపివేత
- పొలంలో విద్యుత్ స్తంభాలు పాతించి ఇబ్బందులు
- జలసిరి బోరు మంజూరైనా అడ్డుకున్న వైనం



చికిత్స పొందుతున్న దొంగల ఆదినారాయణ

జగ్గయ్యపేట, జనవరి 13: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అధికార వైసీపీ నేతల బెదిరింపులు తాళలేక శనివారం ఒక రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తెలుగుదేశం సానుభూతిపరుడైన చిల్లకల్లుకు చెందిన రైతు దొంగల ఆదినారాయణ (72).. తన పొలంలో అపస్మారకస్థితిలో పడి ఉండగా గమనించిన చుట్టుపక్కల రైతులు.. కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వటంతో వారు హుటాహుటిన జగ్గయ్యపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బలహీనవర్గాలకు చెందిన ఆదినారాయణకు గ్రామంలో పెట్రోలు బంకు సమీపంలో ఎకరం భూమి ఉంది. జలసిరి పథకం కింద బోరు మంజూరు కాగా, అధికార పార్టీకి చెందిన నేతలు దొంగల జానకీరామయ్య, సంపతి సైదేశ్వరరావు అడ్డుకున్నారు. టీడీపీ నుంచి వైసీపీలోకి రావాలని కోరగా అయన వ్యతిరేకించడంతో ఇబ్బందులు పెట్టడం మొదలు పెట్టారు. పింఛను మంజూరైనా, మనవడికి అమ్మ ఒడి మంజూరైనా ఏదో ఒక సాకుతో అడ్డుకున్నారు. తాజాగా సంపతి సైదేశ్వరరావుకు మంజూరైన వ్యవసాయ కనెక్షన్ కోసం.. ఎలాంటి అనుమతీ లేకుండా ఆదినారాయణ భూమిలో విద్యుత్ స్తంభాలు పాతి విద్యుత్ కనెక్షన్ ఇప్పించుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన ఆదినారాయణ శనివారం పొలానికి వెళ్లి వస్తానని చెప్పి పురుగు మందు తాగిపడి పోయాడు. ప్రస్తుతం ఆస్పత్రిలోఉన్న ఆయన పరిస్థితి విషమంగా ఉంది.

పార్టీ మారాలని నాలుగేళ్లుగా ఒత్తిడి

'తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటి నుంచి ఆ పార్టీనే నమ్ముకున్నాం, ఎన్టీఆర్ అంటే పిచ్చి అభిమానం, ఏదో పథకాల కోసం కండువా మార్చుకోమని నాలుగేళ్లుగా ఒత్తిడి చేస్తున్నారని ఆత్మహత్యకు పాల్పడిన రైతు ఆది నారాయణ సతీమణి పిచ్చమ్మ చెప్పారు. తనకు 45 సంవత్సరాలు నిండినా ఏ పథకం రానివ్వడం లేదని, మనవడికి అమ్మ ఒడి పడకుండా చేశారని, భర్తకు పింఛనుకు అన్ని అర్హతలూ ఉన్నా ఆపేశారని, పార్టీ మారితేనే అన్నీ ఇస్తామని ఒకటే ఒత్తిడి చేస్తున్నారని ఆమె ఆస్పత్రి ఎదుట విలేకరులకు తెలిపారు. తమ కుమార్తెలకు రాసిచ్చిన పొలంలో విద్యుత్ స్తంభాలు వేశారని, తొలగించాలని అధికారుల చుట్టు తిరిగినా ఫలితం లేకపోయిందని, తమను కాదని ఎవరొస్తారో చూస్తామని సైదేశ్వరరావు, జానకీరామయ్య బెదిరించటంతో గత్యంతరం లేక తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని కళ్ల నీళ్ల పర్యంతమయ్యారు. ప్రాణాలు పోయినా తెలుగుదేశం పార్టీని వీడేది లేదన్నారు. నియోజకవర్గ తెలుగుయువత నేత ఎనికే గోపి మాట్లాడుతూ చిల్లకల్లులో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని ఆరోపించారు.

108, 104 ఉద్యోగుల సమ్మె లేదు

- ఉద్యోగులతో చర్చించిన మంత్రి రజనీ
- డిమాండ్ల పరిష్కారానికి హామీ

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నియామకాల్లో 108, 104 ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలన్న ప్రతిపాదనను సిద్ధం చేస్తామని ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని హామీ ఇచ్చారు. 108 అంబులెన్స్, 104 వాహనాల ఉద్యోగులు తాజాగా సమ్మె నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నెల 22 నుంచి సమ్మె చేయాలని ఉద్యోగులు నిర్ణయించారు. దీంతో 108, 104 ఉద్యోగులతో గుంటూరులో ఆమె చర్చలు జరిపారు. ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆప్కాస్‌లో చేర్చాలన్న ఉద్యోగుల వినతిని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. శ్లాబ్ పద్ధతిని వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి నెలా ఉద్యోగులకు క్రమం తప్పకుండా జీతాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి హామీ మేరకు 108, 104 ఉద్యోగులు సమ్మె యోచనను విరమించుకున్నారు.

- ఎంపీ అయ్యుండి ఏం చేశారు?
- తలారి రంగయ్యను నిలదీసిన తాగునీటి పథకం కార్మికులు

ఇన్నాళ్లకు గుర్తొచ్చామా?

కళ్యాణదుర్గం, జనవరి 13: అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు నిలదీశారు. 'ఎంపీవి అయ్యుండి ఒక్కసారైనా మా సమస్యల గురించి పట్టించుకున్నారా? ఇప్పుడెందుకు వచ్చారు?' అని ప్రశ్నించారు. వేతనాల కోసం కొన్నాళ్లుగా కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పంప్ హౌస్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు ఎంపీ శనివారం వెళ్లారు. రెండు రోజుల్లో రెండు నెలల జీతాలు మంజూరు చేయిస్తామని, సమ్మెను విరమించాలని కోరారు. దీంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా నిలిపేస్తేగానీ మేము గుర్తుకు రామా? అని ప్రశ్నించారు. బకాయి వేతనాలు చెల్లించాకనే సమ్మె విరమిస్తామని స్పష్టం చేశారు. దీంతో ఎంపీ తిరుగుముఖం పట్టారు. రంగయ్యను వైసీపీ అధినాయకత్వం ఇటీవలే కల్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా రాయదుర్గం, కల్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో 325 గ్రామాలకు తాగునీరందుతోంది. ఈ పథకం కింద 225 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నాలుగు నెలల జీతాలు చెల్లించాల్సి ఉంది.



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పంపుహౌస్ వద్ద కార్మికులతో మాట్లాడుతున్న తలారి రంగయ్య

అయ్యగారు.. అబ్బాయి జోరు

(మొదటి పేజీ తరువాయి)

కూడా అవకాశం లేకుండా దాడి చేస్తారు. కొల్లేరు భూముల నుంచి పోలవరం కాలువ దాకా తండ్రీకొడుకులు కలిసి దోచేస్తున్నారు. కాలువ మట్టి తరలిస్తున్న వాహనాలను యువకులు అడ్డుకుంటే, తండ్రి రాలకొడతాడు. కుమారుడు పోలీసులు, చట్టంతో కొడతాడు. ఆ నియోజకవర్గంలో జరిగే ప్రతీ అరాచకం వెనుక వీరి పేర్లే వినిపిస్తాయి. అయితే, ఎక్కడా ప్రత్యక్షంగా రంగంలోకి దిగరు. అనుచరులు, వరుసకు బాబాయ్ అయ్యే వ్యక్తే ఫీల్డ్‌లో కనిపిస్తారు. వీరు కాకుండా మండలానికో నాయకుడిని నియమించుకున్నారు. వారి కనుసన్నల్లో అక్రమ మట్టి తవ్వకాలు, కొల్లేరు చేపల చెరువులకు అనుమతులు, అక్రమ లీజులకు వసూళ్లను తండ్రీ కొడుకులకు ఎప్పటికప్పుడు వాటాలు పంపుతున్నారు.

ఎక్కడా తగ్గడు బాబాయ్

బడా నాయకుడిగా ఎదగాలనుకుంటున్న అబ్బాయ్‌కి బాబాయ్ తోడయ్యాడు. ఏలూరు రూరల్ ప్రాంతాల్లో బాబాయ్ దందాలు అంతాఇంతా కావు. కొల్లేరు ప్రాంతంలో ఒక్కో రైతు నుంచి ఎకరానికి రూ.25 వేల చొప్పున వసూలు చేసి, సుమారు 700-800 ఎకరాల కొల్లేరు భూముల్లో చేపల చెరువులకు అనధికారికంగా అనుమతులిచ్చేశారు. ప్రస్తుతం ఆ భూములన్నీ చెరువులుగా మారిపోయాయి. దాదాపు 1600 ఎకరాల దాకా కొల్లేరు భూములపై అధికార దుర్వినియోగం ద్వారా సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే ఓ మండలంలో నాయకుడితో పాటు జిల్లా పరిషత్ స్థాయిలో ఇటీవలే పదవిని అధిరోహించిన ఓ నాయకురాలి భర్తను మరో సామంతరాజుగా నియమించుకున్నారు. పెదవేగి మండలంలో మరో ఇద్దరు నాయకుల ఆధ్వర్యంలో అక్రమ వసూళ్లతోపాటు మట్టి తవ్వకాల వ్యవహారాలను పటిష్ట ఏర్పాట్లు చేసుకుని మరీ దందాలు నిర్వహిస్తున్నారు. ఈ ఇద్దరే స్థానికంగా వివాదాస్పద భూములపై పంచాయితీలు నెరుపుతూ తక్కువ ధరకు పంట పొలాలను రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు.

అప్పుడు కాలువల్లో.. ఇప్పుడు గట్లపై గునపం

అబ్బాయ్ పదవిలోకి వచ్చిన నాటి నుంచి అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అధికారికంగా 30 వేల క్యూబిక్ మీటర్లకు తీసుకున్న అనుమతులను చూపిస్తూ ఇప్పటిదాకా కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వుకుపోయారు. ఇలా తవ్విన మట్టిని ఏలూరు, గుడివాడ, కైకలూరు తదితర ప్రాంతాల్లో ఏర్పడ్డ రియల్ ఎస్టేట్ వెంచర్ల యజమానులకు పది టన్నుల లారీ మట్టిని రూ. 10వేలు చొప్పున విక్రయిస్తున్నారు. ఏలూరు నగర శివారుల్లోని ఓ కాలేజీకి కూతవేటు దూరంలో ఉన్న వెంచర్‌కు తరలించిన లారీల కొద్దీ అక్రమ మట్టే ఈ దందాకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. ఈ అక్రమ రవాణాను అడ్డుకునే అధికారి లేకపోవడంతో రోజూ 25 టెన్ టైర్ లారీలు రమారమీ 60 ట్రిప్పులకు పైగా తిప్పుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గడిచిన నాలుగున్నరేళ్లలో స్థానిక ప్రజలు దాదాపు 70 సార్లకు పైగా ఈ అక్రమ రవాణా చేస్తోన్న లారీలు, ట్రాక్టర్లను అడ్డుకుని సంబంధిత అధికారులకు అప్పగించారు. ఒక్కోసారి ప్రాణాలకు తెగించి మరీ జరిగిన ఆ అడ్డగింతలలో పలువురు స్థానికులు గాయాల పాలయ్యారు. అయితే స్పందించాల్సిన పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు తూతూ మంత్రంగా చలానాలు రాసి ఆ వాహనాలను వదిలేస్తున్నారు. కనీసం ఆ అక్రమ రవాణా ఎవరి ఆధ్వర్యంలో జరుగుతుందన్న కనీస విచారణ కూడా లేకుండా రాత్రి పట్టుకున్న వాహనాలను ఉదయం కల్లా పోలీస్ స్టేషన్ల పరిధిలో లేకుండా పంపించేస్తున్నారు. స్థానికులు పట్టుకున్న వాహనాలపై ఆ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కలగజేసుకుని ప్రశ్నించినప్పుడు మాత్రం అడపాదడపా కేసులు నమోదు చేస్తున్నారు. సీరియస్ యాక్షన్‌కు మాత్రం తావులేదు. పైగా అడ్డుకున్న వ్యక్తులపైనే రివర్స్ కేసులు పెడుతూ తమదారికి అడ్డు లేకుండా చేసుకుంటున్నారు. అయితే ఈ అక్రమ మట్టి తవ్వకాలతో ప్రమాదంలోపడిన పోలవరం కాలువను కాపాడాలంటూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన న్యాయస్థానం ఎమ్మెల్యేతోపాటు ఆయనకు వెన్నుదన్నుగా ఉండే పలువురు నాయకులపైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. తవ్వకాలను నిలిపివేయాలని ఆదేశించింది. కాగా అప్పటి నుంచి కాలువల్లో తవ్వకాలు నిలిపివేసి, గట్లపై తవ్వకాలను కొనసాగిస్తూనే ఉన్నారు.



భూములపైనే భక్తి...

అబ్బాయ్ కోసం పనిచేసే ఇద్దరు నాయకులు స్వామి భక్తిని చాటుకుంటేనే.. పనిలో పనిగా భూములు కాజేస్తున్నారు. అన్నదమ్ముల గొడవలు, వివాదాల్లో ఉన్న భూములపై పంచాయతీలు చేస్తూ, చివరకు మార్కెట్ విలువ కంటే చాలా తక్కువ ధరకు ఆ పొలాలను ఆ ఇద్దరే కొనుగోలు చేస్తున్నారు. ఎకరా రూ.30 లక్షల విలువైన ఎదెకరాల పొలాన్ని కేవలం ఎకరా రూ.10 లక్షలకే రాసివ్వాలని యజమానులను బెదిరించి, చివరకు అదే ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. బాధితులపైనే తిరిగి రివర్స్ కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. ప్రశ్నించిన టీడీపీ నాయకులపై జిల్లాలో ఎక్కడా లేని విధంగా పెద్ద సంఖ్యలో అక్రమ కేసులు బనాయించారు. అందులో ఎస్సీ, ఎస్టీ కేసులతో పాటు హత్నాయత్నాల ఆరోపణలపైనా కేసులు పెట్టడం గమనార్హం.

హైకోర్టు మొట్టికాయలు

అబ్బాయ్ అక్రమాలు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వరకు పాకాయి. అక్రమ మైనింగ్‌పై దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం కింద దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు అప్పట్లో స్పందించింది. అబ్బాయ్‌తోపాటు బంధువులు, బినామీలను బాధ్యులుగా చేర్చి నోటీసులు జారీచేసింది. అబ్బాయ్ పేరుతో కిలోమీటర్ల మేర భారీగా జరిగిన చెరువులు, మట్టి తవ్వకాల పుణ్యమాని గ్రామాలకు గ్రామాలు వాడిపోతున్నాయి. నియోజక వర్గంలోని పలు మండలాల్లోని ఒకటికి మించిన సర్వే నెంబర్లలో జరిగిన తవ్వకాలపై ఆ నియోజక వర్గం నుంచే సామాజిక బాధ్యత కలిగిన కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన హైకోర్టు పిటిషన్‌లో దాఖలైన పలువురికి నోటీసులు జారీ చేసి, కొంత సమయం ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని, తక్షణమే తవ్వకాలు నిలిపివేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో స్థానికంగా అబ్బాయ్‌తోపాటు ఆయన సామంతరాజులుగా నియమించుకున్న పలువురినీ బాధ్యులను చేసింది. దీంతో ఆయన పరువు మట్టి కరిచింది.

బీ గ్యాంగ్ చేతివాటం

అబ్బాయికి స్వామిభక్తి చూపించే ఇద్దరు అనుచరులు తమదైన శైలిలో చెలరేగిపోతున్నారు. భూకబ్జాలు, దందాలు, బెదిరింపులు, సెటిల్‌మెంట్లలో ఎక్కడా గ్యాంగ్‌బీ కూడా తగ్గడం లేదు. రాజుల సామాజికవర్గానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు సంబంధించిన సుమారు పదెకరాల భూమిని లాక్కున్నారు. తొలుత సెటిల్మెంట్ పేరుతో చొరవ చూపిన నాయకులు, ఆనక అన్నదమ్ములను బెదిరించి చివరకు పొలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదేమిటని అడిగితే... బెదిరించి నోళ్లు మూయించారు.

నోరు తెరిస్తే బూతుల పంచాంగం

అధికారం చేజిక్కినినాటి నుంచి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరులకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. సోషల్ మీడియా వేదికగా అసభ్య పదజాలలతో పోస్టింగులు, బూతులు తిడుతూ ఫొటోలు, వీడియోలు పెడుతున్నారు. ఆ పోస్టింగులపై ఎవరైనా ప్రశ్నిస్తే అగ్గిమీద గుగ్గిలం అవుతారు. చావకొట్టడం, ఆస్తులు ధ్వంసం చేయడం, తలలు పగల కొట్టడం ఆగరు.. బాధితులపైనే రివర్స్‌లో హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించి, మానసికంగా, ఆర్థికంగా కుంగదీస్తారు. దాదాపు ఏడాదిన్నర క్రితం నియోజకవర్గంలో జరిగిన ఓ ఘటనే ఇందుకు తార్కాణం. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై ప్రశ్నించాడని ఓ వ్యక్తిని, అతనికి మద్దతిచ్చిన ఓ విద్యార్థి నాయకుడిని టార్గెట్ చేసుకున్న ఆ అనుచరులు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రత్యక్ష భౌతిక దాడులకు దిగారు. సుమారు 300 మంది కలిసి జరిపిన ఆ దాడిలో పలువురు తీవ్రంగా రక్త గాయాల పాలయ్యారు. చివరకు.. ఆ విద్యార్థి నాయకుడు, అతని మద్దతుదారులైన 14 మందిపెనా హత్యాయత్నం, అట్రాసిటీ కేసులు నమోదు చేయించారు. ఆ యావత్ ఘటనలో ఓ పోలీస్ ఉన్నతాధికారి.. ఎమ్మెల్యే అనుచరులను సపోర్ట్ చేస్తూ ఆ కేసులు నమోదు చేశారన్న ఆరోపణలు ఇప్పటికీ వినిపిస్తుంటాయి. అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నారనే నెపంతో నియోజకవర్గంలో చాలా మందిపై హత్యాయత్నాలు జరిగాయి.



శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం తహసీల్దారు కార్యాలయం వద్ద షోకాజ్ నోటీసులను భోగిమంటల్లో తగలబెడుతున్న అంగన్వాడీలు

పండుగ వేళా.. పట్టు విడవక!

- 33వ రోజూ సమ్మెలోనే అంగన్వాడీలు
- జోరుగా ఆందోళన కార్యక్రమాలు
- పండుగ తర్వాత రాష్ట్ర బంద్ చేస్తాం: సీపీఐ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

పండుగయినా.. వెనక్కి తగ్గేది లేదని, ఎస్మా ఉత్తర్వుల్ని భోగి మంటల్లో వేస్తామని అంగన్వాడీలు ప్రకటించారు. 33వ రోజైన శనివారం రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. పలు జిల్లాల్లో నిరసన శిబిరాల వద్ద అంగన్వాడీలు తమ డిమాండ్లను సంక్రాంతి ముగ్గుల రూపంలో వేసి నిరసన తెలిపారు. 'జగనన్నకు చెబుదాం' అంటూ సంతకాల సేకరణను కూడా ప్రారంభించారు. పార్వతీపురం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు 33వ సంఖ్య ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. సాలూరులో భోగి మంటలు వేసి, సీతానగరంలో ఉరి తాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. గరుగుబిల్లిలో ధర్నా చేశారు. 'సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్రప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ఇలాగైతే మేము మట్టి తిని బతకాలా..' అంటూ నంద్యాల జిల్లా ఆత్మకూరులో అంగన్‌వాడీలు మట్టి తింటున్నట్టుగా నిరసన వ్యక్తం చేశారు. కడప కలెక్టరేట్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. జమ్మలమడుగులో ఎస్మా ప్రతులను తలపై పెట్టుకుని నిరసన తెలిపారు. మంత్రులు, సజ్జల ఫొటోలు పట్టుకుని కొండాపురంలో నిరసన తెలిపారు. చర్చలకు పిలిచి ఒట్టి చేతులతో పంపుతారా అంటూ పోరుమామిళ్లలో జగన్, బొత్స మాస్కులు ధరించిన వారిని వేపమండలతో కొడుతూ నిరసన తెలిపారు. ఎర్రగుంట్ల, మైదుకూరులో పొర్లుదండాలు పెట్టారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో గుంజీలు తీసి నిరసన తెలిపారు. తంబళ్లపల్లె, లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటిలో అంగన్వాడీల ఆందోళన కొనసాగింది. అనంతపురం కలెక్టరేట్ వద్ద, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం తహసీల్దారు కార్యాలయం వద్ద షోకాజ్ నోటీసులను అంగన్వాడీలు భోగి మంటల్లో వేసి దహనం చేశారు.

పండుగ తర్వాత శిబిరాల్లోకి ప్రతిపక్షాలు

అంగన్వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే పండుగ తరువాత రాష్ట్ర బంద్ నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చెప్పారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల దీక్షా శిబిరంలో శనివారం ఆయన మాట్లాడారు. పండుగ వరకూ చూస్తామని, ఆ తర్వాత పది వామపక్షాలు, తెలుగుదేశం, జనసేన, కాంగ్రెస్‌తో కలసి సమ్మె శిబిరాల్లో కూర్చొని నిరసనలు తెలుపుతామని చెప్పారు. అయినా ప్రభుత్వం దిగిరాకపోతే రాష్ట్ర బంద్‌కు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. కాగా, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే వైసీపీ ప్రభుత్వంపై అంగన్‌వాడీలు భస్మాసుర అస్త్రం ప్రయోగిస్తారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కర్నూలులో మీడియా సమావేశంలో హెచ్చరించారు.

ప్రభుత్వం తొలగిస్తే... తిరిగి నియమిస్తాం!

- అంగన్వాడీలకు లోకేశ్ హామీ

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): 'అంగన్వాడీలను ప్రభుత్వం తొలగించినా ఎవరూ భయపడాల్సిన పని లేదు. రాబోయే టీడీపీ, జనసేన ప్రభుత్వం తిరిగి వారిని ఉద్యోగాల్లో నియమిస్తుంది' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈమేరకు శనివారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'అంగన్వాడీలపై తాడేపల్లి ప్యాలెస్ బ్రోకర్ సజ్జల బెదిరింపులకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అధికార మదం తలకెక్కి, కండకావరంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న జగన్ సర్కార్‌ను ఎప్పుడు ఎన్నికలు జరిగినా బంగాళాఖాతంలో కలిపేందుకు జనం సిద్ధంగా ఉన్నారు. అంగన్వాడీలను ఉద్యోగాల నుంచి తొలగించినా, రాబోయే ప్రభుత్వం వారిని తిరిగి నియమిస్తుంది' అని పేర్కొన్నారు.

నాలుగేళ్ల తర్వాత నా గడ్డకొచ్చా

- ఈ అనుభూతిని మరవలేను: రఘురామ

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), పెనుగొండ, జనవరి 13: "నాలుగేళ్ల తర్వాత సొంత గడ్డమీద అడుగుపెట్టడం ఎంతో సంతోషంగా ఉంది. మాటల్లో చెప్పలేని అనుభూతి కలిగింది. తెలుగుదేశం నేతలు, జనసైనికులు అందరూ ప్రేమతో చూపించిన ఆదరణను నా జీవితంలో మర్చిపోలేను. టీడీపీ, జనసేన అభ్యర్థిగా 2024 ఎన్నికల్లో పోటీ చేస్తాను" అని వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. వైసీపీ అధినేత, సీఎం జగన్‌తో విభేదాల వల్ల వివిధ రకాల కేసులకు గురైన రఘురామ సుమారు నాలుగేళ్ల నుంచి ఢిల్లీలో ఉండిపోయారు. కొద్దిరోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన కోర్టు అనుమతి తీసుకుని నియోజకవర్గానికి వచ్చారు. శనివారం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. అక్కడనుంచి ఆయన నరసాపురం చేరుకున్నారు. ఆయనకు భారీ పోలీసు భద్రత కల్పించారు. వందలాది మంది వివిధ పార్టీ నేతలు, అభిమానాలు ఆయనకు స్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. సింహం జిందాబాద్, సింహం నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అనంతరం ఆయన రావులపాలెం మీదుగా పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్లారు. "నన్ను జైలులో పెట్టినప్పటి నుంచి చంద్రబాబు అందించిన సహకారం, లోకేశ్ ఇచ్చిన మద్దతు, పవన్ కల్యాణ్ ఇచ్చిన సహకారం జీవితంలో మర్చిపోలేను. కష్టంలో ఉన్నప్పుడే మనకు మనవాళ్లెవరో, పరాయివాళ్లెవరో అర్థమవుతుంది. ఇక్కడ ఇంత ఆదరాభిమానాలతో స్వాగతం పలకడం నా జన్మ ధన్యమనిపించింది. గతంలో జరిగిన సంఘటన దురదృష్టం, కష్టకాలంలో కూడా రాలేకపోయాను. ఇవాళ కోర్టు ప్రొటెక్షన్‌తో వచ్చాను. పోలీసులు కూడా బాగా సహకరిస్తున్నారు. రాబోయే రోజులన్నీ మంచివే" అని ఆయన అన్నారు.

సొంత గడ్డ స్వాగతం...

రావులపాలెం నుంచి ర్యాలీగా వచ్చిన రఘురామరాజుకు పశ్చిమగోదావరి జిల్లా దొంగరావిపాలెం వద్ద టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి సొంత జిల్లాలో అడుగు పెట్టకుండా ప్రజలకు సేవలు చేయనివ్వకుండా అడ్డంకులు కల్పించిందన్నారు. దాదాపు నాలుగేళ్లు వనవాసం చేయించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని సవాల్ చేస్తూ వాటన్నింటిని అధిగమించి సొంత గడ్డపై అడుగు పెట్టానని తెలిపారు. దొంగరావిపాలెం మీదుగా ర్యాలీ సిద్ధాంతం, రామన్నపాలెం, వడలి, పెనుగొండ మీదుగా సాగింది. జనసేన, టీడీపీ నాయకులు భారీగా మోటారు సైకిళ్లు, కార్లతో ర్యాలీగా భీమవరం బయలుదేరి వెళ్లారు. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మెంటే పార్థసారథి, జనసేన నాయకులు బొమ్మిడి నాయకర్, చేగొండి సూర్యప్రకాశ్, యర్రగొప్పుల నాగరాజు, శిరిగినీడి రాజ్యలక్ష్మి ఉన్నారు.

అగ్ని కీలల్లో మెగా ఫుడ్‌పార్క్

- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం
- సుమారు 70 కోట్లు నష్టం అంచనా...
- మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కురిచేడు, జనవరి 13: ప్రకాశం జిల్లా కురిచేడు మండలం ముష్టగంగవరం సమీపంలో ఉన్న ఎస్‌హెచ్ మెగా ఫుడ్‌పార్క్‌లో శనివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో భారీ షెడ్, యంత్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం రూ.70 కోట్లు నష్టం జరిగి ఉంటుందని అంచనా. షార్ట్ సర్క్యూటే కారణమని తెలుస్తోంది. రెండేళ్ల నుంచి గుండ్లకమ్మ నది పక్కనే 60 ఎకరాల్లో ఈ మెగా ఫుడ్ పార్క్ నడుస్తోంది. ఇక్కడ కోడిగుడ్లలో ఉండే తెల్ల సొన, పచ్చ సొనను వేరుచేసి పాశ్చరైజేషన్ చేసి ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడే కోళ్లను కూడా ప్రాసెస్ చేసి ఎగుమతి చేసే యంత్రాలు ఉన్నాయి. శనివారం సాయంత్రం సిబ్బంది పనులు ముగించుకొని 5.30 గంటలకు బయటకు వచ్చారు. సాయంత్రం 6.30 సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు సమాచారం. భారీ షెడ్ కావడంతో రాత్రి 8 గంటల వరకూ ఎవరూ గుర్తించలేదు. ప్రమాదాన్ని పసిగట్టిన వెంటనే దర్శి, వినుకొండ, పైపాలెం అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇచ్చారు. వినుకొండ నుంచి వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేసే ప్రయత్నాలు ప్రారంభించారు. అప్పటికే కోట్లు విలువ చేసే యంత్రాలు దగ్ధమయ్యాయి. భారీ షెడ్డు నేలకూలింది. షెడ్డు పక్కనే ఉన్న భారీ గ్యాస్ ట్యాంకర్లకు మంటలు తాకకుండా అగ్నిమాపక సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పెద్దప్రమాదం తప్పింది. ప్రమాద తీవ్రతకు షెడ్డు కూలిపోతుండడంతో అగ్నిమాపక సిబ్బందికి కూడా లోపలికి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. కోడిగుడ్లు ప్యాక్ చేసే అట్టపెట్టెలు ఎక్కువగా ఉండటంతో మంటలు అదుపులోకి రాలేదు. ఆదివారం ఉదయానికి మాత్రమే పూర్తి స్థాయి నష్టం అంచనా తెలుస్తుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు



దగ్ధమవుతున్న ఫుడ్ పార్క్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

తెలుగువారు అధికశాతం పండుగలను, పర్వదినాలను చాంద్రమానాన్ని అనుసరించి జరుపుకొంటారు. కానీ మకర సంక్రాంతిని మాత్రం సౌరమానం ప్రకారం నిర్వహిస్తారు. సూర్యుడు ఒక రాశి నుంచి మరొక రాశికి ప్రవేశించే రోజు సంక్రమణం లేదా సంక్రాంతి. ఏడాదిలో పన్నెండు సంక్రాంతులు వస్తాయి. సూర్యుడు ధను రాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించిన రోజు... మకర సంక్రాంతి. ఇది సంక్రాంతులన్నిటిలోనూ ముఖ్యమైనది, పరమ పవిత్రమైనది. సూర్యుడు ఉత్తర దిశగా పయనాన్ని ప్రారంభించే సమయం... ఉత్తరాయణ పుణ్యకాలం. సాధారణంగా ఇది పుష్యమాసంలో వస్తుంది.

నవ్య క్రాంతి



విశేషం

మన పండుగలన్నీ ఒకటి, మూడు, అయిదు, తొమ్మిది రోజుల పాటు జరుపుకొనేవి. ఆ లెక్కన చూస్తే... సంక్రాంతిని నెల రోజుల పండుగగా చెప్పవచ్చు. రవి ధనూరాశిలో ప్రవేశించిన రోజు నుంచి మకర రాశిలోకి అడుగుపెట్టేవరకూ... ధనుర్మాసం. తిరుప్పావై పారాయణలు, ప్రతి ఇంటి ముంగిటా ముగ్గులతో ఈ నెలంతా శోభాయమానంగా ఉంటుంది. ఆరుగాలం శ్రమించిన రైతుల ఇళ్ళకు... వారు పండించిన వరి, తృణ ధాన్యాలు చేరుకుంటాయి. అప్పటివరకూ పొలాల్లో పని చేసిన పశుగణం అలసట తీర్చుకుంటూ ఉంటుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అందరూ సకుటుంబంగా కాలం గడిపే రోజులివి. ఈ నెల రోజులూ ముగ్గులు తీర్చి, వాటి మధ్యలో గొబ్బెమ్మలను పేర్చి, లక్ష్మీదేవిని కీర్తిస్తూ మహిళలు గొబ్బి పాటలు పాడతారు.

సంక్రాంతి మూడు రోజుల పండుగ. తొలి రోజు భోగి. అంటే భోగాన్ని ఇచ్చేది. ఇది దక్షిణాయణానికి చివరి రోజు. భోగి మంటలతో ప్రతి వీధి ప్రకాశిస్తుంది. ఈ రోజున వేకువజామునే అభ్యంగన స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి, ఇష్టదైవాలను పూజించి, పెద్దల దీవెనలు పొందాలనేది శాస్త్ర వాక్యం. ఇదే రోజున... శ్రీవ్రతాన్ని పూర్తి చేసిన గోదాదేవి శ్రీరంగనాథునిలో ఐక్యమై, సమస్త భోగాలనూ అందుకుంది. అందుకే ఈ రోజును 'భోగి'గా వ్యవహరిస్తారు. సాయంత్రం చిన్న పిల్లలకు భోగి పండ్లు పోయడం, బొమ్మల కొలువులు పెట్టి పేరంటాలు జరపడం, ముత్తయిదువుల ఆశీస్సులు పొందడం తెలుగునాట ఆనవాయితీ. వైష్ణవ ఆలయాల్లో గోదా కళ్యాణాన్ని నిర్వహిస్తారు.

రెండో రోజు ప్రధానమైన పండుగ. తెలుగువారి పెద్ద పండుగ... మకర సంక్రాంతి. ఈ రోజు కూడా అభ్యంగనస్నానాది విధులతో పాటు... పితృదేవతలకు తర్పణాలు విడుస్తారు. గుమ్మడి పండ్లను వస్త్ర తాంబూలాలతో దానం చేస్తారు. అందుకే దీన్ని 'పెద్దల పండుగ' అని కూడా అంటారు. గృహిణులు పసుపు కుంకుమలతో శ్రీమహాలక్ష్మిని అర్చించి, ఫల పుష్పాదులు సమర్పిస్తారు. వాటిని ముత్తయిదువులకు పంచి... దీవెనలు అందుకుంటారు. వ్యవసాయంలో తమకు సాయపడినవారికి రైతులు ధన, ధాన్య, వస్త్ర రూపంలో కానుకలను అందజేస్తారు. ఈ రోజునే శబరిమలలో అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం భక్తులకు లభిస్తుంది.

మూడో రోజు కనుమ. ఇది కర్షకుల పండుగ. పశువుల కొట్టాల్ని కడిగి, పశువులకు స్నానం చేయిస్తారు. కొత్త వరి బియ్యంతో పులగం చేసి... వాటికి ప్రసాదంగా పెడతారు. మిగిలినది పొలాల్లో జల్లుతారు. దీన్నే 'పొలి చల్లడం' అంటారు. వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉన్న పశుగణానికి ఆ విధంగా కృతజ్ఞతలు తెలుపుతారు. మకర సంక్రాంతి మన సనాతన సంస్కృతి సంప్రదాయాలకు, ఆధ్యాత్మికతకు ప్రతీక. లోకానికి నవ్య క్రాంతి. ప్రకృతిలోని పంచభూతాలకూ కృతజ్ఞతలు తెలుపుకొనే వేడుక.



ముగ్గుల్లో ఆరోగ్యం

కేవలం ఆధ్యాత్మికత మాత్రమే కాదు... ఆరోగ్యపరమైన అంశాలు కూడా ఇమిడి ఉండడం మన పండుగల ప్రత్యేకత. సంక్రాంతి ముగ్గులు కూడా ఆ కోవలోకే వస్తాయి. ధనుర్మాసం ముగిసిన తరువాత సంక్రాంతి వస్తుంది. ధనుర్మాసం నెల రోజులూ ముగ్గులు వేయడం మన సంప్రదాయం. ఈ మాసంలో శీతాకాలం తీవ్రంగా ఉంటుంది. క్రిములు, కీటకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. ముగ్గుల ద్వారా వాటిని నిరోధించవచ్చు. ముగ్గులు వేయడం కోసం ఇంటి ముందు పేడ నీళ్ళతో కళ్లాపు జల్లుతారు. ముగ్గు వేయడానికి వరిపిండిని ఉపయోగిస్తారు. గడపలకు పసుపు రాస్తారు. పసుపు, పేడ క్రిమినాశకాలు. అలాగే క్రిములు, పురుగులకు వరిపిండి ఆహారం. వాటి ద్వారా క్రిములు, చిన్న పురుగులు ఇళ్ళలో ప్రవేశించకుండా ఉంటాయి.

వంటింటి చిట్కాలు

- కూరగాయల ముక్కల్ని పసుపు నీటిలో ఉంచితే క్రిములు నశిస్తాయి.
- బొద్దింకలు తిరిగే స్థలాల్లో బేకింగ్ సోడా, చక్కెర కలిపి చల్లితే బొద్దింకలు రావు.
- బంగాళదుంప, క్యారెట్.. ఇలా ఏ దుంపలనైనా ఉప్పు నీటిలో నానబెట్టి ఉడికిస్తే త్వరగా ఉడుకుతాయి.



- ఎక్కువ కాలం అయినా నెయ్యి తాజాగా, మంచి వాసన వచ్చేట్లు ఉండాలంటే కాచేప్పుడు తమలపాకు వేస్తే సరి.
- పల్లీలు వేయించేప్పుడు కొద్దిగా నీళ్ల చల్లి వేయిస్తే పొట్టు త్వరగా ఊడిపోతుంది.
- శనగపిండిలో పెరుగు కలిపి పకోడీలు వేస్తే మెత్తగా ఉంటాయి.

చర్మానికి తగినట్లు...

చలికాలంలో చర్మం మీద పగుళ్ల ఏర్పడుతాయి. అందం దెబ్బతింటుంది. చర్మకాంతి మాయమవుతుంది. బిరుసు అవుతుంది చర్మం. ఇలాంటి పరిస్థితుల్లో మాయిశ్చరైజింగ్ విషయంలో కొన్ని టిప్స్ పాటించాలి..

- చర్మం జిడ్డుగా ఉండే వారికి చర్మం మరింత సున్నితంగా ఉంటుంది. ఇలాంటి వారు కేవలం ఆయిల్ బేస్డ్ లేదా జెల్ బేస్డ్ మాయిశ్చరైజర్‌ను మాత్రమే ఉపయోగించాలి.
- సాధారణ చర్మం ఉండేవారికి మరీ జెల్ బేస్డ్, ఆయిల్ బేస్డ్ మాయిశ్చరైజర్ అవసరం లేదు. మామూలు స్కిన్ లోషన్ కూడా బాగా పని చేస్తుంది.
- కొందరి చర్మం పగుళ్ల బారినట్లు ఉంటుంది. దీన్నే డ్రై స్కిన్ అంటారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే చర్మం మీద ముడతలు వస్తాయి. అందువల్లే దీనికి ఆయిల్ బేస్డ్ మాయిశ్చరైజర్ కచ్చితంగా ఉపయోగించాలి. పొడిచర్మానికి సాధారణ మాయిశ్చరైజర్‌ను ఉపయోగిస్తే సరిపోతుంది.
- ముఖ్యంగా ఎక్కువగా ప్రయాణాలు వెళ్లేవారు, ఎండలో తిరిగేవారు సైతం వారి చర్మం త్వరగా పాడవుతుంది. వాటర్ బేస్డ్ మాయిశ్చరైజర్స్ దగ్గర పెట్టుకోవటం మంచిదే.



- చర్మంలో ముఖంమీద ఉండే చర్మం మాత్రం సున్నితంగా ఉంటుంది కాబట్టి పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా మంచి డైట్ చేయాలి. తినే ఆహారంలో సి-విటమిన్ ఉండేట్లు చూసుకోవాలి. తాజా ఆకుకూరలు, పండ్లు తినాలి. అంతేనా నారింజ, బొప్పాయి.. లాంటి ఫేస్‌ప్యాక్స్ వేసుకోవటం వల్ల సహజంగానే చర్మం అందంగా తయారవుతుంది. కాంతివంతమవుతుంది.



తెలుగునాట కన్నడ హీరోయిన్ల హవా మళ్లీ పెరుగుతోంది. తాజాగా 'నాసామిరంగ'లో హీరో నాగార్జున సరసన నటించిన అషిక రంగనాథ్ కూడా కన్నడ హీరోయినే! శాండిల్‌వుడ్‌లో విజయాలు సాధించి... టాలీవుడ్‌లో అడుగుపెట్టిన అషికను 'నవ్య' పలకరించింది.

సండే సెలబ్రిటీ

పల్లెల్లో ఊరంతా పండగే

సంక్రాంతి ఎలా జరుపుకొంటున్నారు?

'నా సామిరంగ' విడుదల కోసం చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నా. టాలీవుడ్‌లో అడుగు పెట్టిన తర్వాత ఇది నాకు తొలి సంక్రాంతి. మాది కర్ణాటక. బెంగళూరులో పెరిగాను. కర్ణాటకలో సంక్రాంతి ఘనంగా జరుపుకొంటాం. కానీ తెలుగువారి సంక్రాంతి భిన్నంగా ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడ సినిమాల కోసం ఎదురు చూడటం... వాటి గురించి మాట్లాడుకోవటం... కలెక్షన్స్ లెక్కలు వేసుకోవడం... గొప్ప సినిమా ఉత్సవంలా చేసుకొంటారు. బెంగళూరులో అందరం కలిసేవాళ్లం. కలిసి భోజనాలు చేసేవాళ్లం. కానీ పల్లెటూళ్లలో పండగే వేరుగా ఉంటుంది. అక్కడ సంక్రాంతి అంటే ఊరంతా పండగ. పట్టణాల్లో కుటుంబాల పండగ.

> ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఉంటుందనేది కొత్త విషయం కాదు. అయితే అలాంటి పరిస్థితుల్లో మన వ్యక్తిత్వం ద్వారా ఎలాంటి మార్పు తీసుకురాగలుగుతున్నాం అన్నదే ముఖ్యం. నా ఉద్దేశంలో ఒక్క పరిశ్రమలోనే కాదు... మొత్తం సమాజంలోనే పురుషాధిక్యత ఉంది. అయితే ఈ మధ్యకాలంలో పరిస్థితులు బాగా మారుతున్నాయి.

మీరు సినిమాల్లోకి ఎలా వచ్చారు?

చిన్నప్పుడు ఎప్పుడూ సినిమాల్లోకి వస్తానని ఊహించలేదు. నేను చాలా సిగ్గరిని. ఎక్కువమంది ఉంటే మాట్లాడేదాన్ని కాదు. మా చెల్లి నాకు పూర్తి భిన్నం. ఎక్కడికైనా దూసుకుపోయేది. మంచి డ్యాన్సర్. దాన్ని చూసి నేను కూడా డ్యాన్స్ నేర్చుకున్నా. డ్యాన్స్ నాకు చాలా పాఠాలు నేర్పింది. ముఖ్యంగా ఆత్మవిశ్వాసం పెంచింది. నేను కూడా నెమ్మదిగా స్కూల్లో డ్యాన్స్ చేయటం మొదలుపెట్టా! మేమిద్దరం బాగా ఫేమస్ అయిపోయాం. మా డ్యాన్స్ లేకుండా ఏ కార్యక్రమం ఉండేది కాదు. కాలేజీలో కూడా ఇదే ఒరవడి కొనసాగింది. 'బెంగళూరు టైమ్స్'లో ఏటా 'ఫ్రెష్ ఫేస్' అనే ఒక పోటీ పెట్టేవారు. కాలేజీల నుంచి కొందరిని ఎంపిక చేసేవారు. అలా మా కాలేజీ నుంచి నేను పాల్గొని, పోటీలో గెలిచా. నా ఫోటోలు పేపర్లో చూసి.. నా కిష్టమైన నటుడు పునీత్ రాజ్‌కుమార్‌తో నటించే అవకాశం ఇచ్చారు. అలా నేను కన్నడ సినీ పరిశ్రమలో ప్రవేశించా.

సినిమాల్లోకి వచ్చిన తర్వాత కొత్తగా ఏం నేర్చుకున్నారు?

అనేక పాఠాలు నేర్చుకున్నా. మొదట్లో నేను నటించగలననే నమ్మకం ఉండేది కాదు. నన్ను నేను 70ఎంఎం స్క్రీన్‌పై చూసుకున్న తర్వాత... 'నేను కూడా నటించగలను' అనే విశ్వాసం కలిగింది. ఆ తర్వాత నెమ్మదిగా సినిమాలంటే ప్రేమ పెరిగింది. నా ఉద్దేశంలో నటన చాలా కష్టమైన కళ. ఏకాగ్రతతో పని చేయాలి. దానితో పాటుగా బలమైన వ్యక్తిత్వం కూడా ఉండాలి. అందరిలో ఒకరిగా ఉంటే కుదరదు. మనలో ఉన్న మంచి లక్షణాలన్నింటినీ బయటకు తీయాలి. ప్రతి షాట్‌లోనూ నేర్చుకోవటానికి ఏదో ఒకటి ఉంటుంది. నా ఉద్దేశంలో నటన ఒక పెద్ద ప్రయాణం.

> నా ఉద్దేశంలో సహజంగా ఉండటం చాలా కష్టం. నేను నాకు నచ్చిన విషయాన్ని చెబుతాను. చేస్తాను. అదే సమయంలో ఇతరుల అభిప్రాయాలను కూడా గౌరవిస్తా. వారికి ఇబ్బంది కలగకుండా చూసుకుంటా.

మీకు ఏ తరహా పాత్రలంటే ఇష్టం?

కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్ అంటే ఇష్టం. లవ్ డ్రామాలలో బాగా చేయగలనని అనిపిస్తుంది. ఇక చరిత్రకు సంబంధించిన పాత్రలు చేయటం చాలా కష్టమని నా అభిప్రాయం. ఎందుకంటే ఎప్పుడో ఒక కాలంలో జీవించిన వ్యక్తి గురించి తెలుసుకొని.. వాళ్ల వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా నటించటం చాలా కష్టమైన విషయం. ఇప్పటిదాకా నేను అలాంటి పాత్రలేమి చేయలేదు. కానీ అవి చాలా కష్టమనిపిస్తుంది.

కాలేజీ నుంచి నేరుగా సినీ పరిశ్రమలోకి వచ్చేశారు. ఇబ్బందికరమైన పరిస్థితులేమీ ఎదురవ్వలేదా?

> ప్రతి వృత్తిలోనూ చికాకు పెట్టే విషయాలు ఉంటాయి. సినిమాల్లోకి వచ్చిన తర్వాత బయటకు వెళ్లే అవకాశం ఎక్కువగా ఉండదు. ఎప్పుడైనా బయటకు వెళ్తే సెల్ఫీలు తీసుకోవటానికి అనేక మంది గుమ్మిగూడతారు. వాళ్లను వద్దని చెప్పలేం! ఆ సమయంలో మనకు మూడ్ బావుండకపోవచ్చు... ఆరోగ్యం సరిగ్గా ఉండకపోవచ్చు. అయినా నవ్వుతూ ఫొటోలు తీయించుకోవాల్సి ఉంటుంది.

నిజం చెప్పాలంటే నేను మొదట్లో ఎక్కువ శ్రమ పడాల్సిన అవసరం లేకుండానే సినీ పరిశ్రమలోకి వచ్చేశా. అయితే విజయం సాధించటానికి మాత్రం చాలా కష్టపడాల్సి వచ్చింది. నాలుగైదేళ్ల శ్రమ తర్వాత నాకు హిట్స్ వచ్చాయి. కన్నడలో ఉన్న పెద్ద హీరోల చిత్రాల్లో నటించగలిగా! ఈ క్రమంలో పెద్దగా ఇబ్బందులంటూ ఏమీ ఎదురుకాలేదు. కానీ నాలుగేళ్లపాటు నిరాశ చెందకుండా నిలదొక్కుకోవటమే కష్టమైన విషయం.

సోషల్ మీడియా ప్రభావం మీపై ఎలా ఉంది?

సోషల్ మీడియావల్ల మంచి ఉంది. చెడూ ఉంది. దాని ద్వారా ప్రచారం పొందటం సులభం. కానీ అది ఆరిపోయే వెలుగు మాత్రమే. మనం పది కాలాలు ఉండేలా నిలదొక్కుకోవాలంటే ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉండాలి. మనకు ఏది నప్పుతుందో అదే చేయాలి. ఇతరులను అనుకరించకూడదు. చాలా సందర్భాలలో సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాలను నమ్మి, ఇతరులను అనుకరించటం మొదలుపెడతారు. దీనివల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువగా జరుగుతుంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/X7C7OFZలో చదవండి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cqWSm4G లో చదవండి.

భరద్వాజీయం

ఆయన్ను చూసి నేర్చుకోవాలి

ఎన్టీ రామారావు గారి గురించి తెలుసుకొంటుంటే... ఆయన జీవితంలో ఎన్నో చిత్రవిచిత్రాలు కనిపిస్తాయి. ఆయనకు ఎప్పుడు ఏ మూడు వస్తుందో... ఏంచేస్తారో... ఎలా చేస్తారో ఎవరికీ అర్థంకాదు. 1961లో 'సీతారామకల్యాణం' తీయాలనే ఆలోచన ఎన్టీఆర్‌కు వచ్చింది. అందులో ఆయన రావణాసురుడుగా వేసి, హరనాథ్‌ను రాముడుగా, గీతాంజలిని సీతగా పెడదామనుకున్నారు. వెంటనే గురువుగారైన కేవీ రెడ్డి దగ్గరకు వెళ్లి, దర్శకత్వం చేయమని అడిగారట. 'నిన్ను రాముడుగా, కృష్ణుడుగా చూస్తారు కానీ రావణాసురుడుగా చూస్తారా? నేను నిన్ను అలా ఊహించుకోలేను... అలా తీయలేను' అని కేవీ రెడ్డిగారు అన్నారట. 'సరే... మేమే చేస్తాం' అని ఎన్టీఆర్ సినిమా మొదలుపెట్టారు. టీవీ రాజుతో ఆయనకు ఏదో తేడా వచ్చి... సంగీత దర్శకుడిగా ఎస్ రాజేశ్వరరావును తీసుకున్నారు. 'కానరావ కైలాసవాస' పాట రికార్డింగ్ అయ్యాక రాజేశ్వరరావు గారికి... ఎన్టీఆర్‌కు ఏదో పేచీ వచ్చింది. దాంతో ఎక్కడో ఉన్న తొలి తరం సంగీత దర్శకుడు గాలి పెంచల గారిని తీసుకువచ్చి ఆ సినిమాకు సంగీతం చేయించారు. అందులో పాటలు ఎంత సూపర్‌హిట్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఈ రోజుకు కూడా 'శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి' పాట ఏ పెళ్లికి వెళ్లినా వినిపిస్తూనే ఉంటుంది. ఆ పాట లేకుండా మన తెలుగింట ఏ పెళ్లీ జరగదు... ఏ పందిట్లోనూ సీతారామ కల్యాణం పూర్తి కాదు. అంత ప్రాచుర్యం పొందింది ఆ గీతం.

ఇక ఈ సినిమా విషయానికి వస్తే... రవికాంత్ నగాయిష్ గారిని కెమెరామన్‌గా పరిచయం చేశారు ఎన్టీఆర్. కైలాస పర్వతాన్ని ఎత్తే షాట్ తీయడానికి ఆయన ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించారట. ఆ చిత్రానికి దర్శకత్వంతో పాటు అన్నీ తానే అయ్యి నడిపించిన ఎన్టీఆర్ గారు... ఆ ఘనతను ఆయన తీసుకోలేదు. టైటిల్స్‌లో డైరెక్టర్‌గా యూనిట్ పేరు వేశారు. అలాగే 1962లో వచ్చిన 'గుళేబకావళి కథ'కూ ఆయనే దర్శకుడు. దానికి కూడా పేరు వేసుకోలేదు. 1966లో స్వీయదర్శకత్వంలో 'శ్రీకృష్ణ పాండవీయం' చేశారు. అందులో దుర్యోధనుడు, కృష్ణుడుగా ద్విపాత్రాభినయం చేశారు. దానికి కూడా దర్శకుడిగా తన పేరు పెట్టుకోవద్దని అనుకున్నారు. అప్పుడు పుల్లయ్య గారు... 'లేదు... మీరు పేరు వేసుకోవాలి' అని చెప్పారు. అందుకు ఎన్టీఆర్ గారు... 'నేను బీఏ చేశాను సార్. మూడేళ్లు కష్టపడి చదివితే ఆ డిగ్రీ వచ్చింది. అలాగే మూడు సూపర్‌హిట్స్ తీశాక కానీ టైటిల్‌లో దర్శకుడిగా నా పేరు వేసుకోకూడదని అనుకున్నా. ఇప్పటికి రెండు చిత్రాలు విజయవంతమయ్యాయి. ఈ సినిమా కూడా హిట్ అయితే, నాలుగో చిత్రానికి వేసుకొంటా. అప్పుడు నాకు డైరెక్టర్ డిగ్రీ వచ్చినట్టు' అని సమాధానమిచ్చారట. 'ఇది కూడా ఎలాగూ హిట్ అవుతుందిలే. పేరు వేసుకో' అని పుల్లయ్య గారు బలవంతం చేసి, 'శ్రీకృష్ణ పాండవీయం' చిత్రానికి డైరెక్టర్‌గా టైటిల్స్‌లో ఎన్టీఆర్ పేరు పెట్టేలా ఒప్పించారు.



ఒక దర్శకుడు అనేవాడు మూడు విజయాలు అందించాకనే దర్శకుడిగా తన పేరు వేసుకోవాలి అనేది రామారావు గారి అభిప్రాయం. అప్పటికే ఆయన వంద చిత్రాలు అయిపోయినట్టున్నాయి. అంత అనుభవం ఉండి కూడా పేరు వేసుకోవడానికి అంతగా ఆలోచించారు. ఇప్పుడైతే అప్రెంటీస్‌కు వచ్చిన మరుసటి రోజు నుంచే టైటిల్ కార్డులో పేరు పడాలనే తాపత్రయం. ఎన్టీఆర్ సొంతంగా, తన స్వహస్తాలతో కథ రాసుకొనేవారు. ఇవాళ అసిస్టెంట్లు కూడా రాసే పరిస్థితి లేదు. నొక్కుడు మిషన్లు వచ్చేశాయి. లేదంటే కంప్యూటరో, ఫోనో వాడేస్తున్నారు.

రామారావు గారి నుంచి మనం తెలుసుకోవాల్సినవి, నేర్చుకోవాల్సినవి... క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం. అసలు ఆయన ధైర్యం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. రాముడుగా, కృష్ణుడుగా జన నీరాజనాలు అందుకున్న నటుడు.. రావణాసురుడి పాత్ర చేయడం, కొత్తగా వచ్చిన హరనాథ్‌కు రాముడి వేషం ఇవ్వడం నిజంగా పెద్ద సాహసం. ఆ పాత్రలతో ప్రేక్షకులను కూడా మెప్పించడం ఆయనకే చెల్లింది. 'శ్రీకృష్ణ పాండవీయం'లో దుర్యోధనుడుగా ఎన్టీఆర్ డైలాగ్ డెలివరీ, వాచకం అద్భుతం. ఆయన పౌరాణిక చిత్రాల్లోని డైలాగులు ఏకపాత్రాభినయంగా ఇప్పటికీ ఏదో ఒక వేదికపై వినిపిస్తూనే ఉంటాయి.

ఎప్పటి ఎన్టీఆర్.! ఎప్పటి సినిమాలు..! ఇప్పటికీ మన మనసుల్లో నిలిచిపోయాయంటే... ఆ స్థాయిలో ఉండేది నాడు ఆయన నటవిన్యాసం. మరి ప్రస్తుతం మనం అంతటి అంకితభావంతో సినిమాలు తీస్తున్నామా? సినిమా పూర్తి చేయడానికి సంవత్సరాలకు సంవత్సరాలు తీసుకొంటున్నాం. ఎన్టీఆర్‌ను చూడండి... దర్శకత్వం వహిస్తూ 1961లో ఒకటి, 62లో ఒకటి, 66లో ఒకటి చేశారు. ఇవికాకుండా మధ్యలో వేరే చిత్రాల్లో నటించేవారు. నిబద్ధత ఉంటే సమయం దానికదే వస్తుంది. ఇప్పుడు ఎవరో రాసిన స్క్రిప్ట్ డీటీపీ చేయించి, ప్రింట్లు తీస్తున్నాం. ఇవేవీ లేని ఆ రోజుల్లో అంత పెద్ద హీరో, దర్శకుడు, నిర్మాత అయ్యుండి... స్క్రిప్ట్ కోసం సమయం కేటాయించి, ఆయనే రాసుకునేవారు. ఎన్టీఆర్‌ను చూసి ఇలాంటివి ఎన్నో నేర్చుకోవాల్సినవి ఉన్నాయి. ఆయనొక్కరే కాదు... అలాంటి పెద్దవారిని గుర్తించి, వారి దగ్గరున్న మంచిని మనం గ్రహించాలి.

ఎస్ రాజేశ్వరరావు లాంటి సంగీత దర్శకుడు లేకపోయినా... గాలి పెంచల గారిని తీసుకువచ్చి, మధురమైన సంగీతం ఇచ్చారు ఎన్టీఆర్. కానీ ఇప్పుడేంటంటే విజయవంతమైన టెక్నీషియన్లు మాత్రమే కావాలి. ఈ మధ్యకాలంలో పెద్దపెద్ద వాళ్లను తెచ్చి.. 'ఫుల్ ప్యాడింగ్ ఉంది సార్' అంటున్నారు. ఎందుకంత ప్యాడింగ్? ఏ దర్శకుడైనా... కథను నమ్ముకోవాలి. తనను తాను నమ్ముకోవాలి. 'జనం మెచ్చుకొనేలా నేను తీస్తాను' అని సవాలుగా తీసుకొని చేయాలి. అలా సవాలుగా తీసుకునే... నాడు ఎన్టీఆర్ గారు మూడో హిట్ తరువాత గానీ దర్శకుడిగా తన పేరు వేసుకోనని చెప్పారు. 'ఉన్నవాళ్లు ఉంటారు... లేనివాళ్లు లేదు..' అని ధైర్యంగా సినిమా చేయాలి. ఎవరి కోసమో మన సినిమా ఆగదు. రామారావు, నాగేశ్వరరావు లేకపోతే తెలుగు చిత్ర పరిశ్రమ ఏమైపోతుందోనని అనుకున్నారు. తరువాత కృష్ణ, శోభన్‌బాబు... ఆ తరువాత చిరంజీవి, బాలకృష్ణ.. నాగార్జున, వెంకటేష్.. ఇలా తరాలు మారుతున్నట్టే కొత్త హీరోలు వస్తూనే ఉన్నారు. కనుక, రెండు సక్సెస్‌లు ఇచ్చాం కాబట్టి నేనే గొప్పని అనుకోకుండా... ఏ రోజుకారోజు కొత్త విషయాలు నేర్చుకొంటూ, మరింత వైవిధ్యంగా తీయాలన్న తాపత్రయం, తపనతో ముందుకు వెళ్లాలి. నిరంతరం సినిమా గురించే ఆలోచించాలి. అప్పుడే విజయం వరిస్తుంది.

• తమ్మారెడ్డి భరద్వాజ, దర్శకనిర్మాత

ఘనంగా పేరంటాలమ్మ జాతర ప్రారంభం

గుణదల, జనవరి 13: రామవరప్పాడు గ్రామంలో వేంచేసి ఉన్న వెంకమ్మ పేరంటాలమ్మ సంక్రాంతి జాతర మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 5గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో పాతూరి లోకేశ్వరి, పాలకమండలి ఛైర్మన్ బోయిన బానులు అమ్మవారికి భోగి పళ్లు పోశారు. ఇన్నర్‌రింగ్ రోడ్డుకు దిగువన రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద వాహన పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో వాహన పూజలు చేయించుకునేందుకు వాహనాలు బారులు తీరాయి. జాతర అనంతరం నిర్వహించే అన్న సంతర్పణకు గ్రామానికి చెందిన భక్తురాలు విన్నకోట నాగ వెంకట సాయి భావన రూ.35వేలు చెక్కు రూపంలో ఈవో లోకేశ్వరి అందజేశారు. వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ సీఐ బాలమురళీ పర్యవేక్షణ చేస్తున్నారు. మొక్కుబడులు చెల్లించుకునేందుకు చుట్టుపక్క గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆదివారం సాయంత్రం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో రామవరప్పాడు, ప్రసాదంపాడులో ఈనెల 18 వరకు ఊరేగించనున్నారు.

బిల్డర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

భారతీనగర్, జనవరి 13: బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) 2024 డైరీ ఆవిష్కరణ రమేష్ ఆసుపత్రి సెంటర్‌లోని బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి సెంటర్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు టి.పానకాల రావు (గోపి) ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ ఎస్.రమేష్ పాల్గొని డైరీ ఆవిష్కరించారు. డీలర్స్‌ని అసోసియేషన్ ఘనంగా సత్కరించారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్‌రా వు, వైస్ ఛైర్మన్ ఏ నాగమల్లేశ్వరరావు, బీఏఐ ఛైర్మన్ ఏపీ బి.రాఘవరావు, బీఏ ఐ సౌత్ జోన్ ఇంచార్జ్ వల్లభనేని వెంకటేశ్వర రావు, బీఏఐ నేషనల్ జనరల్ కౌ న్సిల్ మెంబర్ ఎం.పూర్ణచంద్రరావు, బీఏఐ అమరావతి సెంటర్ జనరల్ సెక్రటరీ బీఎస్‌కే పట్నాయక్ పాల్గొన్నారు.

బిజినెస్ సమ్మిట్‌కు లోకేష్‌ను ఆహ్వానించిన దూండీ


లోకేష్‌కు ఆహ్వానం ఇస్తున్న వుయ్ వైశ్యబృందం

భవానీపురం, జనవరి 13: విశాఖలోని చెన్న కన్వెన్షన్‌లో వుయ్ వైశ్య నిర్వహించబోయే ప్రతిష్ఠాత్మకమైన ఏపీ బిజినెస్ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా టీడీపీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూండీ రాకేష్ సారథ్యంలో వుయ్ వైశ్య బృందం శనివారం ఆహ్వానించింది. ఈ బృందంలో మాజీ గ్లోబల్ ప్రెసిడెంట్ అనిల్ పడకంటి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెసిడెంట్ మహేంద్ర, రాష్ట్ర కోర్ సభ్యులు తమ్మన రవి, సభ్యురాలు సంధ్యా దేవి ఆహ్వానం అందించిన వారిలో ఉన్నారు.

వస్త్రదుకాణంలో ఖరీదైన చీరలతో నలుగురు పరారీ

● మరో మహిళను పట్టించిన ఉప ముఖ్యమంత్రి కుమార్తె

గుణదల, జనవరి 13: బందర్‌రోడ్‌లోని పీవీపీ షాపింగ్ మాల్ సమీపంలోని గోలి హ్యాండ్లూమ్స్ షోరూమ్‌లో చీరలు కొనుగోలు చేసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి కుమార్తె కృపాలక్ష్మి శనివారం వచ్చారు. ఆమె షాపులో చీరలు చూస్తుండగా పక్కనే మరో ఐదుగురు మహిళలు కృపా లక్ష్మిని చీరలు సెలక్షన్ చేసుకోనీయకుండా ఖరీదైన చీరలు చూపించండంటూ కంగారు పెట్టేస్తుండటం గమనించింది. క్షణాల్లో నలుగురు మహిళలు కృపా లక్ష్మి చూస్తుండగానే ఖరీదైన చీరలతో చాకచక్యంగా బయటికి వెళ్ళిపోయారు. ఇదంతా షాపు యజమాని ఇంటి నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తునే ఉన్నారు. ఆయన సదరు విషయాన్ని సిబ్బందికి కాల్ చేసి చెప్పేలోపుగానే నలుగురు మహిళలు అక్కడినుంచి వెళ్లిపోవడం జరిగిపోయింది. అయితే ఐదో మహిళ కూడా వెళ్లిపోయే ప్రయత్నం చేస్తుండగా కృపా లక్ష్మి సిబ్బందికి చెప్పి మాచవరం పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి మాచవరం సీఐ గుణరామ్ సిబ్బందితో చేరుకుని చీరను దొంగిలించిన మహిళను పట్టుకున్నారు. పరారీలో ఉన్న నలుగురు పట్టుబడ్డ మహిళను ఆధారంగా చేసుకుని పట్టుకునేందుకు బృందాలను ఏర్పాటు చేశారు. కృపాలక్ష్మి చూపిన తెగువను మా సిబ్బంది చూపలేకపోయారంటూ షాపు యజమాని ఆమెను అభినందించారు.

సర్వీస్ రూల్స్‌ను వెంటనే రూపొందించాలి

పటమట, జనవరి 13: ప్రజా ప్రయోజనాల దృష్ట్యా 2021 సెప్టెంబర్‌లో ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయంలో భాగంగా ప్రభుత్వంలో విలీనం కాబడిన ఎయిడెడ్ కళాశాల సిబ్బంది శనివారం బెంజిసర్కిల్‌లోని గౌతమ్ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 1995లో నియమింపబడిన ఎయిడెడ్ అధ్యాపకులను విస్మరించి, 2004-2008 ఏళ్ల మధ్య నియమింపబడిన ప్రభుత్వ అధ్యాపకులను ప్రిన్సిపాల్‌ను చేయడం ద్వారా విలీన అధ్యాపకులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని విలీన ఎయిడెడ్ సిబ్బందికి తక్షణమే నూరుశాతం సర్వీస్‌ను లెక్కిస్తూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సిబ్బందికి కల్పిస్తున్న అన్ని అవకాశాలు, సదుపాయాలు కల్పించాల్సిందిగా తీవ్ర అన్యాయానికి గురైన విలీన ఎయిడెడ్ అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బందికి తగిన న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. సమన్వయ కర్తలు డాక్టర్ పంకజ్ కుమార్, డాక్టర్ కెపి. ఇమ్మానియేల్, డాక్టర్ పాల్ దివాకర్ పాల్గొన్నారు.

ఐరాసా నిబంధనలకు ఇజ్రాయిల్ కట్టుబడాలి

● పాలస్తీనాకు అనుకూలంగా శాంతి ర్యాలీ

గవర్నర్‌పేట, జనవరి 13: పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ దేశం సాగిస్తున్న దాడులు అరికట్టాలని, ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజా సంఘాల వేదిక సంగమం, అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం, భారత స్నేహ సాంస్కృతిక సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం పాలస్తీనా సంఘీభావ శాంతి ప్రదర్శన జరిగింది. రాఘవయ్య పార్కు నుంచి ఎంజీ రోడ్డు, రాజగోపాలాచారి రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సంగమం కన్వీనర్ జమీందారు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు, జనసాహితి కార్యదర్శి దివికుమార్, భారత్ బచావో సంఘం కన్వీనర్ చిగురుపాటి భాస్కరరావు, ఏపీటీఎఫ్ నేత పాండురంగ వరప్రసాద్, ఐద్వా కార్యదర్శి డి.రమాదేవి, మహంకాళి సుబ్బారావు, మోతుకూరి అరుణ్‌కుమార్ ర్యాలీకి నేతృత్వం వహించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ నేత నక్కి లెనిన్‌బాబు, ప్రజానాట్యమండలి పి.చంద్రానాయక్, ఆర్ పిచ్చయ్య, ఇన్సాఫ్ కార్యదర్శి సయ్యద్ అఫ్సర్, జమయితే ఇస్లాం నేతలు ముషాహిద్ బేగ్, ఖమితా సల్మా, అమీర్ పాహద్ పాల్గొన్నారు.

కోడి పందాలకు తరలిస్తున్న నగదు.. మద్యం స్వాధీనం

గుణదల: సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి గోదావరి జిల్లాలకు కార్లు బారులు తీరాయి. తెలంగాణ నుంచి గోదావరి జిల్లాలకు తరలిపోతున్న కొన్ని కార్లను పటమట సీఐ కాశీవిశ్వనాథ్ అనుమానం వచ్చి ఎనికేపాడు జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఇలా పలు కార్లను తనిఖీ చేయగా ఒక కారులో తెలంగాణా నుంచి మద్యం సీసాలతో ఇరువురు వ్యక్తులు వెళుతుండగా వారిని వారి వద్ద ఉన్న మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే మరో కారులో ఇద్దరు వ్యక్తులు గోదావరి జిల్లాల్లో జరిగే కోడిపందాల్లో పాల్గొనేందుకు రూ 10లక్షల నగదుతో వెళుతున్నారు. వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

'గుంటూరు కారం' దళితులు బహిష్కరించాలి

వన్‌టౌన్, జనవరి 13: గుంటూరు కారం సినిమాలో దళితులను కించపరిచేలా పాత్రలు, సంభాషణలు ఉండడంపైన ఏఐఎం రాష్ట్ర సైనిక్ కన్వీనర్ లైక్వాండో శ్రీను శనివారం ఒక ప్రకటన పిలుపునిచ్చారు. సినిమాలో దళితులను, క్రైస్తవులను చిన్నచూపు చూపిస్తూ దృశ్యాలు ఉన్నాయన్నారు. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ భవిష్యత్తులో తన కుల అహంకారాన్ని తగ్గించుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, రాష్ట్రంలో తిరగనివ్వబోమని, అతని ఇంటి వద్ద ధర్నా చేస్తామన్నారు. దళితులు, క్రైస్తవులు గుంటూరు కారం సినిమాను బాయ్‌కాట్ చేయాలన్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్, రామజోగయ్య శాస్త్రి, హీరో మహేష్‌బాబులకు గుణపాఠం చెప్పాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటిదే పునరావృత్తమైతే తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు దళితులంతా సిద్ధం కావాలన్నారు.

బుద్దా వెంకన్నకు ఉండవల్లి శ్రీదేవి సత్కారం



వన్‌టౌన్, జనవరి 13: టీడీపీ నేతలు, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి శనివారం హైదరాబాద్‌లోని తన ఇంటికి ఉత్తరాంధ్ర టీడీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్నను సాదరంగా ఆహ్వానించారు. శ్రీదేవి ఇంటికి వెళ్లిన వెంకన్నకు సాదర స్వాగతం లభించింది. ఆయనకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. వారిద్దరి మధ్య సుహృద్భావ చర్చలు జరిగాయి.

పుంగనూరులో దాడి.. ముగ్గురు సీఐలపై కేసు

» బీసీవై కార్యకర్తను చెప్పుతో కొట్టిన ఘటనపై స్పందించిన ఎన్‌హెచ్ఆర్సీ


బీసీవై కార్యకర్తపైకి చెప్పు ఎత్తిన గంగవరం సీఐ కృష్ణమోహన్ (ఫైల్)

పుంగనూరు, జనవరి 13: చిత్తూరు జిల్లా పుంగనూరు సమీపంలోని చదళ్ల వద్ద పోలీసుల దాష్టీకంపై జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) స్పందించింది. భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ కార్యకర్తను చెప్పుతో కొట్టి పోలీస్‌స్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేసిన ఘటనలో పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలపై కేసు నమోదు చేసింది. చదళ్ల వద్ద శనివారం నిర్వహించాల్సిన బీసీవై పార్టీ ధర్మపోరాట సభ నిర్వహణకు శుక్రవారం ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు అనుమతి లేదని అడ్డుకున్నారు. దీంతో బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పలుమార్లు పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలు రాఘవరెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, కృష్ణమోహన్‌లతో రామచంద్రయాదవ్‌కు వాగ్వాదాలు జరిగాయి. యాదవ్‌ను అరెస్టు చేయాలని సీఐలు ప్రయత్నించగా.. బీసీవైపీ శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో పోలీసులు వారిని బలవంతంగా ఈడ్చుకుంటూ, కొడుతూ, కొందరి బట్టలు చింపివేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో బీసీవై కార్యకర్త వెంకటేశ్ జీపు ఎక్కలేదని గంగవరం సీఐ కృష్ణమోహన్ చెప్పుతో కొట్టి లాక్కెళ్లారు. చెప్పుతో కొట్టిన విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రాష్ట్ర మానవహక్కుల సంఘం జాయింట్ సెక్రటరీ టి.కరుణాకర్ యాదవ్ శనివారం న్యూఢిల్లీలోని జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. గంగవరం, పుంగనూరు, చౌడేపల్లె సీఐలు కృష్ణమోహన్, రాఘవరెడ్డి, ఎం.కృష్ణారెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చేసిన ఫిర్యాదుపై ఎన్‌హెచ్ఆర్సీ కేసు నమోదు చేసింది.


సత్తెనపల్లిలోని గోళ్ళమూడివారివీధిలో రోడ్డును మూసివేసిన దృశ్యం

మంత్రి అంబటి డాన్స్ కోసం రోడ్లు దిగ్బంధం

సత్తెనపల్లి జనవరి 13: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఈ నెల 14న భోగి వేడుకలు, మంత్రి అంబటి నృత్య ప్రదర్శన జరగనున్న నేపథ్యంలో శనివారం నుంచే ఆ ప్రాంతానికి వెళ్లే భవిరిశెట్టివారివీధి, గోళ్ళమూడివారివీధుల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి రోడ్లను దిగ్బంధనం చేశారు. రోడ్లను దిగ్బంధనం చేయడంతో ఈ ప్రాంతంలోని వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ గ్రామాల నుంచి గాంధీచౌక్, సంగం బజార్, గోళ్ళమూడివారివీధి, మహారాష్ట్ర వీధుల వైపు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మంత్రి డాన్స్ కోసం రోడ్లను దిగ్బంధనం చేసి వ్యాపారులు, ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని టీడీపీ నాయకుడు దివ్వెల శ్రీనివాసరావు విమర్శించారు.

ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు: సీఎస్

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న సత్యసాయి జిల్లా పాలసముద్రంలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... ప్రధాని పర్యటనకు పటిష్టమైన భద్రతా చర్యలతోపాటు పర్యటన విజయవంతానికి కట్టుదిట్టమైన, విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తాత్కాలికంగా ఖరారైన కార్యక్రమం మేరకు ఈ నెల 16న మధ్యాహ్నం ప్రధాని మోదీ పాలసముద్రం చేరుకుని స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని, అదేరోజు సాయంత్రం తిరిగి వెళ్లనున్నారని తెలిపారు. ప్రధాని పర్యటనలో సీఎం కూడా పాల్గొనే అవకాశం ఉన్నందున పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సత్యసాయి జిల్లా కలెక్టర్, ఎస్పీలను సీఎస్ ఆదేశించారు. భద్రత, రవాణా, వసతి, వైద్య సేవలు వంటివి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా ఆయా శాఖల అధికారులు చూడాలని ఆదేశించారు.

జూదాన్ని కట్టడి చేయాలి: పిల్లి

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా జరిగే జూదాలను ప్రభుత్వం కట్టడి చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు కోరారు. శనివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పండుగ పేరుతో జూదం విచ్చలవిడిగా జరుగుతోంది. గతంలో కొడాలి నాని కేసినో పెట్టి రూ.కోట్లు గడించారు. అమాయకులు సొమ్ములు పోగొట్టుకున్నారు. జూదాన్ని అరికట్టాలని కోరితే, టీడీపీ నేతలపై కేసులు పెట్టారు. జూదంతో అనేక కుటుంబాలు నాశనమైతున్నా.. ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. జగన్ వచ్చాక సంక్రాంతి సంబరం తెలుగు వారికి దూరమైపోయింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి, పేదలు పండుగ చేసుకునే పరిస్థితి లేదు. టీడీపీ హయాంలో 18 రకాల వస్తువులు పండుగ కానుకగా ఇస్తే, జగన్ అవన్నీ ఎత్తేశాడు' అని ఆరోపించారు.

సహకార ఎన్నికలు హుళక్కే!

» ప్రత్యక్ష ఎన్నికల ఊసెత్తని సర్కార్
» సొంత పార్టీ నేతలకు దొడ్డిదారిన పగ్గాలు
» కోర్టు ప్రశ్నించగా.. కోవిడ్ సాకుతో దాటవేత
» నాబార్డుతో ఒప్పందాన్నీ పట్టించుకోలేదు
» చివరి వరకూ అనధికార కమిటీలతో కాలక్షేపం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో సహకార ఎన్నికలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ప్రస్తుత ఆప్కాబ్, డీసీసీబీ, డీసీఎంఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను ప్రభుత్వం మరోసారి పొడిగించింది. దీంతో ఇక ఎన్నికలు నిర్వహించే యోచన జగన్ సర్కార్‌కు లేదని తేలిపోయింది. తాజాగా ప్రభుత్వం పొడిగించిన కమిటీలు జూలై 17 వరకు కొనసాగనున్నాయి. అయితే మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార పార్టీ నేతలతో నియమించిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు ఎన్నికల వేళ కొనసాగడం ప్రశ్నార్థకంగా మారింది. వైసీపీ ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిలో నియమించిన ఈ కమిటీలు రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కొనసాగడం సాధ్యం కాదని సహకార రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సహకార సంస్థలు కూడా రాజ్యాంగంలోని స్థానిక సంస్థల ఎన్నికల అధికరణం కిందకే వస్తాయని, ప్రత్యక్ష ఎన్నికల విధానం ద్వారా కాకుండా, ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో నియమించిన వ్యక్తులను సహకార సంస్థల్లో కొనసాగించడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని అంటున్నారు. పైగా ఒక రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు ఎన్నికలప్పుడు ఆయా పదవుల్లో ఉంటే, రైతు వర్గానికి రుణాలిస్తామని ప్రలోభపెట్టడం, లేదా తమ పార్టీకి అనుకూలంగా ఓటేయకపోతే రుణాలివ్వమంటూ బెదిరించే అవకాశం ఉంటుందన్న వాదన ఉంది. 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు అధికారేతర పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు ఉండరాదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేయడంతో అప్పటికప్పుడు ఈ కమిటీలను రద్దు చేసి, ప్రత్యేక అధికారులను నియమించారు. అయితే సార్వత్రిక ఎన్నికల వేళ సహకార సంఘాలకు నామినేటెడ్ కమిటీల కొనసాగించడమా? లేక కమిటీల్ని రద్దు చేసి, ప్రత్యేక అధికారులను నియమిస్తారా అనే దానిపై కేంద్ర ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. రాష్ట్రంలో సహకార సంస్థలకు దాదాపు ఐదేళ్లు ఎన్నికలు నిర్వహించని పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు. ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించకుండా, దొడ్డిదారిన సొంత పార్టీ వ్యక్తులకు అధికార పగ్గాలు కట్టబెట్టిన తీరు విమర్శల పాలైనా, ప్రభుత్వం ఎన్నికల ఊసెత్తడం లేదు. రాష్ట్రంలో అత్యధిక సహకార సంఘాల్లోని సభ్యులు ప్రతిపక్ష పార్టీల వైపు ఉన్నారనే కారణంగా ఎన్నికలు పెట్టడానికి ప్రభుత్వ పెద్దలు జంకారన్న విమర్శలూ ఉన్నాయి. సహకార ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని హైకోర్టు 2020లో ప్రశ్నిస్తే, కోవిడ్ ఉన్నందున ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించలేమని ప్రభుత్వం తెలిపింది. కోవిడ్ ప్రభావం తగ్గిన తర్వాత కూడా ఎన్నికల ఊసే ఎత్తలేదు. పైగా అనధికార పర్సన్ ఇన్‌చార్జి కమిటీల పేరుతో అధికార పార్టీ నేతలకు సహకార సంస్థల పగ్గాలు అప్పగించింది. టీడీపీ ప్రభుత్వంలో చివరి ఏడాదిన్నరలో పాత కమిటీలను కొనసాగించగా, వైసీపీ ప్రభుత్వం నామినేటెడ్ విధానంలో పార్టీ నేతలకు పదవులిచ్చింది. పీఏసీఎస్‌లకు ముగ్గురు, డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు ఏడుగురు, ఆప్కాబ్‌కు 13మందితో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలతో నడిపిస్తోంది. ప్రతి 6నెలలకూ ఈ కమిటీలను పొడిగిస్తూ కాలాన్ని నెట్టుకొచ్చింది. సహకార సంఘాలకు రుణాలిచ్చే నాబార్డు.. వైఎస్సార్ హయాంలో ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రెండేళ్లలో ప్రత్యక్ష ఎన్నికలు జరపాలనే నిబంధన ఉన్నా.. జగన్ సర్కార్ పట్టించుకోలేదు. సహకార చట్టాన్ని సవరించి, అధికారేతర కమిటీలతో సహకార సంస్థల్ని నడిపిస్తోంది. పైగా ఈ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులనూ అనుసరించకుండా, పర్సన్ ఇన్‌చార్జి కమిటీల్లో అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సిఫారసు చేసిన వారికి చోటు కల్పించారు. దొడ్డిదారిన పదవులు కైవసం చేసుకున్న నేతలు బోగస్ పత్రాలతో పెద్ద మొత్తాల్లో రుణాలు తీసుకుని, సహకార సంఘాలను మోసం చేశారు. ప్రతి జిల్లాలో బోగస్ రుణాల బాగోతం వెలుగులోకి వచ్చినా, సహకారశాఖ ఉన్నతాధికారులు 51,52 ఎంక్వైరీలు వేసినా, పూర్తిగా సొమ్ము రాబట్టలేకపోయారు. నిధులు దుర్వినియోగానికి ముఖ్య కారకుల్ని వదిలేసి, సహకార ఉద్యోగుల్ని బలి పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక పీఏసీఎస్‌లు, డీసీసీబీల్లో దాదాపు రూ.5వేల కోట్లు అక్రమార్కులు బొక్కేశారని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కేంద్ర మంత్రి అమిత్‌షాకు ఫిర్యాదు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం విచారణ పేరుతో కాలక్షేపం చేస్తూ, దోషులపై కనీస చర్యలూ తీసుకోలేదు. ఇలాంటి పరిస్థితులతో రాష్ట్రంలో సహకార వ్యవస్థ నిర్వీర్యం అవుతోందని సహకార రంగ ప్రముఖులు అభిప్రాయపడుతున్నా, ప్రభుత్వ పెద్దలకు చీమకుట్టినట్లు కూడా లేకపోవడం గమనార్హం.

బస్సు మంటల్లో మసైపోయి..

» గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా
» చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం
» స్థానికులు, పోలీసులు స్పందించడంతో తప్పిన భారీ ప్రాణనష్టం
» 37 మంది ప్రయాణికులు సురక్షితం.. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు స్వల్ప గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
» డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు


మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. 'రక్షించండి.. రక్షించండి' అంటూ ఆమె కేకలు వేసినా అగ్ని కీలలకు జడిసి ఎవ్వరూ లోపలికి వెళ్లే సాహసం చేయలేకపోయారు. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారకమైన ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటిగంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు. ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. 'కాపాడండి... కాపాడండి' అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేసుకోలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. మాలతి-శ్రీనివాస్ దంపతులకు సంతానం లేదు.. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లానని ఆయన చెప్పారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని భోరున విలపించారు. ఇంత మంది ప్రయాణికుల్లో ఎవరూ తన ఆడపడుచును కాపాడలేకపోయారని మాలతి తమ్ముడు వాసుదేవ్ భార్య రోదించడం అందరిని కలచి వేసింది. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వారిని కర్నూలులోని ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు ఐదున గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కొదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చెలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు. మరో ఏడుగురు గాయాలతో బయటపడ్డారు.

సరయూ నదీ తీరం జిగేల్

» రామమందిర ప్రారంభం సందర్భంగా వెలుగులు
» ముఖ్య కూడళ్లలో రామచరిత మానస్ శ్లోకాల హోర్డింగులు

అయోధ్య, జనవరి 13: అయోధ్యలో రామమందిరానికి ఈనెల 22న ప్రాణప్రతిష్ఠ జరపనున్న సందర్భంగా సరయూ నది తీరాన్ని ప్రమిదలు, బాణసంచా కాంతులతో జిగేల్ మనిపించనున్నారు. ఆలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 18 నుంచి ఆ ప్రాంతంలో ప్రైవేటు భవనాల నిర్మాణాలపై నిషేధం అమలు చేస్తున్నట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. భక్తులకు పర్యాటక ప్రదేశాల సమాచారం తెలియజేసేందుకు 250 మంది వరకు పోలీసు గైడ్‌లను నియమించినట్టు చెప్పారు. దీంతోపాటు డిజిటల్ టూరిస్ట్ యాప్‌ను ఆదివారం ప్రారంభించనున్నారు. అయోధ్యలో ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ విద్యుత్ కాంతులతో అలంకరించనున్నారు. నగరంలోని ముఖ్య కూడళ్లలో రామచరిత మానస్ శ్లోకాలతో హోర్డింగ్‌లను, తప్పిపోయినవారి కోసం 'లాస్ట్ అండ్ ఫౌండ్' కేంద్రాలను సమాచార శాఖ ఏర్పాటు చేయనుంది. అత్యాధునిక 4కే సాంకేతికతతో వివిధ డీడీ ఛానళ్లలో వివిధ భాషల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు కేంద్ర సమాచార, ప్రసారమాధ్యమాలశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర తెలిపారు. కాగా, అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి వెళ్లరాదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ నిర్ణయించారు. తనను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, అయోధ్య రామాలయ ట్రస్టు ప్రధానకార్యదర్శి చంపత్ రాయ్‌కు ఆయన శనివారం లేఖ రాశారు. ప్రారంభోత్సవం జరిగాక కుటుంబంతో కలిసి రామమందిరానికి వస్తానని లేఖలో ఆయన తెలిపారు.

జగన్‌కు సీఎం ఉద్యోగం ఇక 3 నెలలే

» ప్రజా సమస్యలపై దృష్టి సారించని ముఖ్యమంత్రి: రామకృష్ణ

అనంతపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): 'సీఎం జగన్‌కు ముఖ్యమంత్రి ఉద్యోగం ఇక మూడు నెలలే. ప్రజలు ఆయన ఉద్యోగాన్ని ఊడగొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అనంతపురం నగరంలో శనివారం మాట్లాడారు. 'జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. రైతుల విషయంలోనూ జగన్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. రూ.కోట్లు ఖర్చు చేసి ఆర్భాటపు ప్రకటనలను పత్రికల్లో వేయిస్తున్న జగన్.. ప్రజల సంక్షేమం పట్ల దృష్టి సారించడం లేదు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కరువు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో.. ప్రజలు గ్రామాలకు గ్రామాలు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, చెన్నై, కేరళ రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోతున్నారు. ఇలాంటి సంక్షోభ పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. సంక్రాంతి పండుగ బాగా జరుగుతోందని, వలసలేవీ లేవని సీఎం జగన్ చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 1.6 లక్షల మంది అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు న్యాయమైన డిమాండ్ల కోసం నెల రోజులకుపైగా ధర్నా చేస్తున్నా సీఎం జగన్‌కు చీమ కుట్టినట్లయినా లేదు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం సీఎం జగన్ నిరంకుశత్వానికి నిదర్శనం' అని రామకృష్ణ ఎద్దేవా చేశారు.

వైసీపీ నిర్లక్ష్యం.. ప్రాజెక్టుల పాలిట శాపం: లంకా దినకర్

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం కేంద్ర ప్రాజెక్టు పాలిట శాపంగా మారిందని బీజేపీ నాయకుడు లంకా దినకర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే లైన్లు, జాతీయ రహదారులకు రాష్ట్ర వాటా సొమ్ము కేటాయించక పోవడంతో వాటి వ్యయం 42 శాతం పెరిగిపోయిందని అన్నారు. జగన్‌రెడ్డి పాలనలో బాధ్యతా రాహిత్యం వల్ల రాష్ట్రంలోని 30 కేంద్ర ప్రాజెక్టులపై రూ.58 వేల కోట్లు అదనపు భారం పడిందన్నారు.

యావజ్జీవ శిక్ష పడేది జగన్‌కే: వర్ల

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులు పెట్టి, చంద్రబాబుకు యావజ్జీవ కారాగార శిక్ష పడుతుందని జగన్‌రెడ్డి పగటి కలలు కంటున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. ఏ సాక్ష్యాధారాలు లేవని కోర్టులు ఘోషిస్తున్న కేసుల్లో చంద్రబాబుకు యావజ్జీవ శిక్ష పడితే, 11 కేసుల్లో చార్జిషీట్లు వేసిన జగన్‌కి ఎన్ని యావజ్జీవ శిక్షలు పడాలని ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. '12 ఏళ్ల క్రితం జగన్‌పై వివిధ కేసుల్లో సీబీఐ 11 చార్జిషీట్లు వేసి, సాక్ష్యాలు కూడా కోర్టుకు సమర్పించింది. కోర్టు చార్జిషీట్లను పరిగణలోకి తీసుకుంది. అన్నీ నిరూపణ అయ్యాయి. ఈ అక్రమార్జన కేసుల్లో యావజ్జీవ శిక్ష పడేది జగన్‌రెడ్డికే. చంద్రబాబుపై పెట్టిన కేసుల్లో ఒక్కదానిలోనూ చార్జిషీట్ వేయలేదు. చంద్రబాబు తప్పులు కనపడలేదని కోర్టులు స్పష్టంగా చెప్పాయి. పోలీస్ శాఖే తప్పు చేసిందని కోర్టు చీవాట్లు పెట్టింది. జగన్‌పై 12 ఏళ్లుగా విచారణ జరపలేదు. జగన్ కేసులపై న్యాయ వ్యవస్థ ఆలోచన చేయాలి' అని వర్ల విజ్ఞప్తి చేశారు.

పల్లె పిలుస్తోంది రా.. కదలిరా..!

» సంక్రాంతికి తెలుగు ప్రొఫెషనల్ వింగ్ వినూత్న కార్యక్రమం

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను వినూత్నంగా నిర్వహించుకోనున్నట్లు తెలుగు ప్రొఫెషనల్ వింగ్ తెలిపింది. ఇందుకోసం 'పల్లె పిలుస్తోంది.. రా.. కదలి రా' అంటూ ఏపీలో ఒక కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఆది, సోమవారాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనుంది. 14న ఉదయం భోగి సందర్భంగా ఏపీకి పట్టిన కీడు తొలగాలని కోరుకుంటూ, సమస్యల ఫొటోలను భోగి మంటల్లో దహనం చేయనున్నారు. సాయంత్రం స్థానిక సమస్యలు, అభివృద్ధిపై తీర్మానాలు చేసి టీడీపీ గ్రామ అధ్యక్షుడికి సమర్పిస్తారు. ఓటరు వెరిఫికేషన్ కోసం హెల్ప్‌డెస్క్ కూడా ఏర్పాటు చేస్తారు. 15న ఉదయం సంక్రాంతి ముగ్గులు వేస్తారు.

ప్రజాయాత్రలో జగన్‌కు ఛీత్కారాలు తప్పవు: గంటా

విశాఖపట్నం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భీమిలి నుంచి ఈ నెల మూడో వారంలో ప్రజాయాత్ర ప్రారంభించనున్న సీఎం జగన్‌కు ప్రజల నుంచి ఛీత్కారాలు తప్పవని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. 'ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాలుగేళ్ల తొమ్మిది నెలల కాలంలో అన్ని విధాలుగా విఫలమైన జగన్... భీమిలి వచ్చే ముందు ఆత్మ పరిశీల న చేసుకోవాలి. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మునిగిపోతున్న నావలా తయారైన వైసీపీ నుంచి అనేక మంది బయటకు వెళుతున్నారు. బీసీ,ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు, నేతలను సీఎం పట్టించుకోవడం లేదు సరికదా... వారిని కలిసేందుకు కూడా ఇష్టపడడం లేదు' అని గంటా అన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 14 జనవరి 2024

నా మీద ఫైట్లు ఎందుకురా అనేవాడు

కోదండరామిరెడ్డి

నటభూషణ శోభన్‌బాబుకు అత్యంత సన్నిహితులైన దర్శకుల్లో ఎ.కోదండరామిరెడ్డి ఒకరు. 'ఏరా' అని ఆయన్ని ఆప్యాయంగా పలకరించేవారు శోభన్‌బాబు. 'ఏమయ్యా' అని ఆయన్ని పిలిచేవారు కోదండరామిరెడ్డి. 'మనుషులు మారాలి' చిత్రంతో మొదలైన వీరిద్దరి అనుబంధం చివరి వరకూ కొనసాగింది. తనకు ఆత్మీయుడైన శోభన్‌బాబు గురించి కోదండరామిరెడ్డి చెప్పిన విషయాలివి.





శోభన్‌బాబుతో నాకు ఎన్నో జ్ఞాపకాలు. చాలా మంచి వాడు. అందగాడు కూడా. మహిళల్లో అతనికి విపరీతమైన ఫాలోయింగ్ ఉండేదని మీకందరికీ తెలుసు. తన పక్కన పలానా వాళ్లని హీరోయిన్‌గా పెట్టమని ఎప్పుడూ చెప్పలేదు శోభన్‌బాబు. ఏ విషయంలోనూ జోక్యం చేసుకొనేవాడు కాదు. సబ్జెక్ట్ లైన్, తన పాత్ర, పారితోషికం... ఇవి మాత్రమే చూసుకునేవాడు. దర్శకనిర్మాతలమీద నమ్మకంతో మిగిలిన విషయాలు పట్టించుకునేవాడుకాదు. షూటింగ్ స్పాట్‌లో ఇంకో టేక్ చేద్దామా' అని అడిగితే 'చాల్లేరా.. ఎన్నిసార్లు చేసినా ఇంతకంటే ఎక్కువ రాదు' అనేవాడు. అలాగని వళ్లు దాచుకునేవాడు కాదు. కాకపోతే రిస్కీ షాట్స్‌కు దూరంగా ఉండేవాడు. అతను చేసింది ఎక్కువగా ఫ్యామిలీ డ్రామాలే కదా. ఫైట్లు తక్కువగా ఉండేవి. 'కోడెత్రాచు' వంటి కొన్ని సినిమాల్లో ఫైట్లు పెట్టాను. 'నా మీద ఫైట్లు ఎందుకురా.. ఎవరన్నా చూస్తారంటావా?' అనేవాడు. 'ఎప్పుడూ ఫ్యామిలీ డ్రామాలేనా.. యాక్షన్ సినిమాలు కూడా చేస్తే వెరయిటీగా ఉంటుందయ్యా' అనేవాడిని. 'అంతేనంటావా.. సరే కానీ' అని ఒప్పుకొనేవాడు.

హీరోలు ఎక్కువ తినకూడదు రా

శోభన్‌బాబు డబ్బు బాగానే సంపాదించాడు. నిర్మాతల ముక్కు పిండి తన పారితోషికం వసూలు చేసేవాడు అని అతని గురించి చెబుతుంటారు. అందులో తప్పేముంది? సినిమా చేసేముందు ఒప్పుకొన్న మొత్తాన్ని నిర్మాత చెల్లించాలి కదా. ఎవరికీ దానాలు చేయడు అంటారు. కష్టపడి సంపాదించుకున్న డబ్బును ఊరికే ఎందుకు ఖర్చు చేయాలి? పొద్దున్నే నాలుగున్నర, అయిదు గంటలకు లేచేవాడు. యోగా చేసేవాడు. ఏడున్నరకు లైట్‌గా టిఫిన్ తినేవాడు. తిండి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేవాడు. షూటింగ్ ఉంటే మేకప్ వేసుకుని షూటింగ్‌కు వచ్చేవాడు. మధ్యాహ్నం పెద్దగా తినేవాడు కాదు. ఇంటి దగ్గర నుంచి క్యారేజ్ వచ్చేది. 'చికెన్ బాగుంది... తిను' అని నేను అంటే ఒక్క ముక్క మాత్రం తిని ఇక చాలు అనేవాడు. 'మేం హీరోలం కదా.. ఎక్కువగా తినకూడదు రా' అని నవ్వేసేవాడు.

సాయంత్రం ఆరు దాటితే..

సాయంత్రం ఆరు దాటిందంటే చాలు షూటింగ్ స్పాట్‌లో ఉండేవాడు కాదు. ఆ విషయం ముందే చెప్పేవాడు. సినిమా ఒప్పుకోనేముందు 'నేను సాయంత్రం ఆరు గంటల తర్వాత ఒక్క నిముషం కూడా సెట్‌లో ఉండనండీ. ఐదున్నరకే నాకు మూడ్ ఆఫ్ అయిపోతుంది. ఐదున్నర తర్వాత నన్ను పంపించేస్తే బెటర్. సిక్స్ తర్వాత ఎట్టి పరిస్థితుల్లో చేయను. నైట్ తీయాల్సిన సన్నివేశాలు ఉన్నాయనుకోండి. పగలంతా నాకు రెస్ట్ ఇస్తే చేస్తా. లేకపోతే నైట్ షూటింగ్ చేయను. ఆదివారాలు అసలే చేయను' అని చెప్పేసేవాడు. దానికి ఇష్టపడిన వాళ్లకే సినిమా చేసేవాడు.

పర్‌ఫెక్ట్ లైఫ్ అతనిది. ఆరు గంటలకు ఇంటికి వెళ్లిన తర్వాత స్నానం చేసి ఫ్రెషప్ అయి, ఓల్డ్ బెంజ్ కారులో తన ప్రాపర్టీస్ ఎక్కడెక్కడ ఉన్నాయో ఒకసారి వెళ్లి చూసుకొనేవాడు. ఎవరన్నా కబ్జా చేస్తే లేనిపోని తంటా కదా!

కూతుళ్లకు పక్కపక్కనే ఇళ్లు కొని పెట్టాడు. ముగ్గురు కూతుళ్లు , ఒక కొడుకు. అందరూ సాయంత్రం ఏడున్నరకల్లా డిన్నర్ చేయడానికి తండ్రి దగ్గరకు వచ్చేవారు. మనవలు, మనవరాళ్లతో కలసి కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేసేవారు. ఆ తర్వాత న్యూస్ చూసి తొమ్మిది, తొమ్మిదిన్నరకల్లా పడుకొనేవాడు శోభన్‌బాబు. సిగరెట్, మందు ఇలాంటి అలవాట్లు అసలు లేవు. ఎటువంటి దురలవాట్లు లేని వ్యక్తి అలా హఠాత్తుగా చనిపోవడం దురదృష్టకరం.

(శోభన్‌బాబు జయంతి సందర్భంగా)

చిరంజీవికి అయోధ్య ఆహ్వానం



ఈ నెల 22న అయోధ్యలో జరగనున్న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనేందుకు చిరంజీవికి ప్రత్యేక ఆహ్వానం అందింది. శ్రీరామ జన్మభూమి ట్రస్ట్, విశ్వ హిందూ పరిషత్ జాతీయ నాయకులు గుర్రం సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీ శశిధర్ రావినూతల శనివారం చిరంజీవిని ఆయన ఇంట్లో కలిసి, ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'వందల సంవత్సరాల నిరీక్షణ ఫలించి, అయోధ్యలో రామాలయ నిర్మాణం, రామ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యరూపం దాల్చనుండడం ఆనందకరం. ఇలాంటి ఒక చారిత్రాత్మక ఘట్టంలో పాలు పంచుకోవడం గొప్ప అదృష్టం. ఈ ఆహ్వానాన్ని నాకు అందజేసిన రామజన్మభూమి ట్రస్ట్‌కు నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమానికి నా కుటుంబంతో హాజరవుతాను' అని అన్నారు. గుర్రం సంజీవరెడ్డి మాట్లాడుతూ 'తెలుగు చిత్ర పరిశ్రమలో మొదటి ఆహ్వానాన్ని చిరంజీవి గారికి అందజేశాం. ఆలయం కోసం సుదీర్ఘంగా జరిగిన న్యాయపోరాటం గురించీ, ఆలయ నిర్మాణ విశేషాలను గురించి ఆయన మాకు వివరించడం ఆశ్చర్యం కలిగించింది' అన్నారు. రామ్‌చరణ్‌కు కూడా వీహెచ్‌పీ ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానాన్ని అందజేశారు.



మెగా ఫ్యామిలీ సంక్రాంతి వేడుకలను జరుపుకోవడానికి బెంగళూరుకు పయనమయ్యారు. రామ్‌చరణ్, ఉపాసనా దంపతులు తమ కుమార్తె క్లీంకారతో కలిసి ఈ వేడుకకు బయలుదేరగా, వీరితోపాటు పవన్‌కల్యాణ్ కుమారుడు అఖిరానందన్, కుమార్తె ఆద్య కూడా ఉన్నారు. వీరందరూ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబ సమేతంగా కెమెరాలకు చిక్కారు.



కట్రీనాతో కలిసి నటించడానికి భయపడ్డా



హిందీ, తమిళ భాషల్లో రూపొందిన 'మెర్రీ క్రిస్మస్'తో మంచి హిట్ కొట్టారు అగ్రనటుడు విజయ్ సేతుపతి. ఈ నెల 12న సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా మీడియా సాక్షిగా ఆనందం వ్యక్తం చేస్తూ.. ఆసక్తికరమైన వాఖ్యలు చేశారు విజయ్ సేతుపతి. 'ఇందులో హీరోయిన్‌గా కట్రీనాకైఫ్‌ని ఖరారు చేశామని దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ చెప్పగానే షాక్ అయ్యా. మా కాంబినేషన్ సీన్స్ ఇందులో ఉంటాయా? అని అమాయకంగా అడిగాను. అంతేకాదు, లొకేషన్లో కట్రీనాతో కలిసి నటించడానికి భయపడ్డా కూడా. ఆమె ఎంత గొప్ప నటో తెలిసిందే కదా. అందుకే కాస్తంత భయం. నిర్మాణం జరుగుతున్న రోజుల్లో ఈ సినిమా ప్రస్తావన ఎక్కడైనా వచ్చినప్పుడు.. 'శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వంలో నటిస్తున్నాను' అనంటే.. 'అవునా..' అంటూ సింపుల్‌గా స్పందించే వాళ్లు. 'కట్రీనాకైఫ్ ఇందులో హీరోయిన్' అని చెబితే.. 'నువ్వు అతిథి పాత్ర చేస్తున్నావా? ఇది హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీనా?' అంటూ చిత్రమైన ప్రశ్నలు అడిగేవారు. ఏది ఏమైనా ఈ సినిమా మాత్రం నాకు ఓ వింత అనుభవాన్ని ఇచ్చింది.' అంటూ చెప్పుకొచ్చారు విజయ్ సేతుపతి.

కష్టపడటానికి సిద్ధంగా ఉన్నా




అమితాబ్ మనవడు అగస్త్యనంద బాలీవుడ్‌లో ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాడు. అమితాబ్ కుమార్తె శ్వేతాబచ్చన్ కుమారుడైన అగస్త్యనంద రీసెంట్‌గా 'ది అర్చీస్' అనే సినిమా ద్వారా చిత్రరంగ ప్రవేశం చేశారు. ఈ సినిమాలో తనతోపాటుగా షారుక్‌ఖాన్ కుమార్తె సుహానాఖాన్, శ్రీదేవి కుమార్తె ఖుషి కపూర్ కూడా తెరంగేట్రం చేయడం విశేషం. ఓటీటీలో విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మిశ్రమ స్పందన లభించగా, చలనచిత్ర ప్రముఖులు మాత్రం ఈ సినిమాతో పరిచయమైన సెలబ్రిటీ కిడ్స్‌పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈ సినిమాలోని తమ నటనపై సోషల్ మీడియాలో వినిపిస్తున్న ట్రోల్స్‌పై అగస్త్యనంద స్పందించారు. 'ట్రోలింగ్స్ ఎలా ఎదుర్కోవాలో నాకు తెలీదు. మా సినిమాను కొందరు విమర్శిస్తుంటే, మరికొందరు ప్రశంసిస్తున్నారు. అందరి అభిప్రాయాలనూ గౌరవించాల్సిందేనని తాతయ్య చెప్పారు. ఇది మా తొలి సినిమా. ఈ సినిమాలో నా నటన కొందరికి నచ్చకపోవచ్చు. నేను కష్టపడటానికి సిద్ధంగా ఉన్నాను. రెండుమూడు సినిమాల తర్వాత అయినా వాళ్లను నేను మెప్పిస్తాను' అని నమ్మకం వెలిబుచ్చారు అగస్త్యనంద. జోయా అక్తర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది.


మున్ముందూ సంక్రాంతి జోరు

సంక్రాంతి పండుగ చిత్ర పరిశ్రమకు కొత్త జోష్‌ని తెచ్చింది. పండుగకు మూడ్రోజుల ముందు నుంచే బాక్సాఫీసుకు కొత్త కళ వచ్చింది. ఏ సినిమా హిట్టు, ఏ సినిమా ఫట్టు అనే చర్చ ఎప్పుడూ నడిచేదే కానీ మొత్తంగా చూసుకుంటే ఈ ఏడు సంక్రాంతి రూపంలో పరిశ్రమకు ఆరంభం అదిరిందనే చెప్పాలి. ఫలితం ఎలా ఉన్నా ప్రతీ సినిమాకూ నాలుగు కాసులు రాలడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక ఓపెనర్లు ఇచ్చిన శుభారంభాన్ని తరువాత రాబోయే బ్యాట్స్‌మెన్లు కూడా కొనసాగించాలనేదే అటు పరిశ్రమ వర్గాలు, ఇటు ప్రేక్షకలోకం కోరుకునేది.


'సంక్రాంతికి ఎవరు రావాలి?, ఎవరు ఆగాలి?'... అనే ఎడతెగని చర్చతో తెలుగు చిత్ర పరిశ్రమ వారాల తరబడి వార్తల్లో నిలిచింది. పరిష్కారం కాకుండానే సినిమాలు స్క్రీన్లపైకి రావడం జరిగింది. రిలీజ్ డేట్‌కు ఖర్చీఫ్ వేసుకున్న సినిమాలు అన్నీ దాదాపు విడుదలవుతున్నట్లే. ప్రస్తుతానికైతే విడుదలైన అన్ని సినిమాలకూ టాక్‌తో సంబంధం లేకుండా ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది.


అగ్రహీరోల చిత్రాలు బరిలో దిగడంతో థియేటర్ల దగ్గర సంక్రాంతి సందడి మొదలైంది. అలాగే ఈ ఏడాది కూడా టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా చిత్రాల ఒరవడి మొదలైంది. ఈ సంక్రాంతికి 'హను-మాన్' చిత్రం తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా వచ్చి చక్కని ఆదరణతో కొనసాగుతోంది. చిన్న చిత్రంగా మొదలై ప్రచార చిత్రాలతో పాన్ ఇండియా స్థాయికి చేరింది. టాలీవుడ్‌తో పాటు పరభాషల్లోనూ మంచి టాక్ తెచ్చుకొంది. ఉత్తరాదినా 'హను-మాన్' ప్రభంజనం కొనసాగుతోంది. ఇక మహేశ్‌బాబు- దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'గుంటూరు కారం' చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. మహేశ్ స్వామినాకు పండుగ సీజన్ తోడవడంతో ఈ సినిమా భారీ వసూళ్లను రాబడుతోంది. సంక్రాంతి రేసులో బాక్సీఫీసు దగ్గర కలెక్షన్ల పరంగా 'గుంటూరు కారం' తన ఘాటు చూపించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక వెంకటేశ్ కథానాయకుడిగా 'హిట్' ఫేం శైలేశ్ కొలను రూపొందించిన 'సైంధవ్' చిత్రం సంక్రాంతి బరిలో నిలిచింది. వెంకటేశ్‌కు కుటుంబ ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ, మాస్ ఫాలోయింగ్‌ను మ్యాచ్ చేస్తూ శైలేష్ తీర్చిదిద్దిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇక 'సోగ్గాడు' నాగార్జున కూడా ఆనవాయితీగా సంక్రాంతి బరిలో నిలిచారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'నా సామిరంగ' చిత్రం నేడు (ఆదివారం) విడుదలవుతోంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ప్రేమకథకు వినోదం మేళవించి తెరకెక్కించిన చిత్రమిది. సినిమా విజయంపై నాగార్జున, చిత్రబృందం ధీమాగా ఉన్నారు. జయాపజయాల మాట పక్కనపెడితే ఈ సంక్రాంతి చిత్రపరిశ్రమకు కొత్త ఊపునూ, ఉత్సాహాన్ని ఇచ్చింది. ఫలితం అటూ ఇటూ అయినా మంచి వసూళ్లను రాబట్టుకునే అవకాశం ఉండడంతో థియేటర్ల సమస్య ఏర్పడినా నిర్మాతలు వెనుకాడలేదు.













సంక్రాంతికి తమ సినిమాలు రిలీజ్ చేసేందుకు వీరే కాదు మరికొందరు నిర్మాతలు కూడా ముందుకొచ్చినా ఆఖరి నిమిషంలో రిలీజ్‌ను కొత్త తేదీకి మార్చుకున్నారు. సంక్రాంతికి మూకుమ్మడిగా సినిమాలను విడుదల చేసి నష్టాలను మూటగట్టుకోవడం కన్నా కొత్త తేదీకి రిలీజ్ డేట్లు మార్చుకుంటే మేలు కలుగుతుందని పరిశ్రమ పెద్దలు చెప్పడంతో తమ సినిమాలను వాయిదా వేసుకొని, కొత్త రిలీజ్ డేట్లను ప్రకటించారు. సంక్రాంతి సినిమాలు దుమ్ము దులపడంతో అదే ఊపులో వీటికి కూడా చక్కటి ప్రేక్షకాదరణ లభిస్తుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

రవితేజ నటించిన 'ఈగల్' చిత్రం కూడా సంక్రాంతి రిలీజ్‌కు సిద్ధమైనా చివరి నిమిషంలో వాయిదా పడింది. ఫిబ్రవరి 9న ఈ చిత్రం విడుదలవుతోంది. 'రవితేజ చెప్పడంతో మా సినిమా వాయిదాకు అంగీకరించాం, అభిమానులు అంతా కాలర్ ఎగరేసుకునేలా 'ఈగల్' ఉంటుంది' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. మరికొన్ని సినిమాలు కూడా సంక్రాంతి తర్వాత ఒకట్రెండువారాల గ్యాప్‌తో థియేటర్లలోకి వస్తున్నాయి. వీటిలో తెలుగు స్ట్రెయిట్ చిత్రాల కన్నా డబ్బింగ్ చిత్రాలు ఎక్కువగా ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి.


రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన 'లాల్ సలామ్' చిత్రం తొలుత సంక్రాంతికి విడుదల చేయాలనుకున్నారు. తమిళంతో పాటు తెలుగులోనూ పెద్ద సినిమాలు విడుదలవుతుండడంతో రిలీజ్‌ను ఫిబ్రవరి 9కి వాయిదా వేశారు. రజనీకాంత్ కూతురు ఐశ్వర్య ధనుష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రజనీకాంత్ అల్లుడు ధనుష్ కూడా సంక్రాంతి సీజన్‌పై కన్నేశాడు. ఆయన హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'కెప్టెన్ మిల్లర్' తమిళ వెర్షన్ ఈ నెల 12న విడుదలైంది. తెలుగులోనూ అదే తేదీన రిలీజ్ చేయాలనుకున్నా సంక్రాంతికి థియేటర్ల కోసం పోటీ ఏర్పడడంతో విడుదల చేయలేదు. తర్వాత కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ నెల 25న 'కెప్టెన్ మిల్లర్' తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. బ్రిటిష్ కాలం నాటి కథతో భారీ స్థాయిలో తెరకెక్కిన ఈ చిత్రంపై తెలుగు ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు. శివ కార్తికేయన్ హీరోగా నటించిన 'అయలాన్' చిత్రం కూడా సంక్రాంతి బరిలో నిలిచినా తెలుగు వెర్షన్ చివరి నిమిషంలో వైదొలగింది. సంక్రాంతి విడుదలకు సిద్ధమైన ఈ చిత్రాలన్నింటిపైనా ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. అందుకే ఈ సంక్రాంతి జోరు చిత్ర పరిశ్రమలో మున్ముందూ కొనసాగే అవకాశముంది.


ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అమెరికన్ నైట్‌మెర్	వెబ్‌సిరీస్	జనవరి 17
మెర్రీ మెన్ 3	హాలీవుడ్ మూవీ	జనవరి 18
అమెజాన్ ప్రైమ్		
డెవిల్	తెలుగు చిత్రం	జనవరి 14
ఇండియన్ పోలీస్ ఫోర్స్	హిందీ సిరీస్	జనవరి 19
పంచాయత్	హిందీ సిరీస్ 3	జనవరి 15
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
జోయ్	తమిళ చిత్రం	జనవరి 15
లూక్ గూయెన్స్ ఇండియా	టీవీ షో	జనవరి 15
డెత్ అండ్ అదర్ డిటెయిల్స్	వెబ్‌సిరీస్	జనవరి 16
ఎక్స్‌ట్రా ఆర్డినరీ మాన్	తెలుగు చిత్రం	జనవరి 19
జియో సినిమా		
బెల్‌గ్రేవియా: ద నెక్స్ట్ చాప్టర్	వెబ్‌సిరీస్	జనవరి 15
ట్రూ డిటెక్టివ్	వెబ్‌సిరీస్ 4	జనవరి 15





ఆ పొరపాటే ఇతని కెరీర్‌ను నాశనం చేసింది!



అవినాశ్ వద్వాన్.... 90ల దశకంలో బాలీవుడ్‌ను ఓ ఊపు ఊపిన నటుడు. ఆ రోజుల్లో అక్షయ్‌కుమార్, సునీల్ శెట్టి వంటి నటులకు గట్టి పోటీ ఇచ్చారు అవినాశ్ 'దిల్ కి బాజీ', 'పాపీ గుడియా', 'గీత్' వంటి అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు. ముఖ్యంగా అవినాశ్, దివ్యభారతి జంట ఆ రోజుల్లో బాగా పాపులర్. అటు ప్రేక్షకుల మెప్పు, ఇటు పరిశ్రమ వర్గాల ప్రోత్సాహం అవినాశ్ పొందడంతో నటుడిగా అతనికి తిరుగులేదని అందరూ అనుకున్నారు. కానీ వ్యక్తిగత జీవితంలో చేసిన పొరపాటు వల్ల అతని కెరీర్‌కు కోలుకోలేని నష్టం కలిగింది. ఆ కారణంగా ఎన్నో అవకాశాలు పోగొట్టుకుని పరిశ్రమకు దూరం కావాల్సి వచ్చింది.

ఇంజనీరింగ్ పూర్తి చేసి ఎంబీఏ చదవడానికి ముంబై వచ్చిన అవినాశ్‌కు నటుడు కావాలనే కోరిక మొదట్లో లేదు. కానీ 'నువ్వు హీరోలా ఉన్నావ్.. సినిమాల్లో ట్రై చేయకూడదూ' అని హాస్టల్‌లో స్నేహితులు పదే పదే అంటుండడంతో అవినాష్‌లో ఆ ఆలోచన మొదలైంది. దానికి తోడు మంచి ఫిజిక్ ఉండడంతో ప్రయత్నించి చూద్దాం అనుకుని మొదట మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టారు అవినాశ్. ఇక అక్కడి నుంచి ఆయన నటుడు కావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. 1986లో వచ్చిన 'ప్యార్ హో గయా' చిత్రంలో అవినాశ్ తొలిసారిగా నటించారు. ఆ సినిమాతో అందరి దృష్టి ఆయనపై పడడంతో పెద్ద పెద్ద సినిమాల్లో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చాయి. చేతినిండా అవకాశాలు, డబ్బు.. ఆయన జాతకమే మారిపోయింది.

అయితే ఆయన వైవాహిక జీవితం మాత్రం అంత సంతృప్తికరంగా ఉండేది కాదు. భార్యతో గొడవలు, చికాకుల వల్ల చాలా సినిమాలు వదులుకోవాల్సి వచ్చింది. మొదటి భార్యకు విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకోవడం, సీన్ రిపీట్ అవడం.. అవినాశ్ కెరీర్ మీద ప్రభావం చూపించింది. దానివల్ల తెర మరుగయ్యారు. చాలా ఏళ్ల తర్వాత అవినాశ్ మళ్లీ ఇప్పుడు నటన మొదలు పెట్టారు. వెబ్ సిరీస్, టీవీ సీరియల్స్‌లో నటిస్తూ పూర్వ వైభవం పొందడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరి కాలం కలసి వస్తుందేమో చూడాలి!


అవతార్ స్థాయి సినిమా అనొచ్చు



దీపికా పదుకొణే అద్భుతమైన సౌందర్యరాశి. అందులో సందేహమేలేదు. ఆమె అందానికి అభిమానులు కోకొల్లలు. అయితే.. పాత్ర కోసం అందవిహీనంగా కనిపించడానికి కూడా దీపికా వెనుకాడరు. నటనంటే తనకు అంతిష్టం. ప్రస్తుతం ప్రభాస్‌తో కలిసి ఆమె నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో ఆమె డీగ్లామరైజ్డ్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర గురించి ఇటీవల ఆమె మాట్లాడారు. 'ఈ కథ మన దేశానికే కాదు, ప్రపంచానికే కొత్త కథ. 'అవతార్' స్థాయి సినిమా అనొచ్చు. నాగ్ అశ్విన్ ఎంచుకున్న కాన్సెప్ట్ అలాంటిది. మన పురాణాలు, ఇతిహాసాలు భవిష్యత్తును కూడా సూచిస్తుంటాయి. ఓ విధంగా ఈ సినిమా కథ అదే. ఇంతకంటే చెప్పకూడదు. అద్భుతాన్ని చూస్తూ ఆస్వాదిస్తేనే కిక్కు. ఇక ఇందులో నా కెరీర్‌కే మైలురాయి లాంటి పాత్ర చేస్తున్నాను. ఈ సినిమా ఓ భయంకర పోరాటం. ఆ పోరాటంలో నేను ఓ ఆయుధాన్ని. నా పాత్రను అందరూ ప్రేమిస్తారు.' అని తెలిపారు దీపిక.

తెలంగాణ గిరిజన గురుకులాల్లో
ఇంటర్ ప్రవేశాలు

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 14 జనవరి 2024
diksuchi@andhrajyothy.com



తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) కాలేజీల్లో జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీటీడబ్ల్యూఆర్ సీఓఈ సెట్) 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. తెలుగు మీడియంలో చదువుకున్నవారు కూడా ఈ టెస్ట్ రాయవచ్చు. ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ పొందినవారికి అకడమిక్ బోధనతోపాటు ఐఐటీ, నీట్ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అభ్యర్థులు ఇంగ్లీష్ మీడియంలో చదవాల్సి ఉంటుంది. సెకండ్ లాంగ్వేజ్ తెలుగు మాత్రమే ఉంటుంది. బాలురకు, బాలికలకు విడివిడిగా కళాశాలలు ఉన్నాయి. భోజనం, వసతి ఉచితం. డ్రెస్‌లు, బుక్స్ ఇస్తారు. స్టేషనరీ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు, మెడికల్ ఖర్చులు, పరీక్ష ఫీజు తదితరాలు కూడా చెల్లిస్తారు.

సీట్ల వివరాలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన సీఓఈ కళాశాలల్లో మొత్తం 1140 సీట్లు ఉన్నాయి. ఎంపీసీ గ్రూప్‌లో బాలురకు 335, బాలికలకు 240 సీట్లు; బైపీసీ గ్రూప్‌లో బాలురకు 325, బాలికలకు 240 సీట్లు ఉన్నాయి. ప్రతి గిరిజన గురుకుల సీఓఈ కళాశాలలో ఒక్కో గ్రూప్‌లో కనీసం 40 సీట్లు ఉన్నాయి.

- ప్రీమియర్, నాన్ ప్రీమియర్ సీఓఈ కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులు దరఖాస్తులో తాము చేరదలచుకొన్న సీఓఈ కళాశాలల ప్రాధాన్య క్రమాన్ని సూచించాలి.

బాలుర సీఓఈ కళాశాలలు

- **ప్రీమియర్ సీఓఈ కళాశాలలు:** రంగారెడ్డి - రాజేంద్రనగర్ ఐఐటీ స్టడీ సెంటర్, ఖమ్మం, వరంగల్-యాకుబ్‌పుర.
- **నాన్ ప్రీమియర్ సీఓఈ కళాశాలలు:** నల్లగొండ-మిర్యాలగూడ, మెదక్-నర్సాపూర్, సిద్దిపేట్-హుస్నాబాద్, భద్రాద్రి కొత్తగూడెం(కేఎస్‌డీ సైట్), భద్రాద్రి కొత్తగూడెం-దమ్మపేట గిరిజన గురుకులాలు.

బాలికల సీఓఈ కళాశాలలు

- **ప్రీమియర్ సీఓఈ కళాశాలలు:** వరంగల్, వికారాబాద్-పరిగి
- **నాన్ ప్రీమియర్ సీఓఈ కళాశాలలు:** వనపర్తి, నాగర్‌కర్నూల్-కల్వకుర్తి, నల్లగొండ-దేవరకొండ, భద్రాద్రి కొత్తగూడెం-భద్రాచలం గిరిజన గురుకులాలు

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ విద్యార్థులు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు ఆగస్టు 31 నాటికి 19 ఏళ్లలోపు ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; నగరాల్లో రూ.2,00,000 మించకూడదు.

ఎంట్రెన్స్ టెస్ట్(సీఓఈ 2024) వివరాలు: ఇందులో రెండు స్ర్కీనింగ్ టెస్ట్‌లు ఉంటాయి. మొదటిది ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. రెండోది డిస్క్రిప్టివ్ టెస్ట్. ప్రశ్నలన్నీ ఎనిమిదో తరగతి నుంచి పదోతరగతి వరకు ఉన్న సిలబస్ ప్రకారం ఉంటాయి. ప్రశ్నపత్రాలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు.

- మొదటి స్ర్కీనింగ్ టెస్ట్: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మొత్తం 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ అభ్యర్థులకు ఇంగ్లీష్ నుంచి 20, మేథ్స్ నుంచి 60, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. బైపీసీ అభ్యర్థులకు ఇంగ్లీష్ నుంచి 20, మేథ్స్ నుంచి 20, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40, బయోసైన్స్ నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లూ/బ్లాక్ పెన్‌తో గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 160. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు.
- రెండో స్ర్కీనింగ్ టెస్ట్: మొదటి టెస్ట్‌లో అర్హత పొందినవారిని 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసి రెండో టెస్ట్‌కు అనుమతిస్తారు. ఇందులో మేథ్స్/బయోసైన్స్‌కు 45, ఫిజిక్స్‌కు 45, కెమిస్ట్రీకి 45, ఇంగ్లీష్‌కు 15 మార్కులు చొప్పున మొత్తం 150 మార్కులు నిర్దేశించారు. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ప్రకారమే సీఓఈల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** 200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 12 నుంచి 17 వరకు
- **లెవెల్ 1 స్ర్కీనింగ్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి 18న
- **లెవెల్ 2 స్ర్కీనింగ్ టెస్ట్ తేదీ:** మార్చి 10న
- **వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in

నిట్ రూర్కెలాలో ఎంబీఏ

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీఆర్‌కేఎల్)- మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 75 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్/ఎక్స్‌ఏటీ/మ్యాట్/సీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్‌కు 40 శాతం, అకడమిక్ ప్రతిభకు 30 శాతం, అనుభవానికి 10 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 10 శాతం వెయిటేజీ ఇస్తూ కనీసం 50 శాతం స్కోర్ సాధించిన అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 15
- **జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఫిబ్రవరి 29
- **జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మార్చి 18, 19
- **అడ్మిషన్స్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మార్చి 29
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **మొదటి సెమిస్టర్‌కు రిజిస్ట్రేషన్:** జూలై 22 నుంచి
- **మొదటి సెమిస్టర్ ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 24 నుంచి
- **వెబ్‌సైట్:** www.nitrkl.ac.in

బిట్స్ పిలానీలో ఎంబీఏ బిజినెస్ అనలిటిక్స్

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) - ఎంబీఏ ఇన్ బిజినెస్ అనలిటిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. బిజినెస్ అనలిటిక్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (బీఏఏటీ) 2024 మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఫైనాన్షియల్ అసిస్టెంట్‌షిప్ సౌకర్యం ఉంది.



ప్రోగ్రామ్ వివరాలు: ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ విభాగాలకు సంబంధించి అనలిటికల్ ట్రెయినింగ్ ఇస్తారు. టెక్నాలజీ అప్లికేషన్స్ వివరిస్తారు. క్యాంపస్ తరగతులు ఉంటాయి. ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్క్‌షాప్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు, కేస్ స్టడీస్, ఇండస్ట్రీ ప్రముఖులతో ఇంటరాక్షన్ మీటింగ్స్, ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ ఉంటాయి. సెమిస్టర్‌కు నిర్దేశించిన ప్రకారం కోర్ సబ్జెక్టులు, ఎలక్టివ్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 1 నాటికి డిగ్రీ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఇంటర్/పన్నెండోతరగతి/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లకు సంబంధించిన పరిజ్ఞానం ఉండాలి. క్యాట్ 2023/ఎక్స్ఏటీ 2024/జీమ్యాట్ 2023 అర్హత, ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

బీఏఏటీ 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే అడుగుతారు. ఈ టెస్ట్‌లో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటిది మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ సెక్షన్. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో వెర్బల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. రెండోది అనలిటిక్స్ ఆప్టిట్యూడ్ సెక్షన్. పరీక్ష సమయం గంట. ఇందులో కంప్యూటర్స్, మేథమెటిక్స్‌కు సంబంధించిన బేసిక్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు అడుగుతారు.

ఎంపిక: బీఏఏటీ 2024లో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలో ఎంపికైనవారికి సంబంధించిన బీఏఏటీ స్కోర్, ఇంటర్వ్యూ స్కోర్, జాతీయ పరీక్ష స్కోర్, అనుభవం, అకడమిక్ మెరిట్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ స్కిల్స్ తదితరాలను పరిశీలించి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.3300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 19
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** ఫిబ్రవరి 28 నుంచి మార్చి 4 వరకు
- **బీఏఏటీ అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడింగ్:** మార్చి 18 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- బీఏఏటీ 2024 తేదీ: ఏప్రిల్ 7
- **ఆన్‌లైన్ మోడ్‌లో గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 13 నుంచి
- **వెబ్‌సైట్:** www.bitsadmission.com

ఎయిమ్స్ మంగళగిరిలో ఫ్యాకల్టీ

మొత్తం ఖాళీలు **125**

మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-ఎ పోస్టులు

1. **ప్రొఫెసర్:** 20 పోస్టులు
2. **అసిస్టెంట్ ప్రొఫెసర్:** 73 పోస్టులు
3. **అడిషనల్ ప్రొఫెసర్:** 10 పోస్టులు
4. **అసోసియేట్ ప్రొఫెసర్:** 22 పోస్టులు

విభాగాలు: అనస్థీషియాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, బయోస్టాటిస్టిక్స్, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఎండోక్రినాలజీ, సైకియాట్రీ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ, ఎండీ / ఎంఎస్/ ఎంసీహెచ్/ డీఎం ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్ ఖాళీలకు 58 ఏళ్లు; ఇతర పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్, రిక్రూట్‌మెంట్ సెల్, రూం నెంబరు 216, 2వ అంతస్తు, లైబ్రరీ అండ్ అడ్మిన్ బిల్డింగ్, ఎయిమ్స్, మంగళగిరి, గుంటూరు చిరునామాకు పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 29

హార్డ్ కాపీ స్వీకరణకు చివరి తేదీ: ఫిబ్రవరి 8

వెబ్‌సైట్: https://www.aiims-mangalagiri.edu.in/

డీఆర్‌డీవోలో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు **60**

చెన్నై అవడిలోని డీఆర్‌డీవో-కంబాట్ వెహికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీవీఆర్‌డీఈ)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ట్రేడ్: కార్పెంటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెడికల్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెషినిస్ట్, మెకానిక్, టర్నర్, వెల్డర్

అర్హతలు: సంబంధిత ట్రేడులో ఐటీఐ 2021/2022/2023 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే అర్హులు.

వయోపరిమితి: 2023 డిసెంబరు 1 నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.

స్టయిపెండ్: నెలకు రూ.7,700 నుంచి రూ.8,050

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: వార్తాపత్రికలో ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: www.drdo.gov.in/

సెయిల్‌లో మెడికల్ ఆఫీసర్లు

రౌర్కెలాలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. మెడికల్ ఆఫీసర్(ఇ-1): **05 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్(బయో మెడికల్): **1 పోస్టు**

అర్హత: ఎంబీబీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణత

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20

వెబ్‌సైట్: sailcareers.com

సీసీఎంబీలో జూనియర్ స్టెనోగ్రాఫర్‌లు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ..కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు: 5**

అర్హత: 10+2/పన్నెండో తరగతి ఉత్తీర్ణతతోపాటు స్టెనోగ్రఫీలో నైపుణ్యం కలిగి ఉండాలి.

వయోపరిమితి: 27 ఏళ్లు మించకూడదు

ఎంపిక: రాత పరీక్ష, ప్రొఫిషియెన్సీ టెస్ట్/ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20

దరఖాస్తు హార్డ్ కాపీ స్వీకరణకు చివరి తేదీ: జనవరి 29

వెబ్‌సైట్: www.ccmb.res.in/Careers/ProjectPositions

శ్రీకాకుళంలో పారామెడికల్ పోస్టులు

శ్రీకాకుళంలోని వైద్య సంస్థల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది.

వైద్య సంస్థలు: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

ఖాళీలు: బుక్ బేరర్, డీఈవో/కంప్యూటర్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, స్పీచ్ థెరపిస్ట్, పర్సనల్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అసిస్టెంట్ లైబ్రేరియన్, ల్యాబ్ అటెండెంట్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 42 సంవత్సరాలు మించకూడదు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, శ్రీకాకుళంలోని నిర్దిష్ట కౌంటర్లలో అందజేయాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20

వెబ్‌సైట్: https://srikakulam.ap.gov.in/

పీడీఐఎల్‌లో ఖాళీలు

నోయిడాలోని ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్(పీడీఐఎల్)... కాంట్రాక్ట్ ప్రాతిపదికన తాల్చేర్ ఫర్టిలైజర్ లిమిటెడ్(ఒడిశా) ప్రాజెక్ట్ సైట్‌లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఇంజనీర్/ఎగ్జిక్యూటివ్

విభాగాలు: సివిల్(కన్‌స్ట్రక్షన్), ఎలక్ట్రికల్(కన్‌స్ట్రక్షన్), ఇన్‌స్ట్రుమెంటేషన్(కన్‌స్ట్రక్షన్), మెకానికల్(కన్‌స్ట్రక్షన్), సేఫ్టీ ప్రాసెస్(కమిషనింగ్), ప్లానింగ్, హ్యూమన్ రిసోర్సెస్.

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 17

ఇంటర్వ్యూ తేదీలు: 2024 ఫిబ్రవరి నుంచి 6 వరకు

వేదిక: పీడీఐఎల్ భవన్, నోయిడా

వెబ్‌సైట్: https://www.pdilin.com/



లిటిల్స్




మీకు తెలుసా?

- తల దగ్గర ఎరుపు, పసుపు పచ్చ రంగు ఉండి రెక్కల మీద చుక్కలు ఉండే ఈ బుజ్జిపక్షిని రెడ్, యల్లో బార్బెట్ అని పిలుస్తారు. ఆఫ్రికాలో ఎక్కువగా కెన్యా, టాంజానియా, ఇథియోపియా, సూడాన్, ఉగండా దేశాల్లో కనిపిస్తాయివి.
- ఆడపక్షులు, యంగ్‌గా ఉండే పక్షుల్లో ఎరుపు, పసుపు పచ్చ రంగు తక్కువగా ఉంటుంది.
- సుమారు 9 ఇంచులు పొడవు ఉండే ఈ పక్షులు కేవలం మూడేళ్లు బతుకుతాయి.
- ఇవి ఇళ్లలో, అడవిలో నిలబెట్టిన కార్ల అద్దాలు క్లోజ్ చేయకుంటే అందులో ఉండే ఆహారాన్ని పసిగట్టి తింటాయి.
- చెట్లమీదతో పాటు మట్టిలో తిరగటానికి ఇష్టపడతాయి. ముఖ్యంగా చీమల పుట్టల దగ్గర తాచ్చాడుతుంటాయి. మట్టిమీదనే గూళ్లు కట్టుకుంటాయి. పురుగులు, కీటకాలు, చిన్నచేపలను తింటాయి.




- ఇవి అలారమ్‌లా కంటిన్యూగా అరుస్తాయి. నాలుగు లేదా ఐదు గుడ్లు మాత్రమే పెడతాయి. రెండు వారాలు పాటు పొదుగుతాయి.
- బరువు 75 గ్రాములు ఉంటాయి. గుంపుగా ఉంటే మాత్రం కనీసం పది పక్షులు ఉంటాయి. చిన్న గుంపుల్లో మూడు పక్షులు కూడా ఉంటాయి.
- ఆఫ్రికాలో వీటి జాతి 42 రకాలు ఉంటే.. ఆసియాలో 30 రకాల బార్బెట్‌లు ఉంటాయి.
- రెయిన్ ఫారెస్ట్ ప్రాంతాల్లో నివసించటానికే ఇష్టపడతాయి. అక్కడే కనీసం 70 శాతం పక్షులుంటాయి.
- 50 నుంచి 120 ఎకరాల పరిధిలోనే తిరుగుతూ ఉంటాయి.


దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



చుక్కలు కలపండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 204

		4			3		5	
5				9	6			
7	6							9
	7			2			8	
	1	8	6		4	7	2	
	3			8			1	
3							9	2
			3	5				1
	4		9			5		

సుడోకు - 203 సమాధానం

1	6	5	4	2	3	9	8	7
8	4	9	7	6	5	1	3	2
3	2	7	8	9	1	6	5	4
7	3	8	6	5	4	2	1	9
5	1	4	2	3	9	8	7	6
6	9	2	1	7	8	5	4	3
4	7	6	5	1	2	3	9	8
9	8	1	3	4	6	7	2	5
2	5	3	9	8	7	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.